


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సిఎంఆర్ బియ్యం నిల్వల్లో గోల్‌మాల్ 03

మద్యం షాపుల అప్లికేషన్ల గడువు ఎలా పెంచారు
ప్రభుత్వ వివరణకు ఆదేశించిన హైకోర్టు 04

సంపుటి 08, సంచిక: 323 | శనివారం | 25-10-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక 58 మంది పోటీ

● ఈసారి బ్యాలెట్ యూనిట్‌లో అభ్యర్థుల కలర్ ఫొటో ● మొత్తం ఓటర్లు 4,01,365
● రాజకీయ పార్టీలు ఓటర్ స్లిప్‌పు పంచితే కేసులు
● హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్నికలలో 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, నోటాతో కలిపి మొత్తం 59 మంది అభ్యర్థులని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఈసారి బ్యాలెట్ యూనిట్‌లో అభ్యర్థుల కలర్ ఫోటో ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై ఆయన జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. మొత్తం 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఇవిఎంల ద్వారా ఈ ఎన్నిక కోసం 4 బ్యాలెట్ యూనిట్‌లను వాడుతున్నట్లు చెప్పారు. ఫలితంగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్ సాధారణ సైజు కంటే పెద్దగా ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రిసైడింగ్ అధికారికి తప్ప ఓటర్లకు, ఏజెంట్లకు, ఇతర పోలింగ్ పర్సన్‌లు, భద్రతా సిబ్బందికి అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజవర్గ ఉప ఎన్నికకు సంబంధించి 407 పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జూబ్లీహిల్స్ లో మొత్తం 4 లక్షల 13వందల 65 ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరిలో 2 లక్షల8 వేల 561 పురుష ఓటర్లు, లక్షా 92వేల779 మహిళల ఓట్లు,25 ఇతరుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఓటర్ స్లిప్ ఐడెంటిటీ కాదన్నారు. ఎలాంటి 12 రకాల గుర్తింపు కార్డులలో ఏది తెచ్చినా ఓటు వేయొచ్చు అన్నారు. పోలింగ్ స్టేషన్‌లోనే సెల్ ఫోన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయా పార్టీలు ఓటర్ స్లిప్పులు పంచితే కేసులు నమోదు చేస్తామని తరువాయి 2లో



## బస్సులో అగ్నికీలలు

## 19 మంది సజీవ దహనం

● కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
● బైక్‌ను ఢీకొన్న అనంతరం బస్సులో ఎగిసిన మంటలు ● ప్రమాదంలో బైక్ రైడర్ సైతం మృతి
● మృతుల్లో ఆరుగురు తెలంగాణవాసులు
● రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
● ప్రమాదస్థలిని పరిశీలించిన మంత్రి జూపల్లి
● మాంసం ముద్దలు, అస్థిపంజరాలతో ఘటనా స్థలివద్ద భయానక వాతావరణం

# ఆహుతైన ప్రాణాలు

**కర్నూలు :** ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలో అత్యంత ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళుతున్న బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో హఠాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయి. గాఢ నిద్రలో ఉన్న 19 మంది సజీవదహనమయ్యారు. ఘటనలో బైక్ రైడర్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. కర్నూలు జిల్లా ఉలిందకొండ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్ నుండి బెంగుళూరు వైపు వెళుతున్న వేమూరి కావేరీ ట్రావెల్స్‌కు చెందిన వోల్వా బస్సు హైదరాబాద్‌లో రాత్రి 9:30 నిమిషాలకు బయలు దేరింది. 44వ జాతీయ రహదారిపై కర్నూలు దాటిన తరువాత ఉలిందకొండ సమీపంలో తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో రోడ్డుపై ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని సుమారు 25 మీటర్లు లాక్కుపోయింది. బైక్ బస్సు ఇంజనులో ఇరుక్కుపోయి ఒక్కసారిగా బస్సులో మంటలు వ్యాపించడంతో అందులో ప్రయాణిస్తున్నవారు సజీవదహనం అయ్యారు. ఎమర్జెన్సీ డోర్ నుంచి కిందకు దూకి సుమారు 27 మంది బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. బస్సు పూర్తిగా అగ్నికి ఆహూతి కావడంతో మాంసపు ముద్దలు తప్ప ఆనవాళ్లు కూడా మిగల్లేదు. చంటిపిల్లను హత్తుకొని ఒక తల్లి దహనం అయినట్లు తెలిసింది. గాయాలపాలైన 9 మందిలో కొందరు కర్నూలు ప్రభుత్వ తరువాయి 2లో





## అంగన్‌వాడీ కేంద్రాల్లో లోపాలు సహించం

● సరుకుల సరఫరాలో అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు
● మంత్రి సీతక్క హెచ్చరిక ● కొన్ని జిల్లాల్లో సరుకుల సరఫరా 50 శాతానికి కూడా చేరడంలేదని అసంతృప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాలో ఎటువంటి లోపాలు ఉండకూడదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. కొన్ని జిల్లాల్లో సరు కుల సరఫరా 50 శాతానికి చేరడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరి సరఫరాదారులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల లోపు అంగన్వాడీ కేంద్రాలు తప్పనిసరిగా ప్రారంభం కావాలన్నారు. కేంద్రాలు ఆలస్యంగా తెరుచుకుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులతో (డిడబ్ల్యుఒ) హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్క శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలమృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువుల సరఫరాపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదన్నారు. చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది పూర్తి బాధ్యత వహించాలని ఆదేశిస్తూ, హోమ్ రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తరువాయి 2లో

## అడ్డుకునే శక్తులను ఏకాకులను చేయాలి

● అప్పుడే బిసి రిజర్వేషన్‌ల సాధనలో విజయం సాధిస్తాం
● బిసిల మహాధర్నాలో పలువురు వక్తలు



ప్రజాపక్షం/హైదరాబాద్

గతంలో విపి సింగ్ ప్రభుత్వం రిజర్వేషన్‌లు చేసినప్పుడు దేశంలో సామాజిక ఉద్యమాలకు అడ్డుపడిన శక్తులే ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్‌లకు అడ్డుపడుతున్నాయని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. అడ్డుకునే శక్తులను ఏకాకులను చేస్తేనే 42 శాతం రిజర్వేషన్‌ల సాధనలో విజయం సాధిస్తామన్నారు. బిసి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద శుక్రవారం 42 శాతం బిసి రిజర్వేషన్‌ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ 'బిసిల మహా ధర్నా' పేరిట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, 42 శాతం బిసి రిజర్వేషన్ సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, విశారదన్ మహారాజ్, బాలగౌని బాలరాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్, బిసి నాయకులు చెరుకు సుధాకర్, ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు, నరసింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలని 'మేమెంతో మా వాటా అంతా' అని నినాదంతో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక ఉద్యమాలు కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యంగా తెలంగాణలో విద్యాపరంగా కానీ, ఉద్యోగ పరంగా కానీ అన్ని రంగాల్లో అత్యధికంగా ఉన్న బిసిలు వెనుబడ్డారన్నారు. శాసనసభలో బిసి బిల్లుకు అన్ని రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన తరువాత గవర్నర్‌కు, కేంద్ర ప్రభుత్వానికి పంపిన తరువాత అనేక రకాల పరిణామాలు జరిగాయన్నారు. నోటితో చెప్పి నొసటితో వెక్కిరిస్తున్న పరిస్థితి కనపడుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీల శాసనసభ్యులు బిసి బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు నటిస్తూ, బిసి బిల్లును అడ్డుకుంటున్న పరిస్థితి కనపడుతుందని విమర్శించారు. బిసి సమాజం, బిసి యువతరం, బిసి ఉద్యమ నాయకత్వం ఆలోచన చేయాలన్నారు. బిసి రిజర్వేషన్‌లకు అడ్డుపడుతున్నదేవరో అనే విషయంపై స్పష్టమైన వైఖరి ఉంటే ముందుకు తరువాయి 2లో



## తమిళనాడులో ఎస్ఐఆర్

వారంలోపు ప్రక్రియ ప్రారంభిస్తామని మద్రాస్ హైకోర్టుకు ఇసిఐ వెల్లడి

**చెన్నై :** తమిళనాడులో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ వారంలోపు ప్రారంభమవుతుందని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) శుక్రవారం మద్రాస్ హైకోర్టుకు తెలియజేసింది. చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుల్ మురుగన్లతో కూడిన ధర్మాసనం ముందు ఇసిఐ తమ వాదనను వినిపించింది. టి.నగర్ నియోజకవర్గంలోని 229 బూత్‌లను పూర్తిగా, పారదర్శకంగా తిరిగి ధృవీకరించాలని కోరుతూ అన్నాడిఎంకె మాజీ ఎమ్మెల్యే బి సత్యనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. పిటిషనర్ ఆందోళనలను ఎస్ఐఆర్ పరిష్కరిస్తుందని సిసిఐ స్టాండింగ్ కౌన్సిల్ నిరంజన్ రాజగోపాల్ కోర్టుకు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో టి.నగర్ నుండి తరువాయి 12లో

## మున్సిపాలిటీలకు భారీ నిధులు



● రూ.2780 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం ● 138 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 2432 అభివృద్ధి పనులకు ఆమోదం
● వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం/ హైదరాబాద్

రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలలో రూ.2780 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ కోర్ అర్బన్ సిటీని మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ ఈ నిధులు మంజూరు చేసింది. తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా ఉన్న పట్టణాలను గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. పట్టణాలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం సమాచారం ప్రకారం ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీల తరువాయి 2లో

## ఎసిబిలో అవినీతి!

● ఓ కేసులో రూ.20 లక్షల లంచం
● మరో రూ.80 లక్షల కోసం వేధింపులు
● ఎసిబి డిజి చారుసిన్హాకు బాధితుల ఫిర్యాదు



ప్రజాపక్షం/హైదరాబాద్

అవినీతి అధికారుల భరతం పట్టే తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)లోనే అవినీతి కంపు కొడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి." లంచం ఇస్తావా లేదంటే బినామి ఆస్తులను జప్తు చేయమంటావా" అంటు ఎసిబి అధికారులు వేధింపులకు గురి చేస్తున్న సంఘటన ఇది. ఆదాయానికి మించిన ఓ ఆస్తుల కేసులో నిందితుడికి చెందిన బినామి ఆస్తుల జప్తు విషయంలో ఓ ఎసిబి డిఎస్పి రూ.20 లక్షలు లంచం తీసుకున్నారని, మిగిలిన రూ.80 లక్షల కోసం తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఇద్దరు బాధితులు శుక్రవారం ఎసిబి డిజి చారుసిన్హాకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన వరంగల్ రేంజ్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే..వరంగల్ రేంజ్‌లో ఆగస్టు 29 ఓ రెవెన్యూ అధికారి (ఎంఆర్ఒ) ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడని ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో సదరు అధికారి ఇంట్లో సోదాలు నిర్వహించిన అధికారులకు ఆశించినంత ఆస్తులు లభించలేదు. దీంతో ఆ కేసులో బినామీల సునామీ సృష్టించేందుకు అధికారులు పథకం వేశారు. ఇందులో భాగంగా ఆ రెవెన్యూ అధికారి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుని వాట్సప్ డేటాను సేకరించారు. అంతటితో ఆగకుండా ఈ కేసులో 50మంది పైచిలుకు వ్యక్తులకు తరువాయి 2లో

## అత్యంత చేరువలో...

● భారత్, అమెరికా దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం
● ఇరు వైపులా చాలా అంశాలు కొలిక్కి

**న్యూఢిల్లీ :** భారత్, అమెరికా దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం తుదిరూపం తీసుకోవడం 'అత్యంత చేరువ'లో ఉందని అధికారిక వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఇరు వైపుల చాలా అంశాలు కొలిక్కి వచ్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఇరు దేశాలు ఒప్పందంలో పదాలపై అంశాలను పరిష్కరించుకుంటున్నట్లు పేర్కొన్నాయి. ఒప్పందానికి సంబంధించినంత వరకు అత్యంత చేరువలో ఉన్నామని, తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## ఈ నెలాఖరులో
# దక్షిణకొరియా పర్యటనకు జిన్‌పింగ్

### చైనా అధికారిక ధ్రువీకరణ



**బీజింగ్/సియోల్:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ దక్షిణ కొరియాకు పర్యటన చేయనున్నట్లు చైనా శుక్రవారం అధికారికంగా ధ్రువీకరించింది. ఈ సందర్భంగా ఆయన 'ఎపెక్' శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడమేగాక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కీలక సమావేశం జరపనున్నారు. ఈ భేటీ ద్వారా ఇరుదేశాల మధ్య పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలను సడలించే ప్రయత్నం జరుగనుంది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ తెలిపిన ప్రకారం, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఆహ్వానం మేరకు జిన్‌పింగ్ ఈనెల 30 నుండి నవంబర్ 1 వరకు గ్యాంగ్జు నగరంలో జరిగే 32వ 'ఎపెక్' ఆర్థిక నాయకుల సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో ఆయన అధికారిక రాష్ట్రమర్యాదా పర్యటన కూడా చేస్తారు. వైట్ హౌస్ ఇప్పటికే ట్రంప్, జిన్‌పింగ్ ఈనెల 30న దక్షిణ కొరియాలో భేటీ అవుతారని ప్రకటించింది. అయితే బీజింగ్ మాత్రం ఈ సమావేశంపై తొలిసారి స్పందించింది. జిన్‌పింగ్‌తో ట్రంప్ సమావేశాన్ని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి క్యారోలైన్ లేవిట్ ప్రకటించారు. మలేషియా, జపాన్, దక్షిణ కొరియాల్లో జరిగే మూడు దేశాల ఆసియా పర్యటన ముగింపు సందర్భంగా, బుసాన్ నగరంలో వీరి సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఇలావుంటే, ఈ భేటీని ప్రప ంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల నేతల మధ్య జరుగుతున్న కీలక దౌత్య సం ఘటనగా పరిగణిస్తున్నారు. ఇటీవలి వారాల్లో బీజింగ్ రేర్ ఎర్త్ ఎగుమతులపై కఠిన నియంత్రణలు విధిస్తుందనే సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో, అమెరికా కొత్త సుంకాలు, సాంకేతిక పరిమితులను అమలు చేయనున్నట్టు హెచ్చరించింది. వాణిజ్య యుద్ధం తీవ్రత పెరిగిన కారణంగా ఈ సమావేశాన్ని ట్రంప్ రద్దు చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైనప్పటికీ, వివిధ అంశాలపై ఒక ఒప్పందాన్ని తాను ఆశిస్తున్నట్టు ప్రకటించారు. ట్రంప్ ఈ ప్రకటన చేసిన మరుసటి రోజు, జిన్‌పింగ్‌తో భేటీని వైట్‌హౌస్ అధికారికంగా వెల్లడించింది. వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడినప్పుడు, తాను జిన్‌పింగ్‌తో చర్చించే అంశాలలో మొదటిగా చైనా నుండి అమెరికాకు దిగుమతి అవుతున్న ఫెంటనిల్ పదార్థాలపైనే ఉంటుందని తెలిపారు. ఫెంటనిల్ అమెరికాలో ఓపియాయిడ్ సంక్షోభానికి కారణమని అమెరికా తరచూ చైనాపై ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశం అద్భుతాలు సృష్టింఏ అవకాశాలు లేవని కాబట్టి, పెద్ద స్థాయి ఒప్పందం లేదా తక్షణ మార్పు ఆశించవద్దని వాషింగ్టన్ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇరు దేశాల నేతలు తమదే పేచేయిగా ఉండాలని ఆశిస్తున్న కారణంగానే, అన్ని సమస్యలకు తెరపడుతుందని అనుకోవడానికి వీల్లేదని అంటున్నారు. ఫలితాలు ఎలా ఉంటాయన్నది పక్కకు పెడితే, ట్రంప్, జిన్‌పింగ్ సమావేశం వార్త సర్వత్రా ఉత్కంఠ సృష్టిస్తున్నది.



# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తున్న భారత్

### వైట్‌హౌస్ మరో వివాదాస్పద ప్రకటన

**వాషింగ్టన్:** భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యంతో నిలిచిపోయిందంటూ వ్యా ఖ్యలు చేసిన వైట్‌హౌస్ తాజాగా మరో ప్రకటనతో, కొత్త అనుమానాలకు తెరతీసింది. ట్రంప్ అభ్యర్థన మేరకు భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించడం ప్రారంభించిందని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లేవిట్ పేర్కొన్నారు. అదే సమయంలో రష్యాపై విధించిన ఆంక్షలను ఆమె ప్రస్తావించారు. అవి ఎంత కఠినంగా ఉన్నాయో వాటిని చదివితే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఉక్రేన్‌పై యుద్ధాన్ని రష్యా తక్షణమే నిలిపివేసేలా చూడడమే ఈ కొత్త ఆంక్షల లక్ష్యమని అన్నారు. మాస్కోకు ఆదాయ మార్గాలను నిలిపివేయాలనే ప్రయత్నంలో ఈ చర్యలు చేపట్టునట్టు తెలిపారు. చైనా కూడా రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గిస్తున్నట్లు కొన్ని అంతర్జాతీయ వార్తలు తాను చూశానని, ట్రంప్ అభ్యర్థనపై భారత్ కూడా అదే పని చేసిందని ఆమె పేర్కొన్నారు. వాషింగ్టన్, యూరోపియన్ మిత్రదేశాలకు కూడా రష్యా చమురు దిగుమతులను తగ్గించమని సూచించినట్లు లేవిట్ తెలిపారు. మాస్కో యుద్ధ నిధులను నిలిపివేయడంలో ఇది పూర్తి స్థాయి దౌత్య ప్రయత్నంలో భాగమని ఆమె అన్నారు. గత కొద్ది రోజులుగా అమెరికా అధ్యక్షుడు, ఆయన ప్రభు త్వం రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా తగ్గిస్తుందని హామీ ఇచ్చిందని చెబుతోంది. అయితే, భారత్ తన ఇంధన విధానం జాతీయ ప్రయోజనాల ఆధారంగా మాత్రమే ఉంటుందని, ముఖ్యంగా వినియోగదారులకు అందుబాటులో, భద్రత కలిగిన సరఫరాలను నిర్ధారించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తోంది. అమెరికా వాదన ప్రకారం, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేయడం ద్వారా భారత్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఉక్రేన్ యుద్ధానికి నిధులు సమకూర్చడంలో సహాయపడుతోంది. ఇటీవలి కాలంలో ట్రంప్ భారత వస్తువులపై దిగుమతి సుంకాలను రెండింతలు చేసి 50 శాతానికి పెంచడంతో, న్యూ ఢిల్లీ–వాషింగ్టన్ సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇందులో రష్యా చమురు కొనుగోలుకు ప్రత్యేకంగా 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. భారత్ ఈ చర్యను అన్యాయం, అనవసరం, అన్యాయమైనదిగా అభివర్ణించింది. ఈ పరిణామాల నడుమ లేవిట్ చేసిన తాజా వ్యాఖ్య అనుమానాలకు తావిస్తున్నది.

రష్యా నుంచి చమురు దిగుమతిని నిలిపివేయాల్సిందిగా ఎవరూ తమను అడ్డుకోలేరంటూ పరోక్షంగా అమెరికాకు సవాలు విసురుతున్న భారత్ పరోక్షంగా అందుకు భిన్నమైన నిర్ణయాలు తీసుకుంటున్నదా? అనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. లేవిట్ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం ఎంత త్వరగా నోరువిప్పితే అంత మంచిది.



'చమురు' వివాదంపై అమెరికా తీరును ఆక్షేపించిన పుతిన్

# స్నేహపూర్వక చర్య కానేకాదు

**బ్రస్సెల్స్:** రష్యా చమురు పరిశ్రమను దెబ్బతీసే రీతిలో అమెరికావ్యవహరిస్తున్నతీరుకుపొడిగింపుగా, యూరోపియన్ యూనియనథ ఆజాగా మరికొన్ని ఆంక్షలు విధించింది. రష్యాను, ప్రత్యేకించి రష్యా చమురు పరిశ్రమను ఇరుకున పెట్టడమే అమెరికా, ఐరోపా దేశాల లక్ష్యమని తాజాచర్యతో మరోసారి స్పష్టమైంది. కాగా, రష్యా చమురు పరిశ్రమపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన షరతులు, తీసుకుంటున్న చర్యలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తప్పుపట్టారు. 'ఇది స్నేహపూర్వక చర్య కానేకాదు' అని వ్యాఖ్యానించారు. ఈ చర్య ప్రపంచ చమురు ధరలను పెంచి, చివరికి అమెరికానే దెబ్బతినేలా చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఉక్రేన్‌పై రష్యా దాడిని కొనసాగించడానికి అవసరమైన ఆదాయాన్ని, సరఫరాలను అడ్డుకోవడమే లక్ష్యంగా అమెరికా, యూరోపియన్ ఆంక్షలు ఉన్నాయన్నది స్పష్టం. ఒకవైపు పుతిన్‌తో చర్చలు జరుపుతానని ప్రకటిస్తున్న ట్రంప్, మరోవైపు రష్యాపై ఆంక్షల కొరడా ఝుళిపిస్తునే ఉన్నారు. సుంకాలను పెంచుతూ, ఆంక్షలు విధిస్తూ, రష్యా ను దెబ్బతీసేప్రయత్నం చేస్తున్నారు. కాగా, మాస్కోలో జర్నలిస్టులతో మాట్లాడిన పుతిన్, అమెరికా విధించిన ఆంక్షలు రష్యాపై కొంత ప్రభావం చూపుతాయని అంగీకరించారు. కానీ, అవి దేశ ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం చూపబోవని స్పష్టం చేశారు. ఇలావుంటే, ఉక్రేన్ అధ్యక్షుడు వోలోదిమిర్‌జెలెన్‌స్కీఈఆంక్షలనుస్వాగతించారు. రష్యా ఆర్థిక వ్యవస్థకు ఇంధన ఆదాయమే మూలాధారం. దీని ద్వారానే పుతిన్ ద్రవ్యోల్బణం పెరగకుండా, కరెన్సీ పతనం రాకుండా సైన్యానికి నిధులు సమకూర్చగలిగారు. కాగా, అమెరికా రోస్‌నెఫ్ట్, లూకాయిల్ కంపెనీలపై కొత్త ఆంక్షల వార్తతో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్కో బారెల్‌కు రెండు డాలర్లకుపైగా పెరిగాయి. రష్యా చమురు ఎగుమతులను అడ్డుకోవాలని అమెరికా యత్ని స్తే ప్రపంచ చమురు మార్కెట్లు అస్థిరమవుతాయని, చివరికి అమెరికాకే నష్టం జరుగుతుందని పుతిన్ ట్రంప్‌కి హెచ్చరిస్తున్నారు. 'మా చమురు, చమురు ఉత్పత్తుల సరఫరా భారీగా తగ్గితే... అంతర్జాతీయ మార్కెట్‌లో వాటి ధరలుపెరుగుతాయి. దాని ప్రభావాన్ని అమెరికా పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు అనుభవిస్తారు' అని పుతన్ వ్యాఖ్యానించారు. అమెరికా, యుకె ప్రకటించిన ఆంక్షలు నవంబర్ 21నుంచి అమల్లోకి రానుంది. ఈలోగా ట్రంప్, పుతిన్ మధ్య భేటీ జరిగి, కీలక నిర్ణయాలు తీసుకుంటే పరిస్థితి మెరుగుపడుతుంది.

## 58 మంది పోటీ
(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. బూత్ లెవల్ అధికారులు మాత్రమే ఓటర్‌స్లిప్పులు పంచుతారన్నారు. ఉప ఎన్నిక పోలింగ్ కోసం 600 ప్రిసైడింగ్ అధికారులు, 600 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1200 మంది ఓపిఓలను పోలింగ్ పర్సన్‌లుగా వినియోగించుకోనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలిపేందుకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం వర్గం పరిధిలో విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ సమయంలో మహిళల కోసం ప్రత్యేక క్యూ లైన్‌లో ఉంటాయన్నారు. దివ్యాంగ ఓటర్ల కోసం రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని నిక్కచ్చిగా అమలు చేసేందుకు పర్యవేక్షక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. 15 ఎస్ఎస్‌టి, 15 ఎఫ్ఎస్‌టి బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 2.83 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎంసిసి ఉల్లంఘనలకు పాల్పడిన 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. సోషల్ మీడియాలో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి తప్పు డు ప్రచారం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పారామిలిటరీ ఫోర్స్‌తో భద్రత చర్యలు : తఫ్సీర్ ఇక్బాల్**

హైదరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ స్వేచ్ఛాయు త వాతావరణంలో పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పోలీస్ యం త్రాంగం సన్నద్ధంగా ఉందన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో పారా మిలిటరీ ఫోర్స్‌ను మోహరిస్తామన్నారు. పాత్రికేయుల సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, విజిలెన్స్ ఎఎస్‌పి నరసింహ రెడ్డి, వెస్ట్‌జోన్ డిసిపి శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ డిసిపి అపూర్వరావు, పిఆర్‌ఓ దశరథం పాల్గొన్నారు.

**'జూబ్లీహిల్స్' చరిత్రలో ఇదే తొలిసారి..**

ఇక ఇంతమంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది పోటీ పడ్డారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 19 మంది మాత్రమే తలపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికకు బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపికి చెందిన అభ్యర్థులతో పాటు వివిధ వర్గాలకు చెందిన 211 మంది అభ్యర్థులు మొత్తంగా 321 నామినేషన్‌లను దాఖలు చేశారు. బుధవారం ఉదయం ప్రారంభమైన నామినేషన్‌ల పరిశీలన గురువారం తెల్లవారుజాము న 3 గంటల దాకా కొనసాగింది. మొత్తం 321 నామినేషన్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి, 186 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 135 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు తేల్చారు. నామినేషన్‌ల పరిశీలన అనంతరం 130 మందికి చెందిన నామినేషన్‌లను వివిధ కారణాలతో తిరస్కరించగా, 81 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపారు.

## మున్సిపాలిటీలకు భారీ నిధులు
(మొదటి పేజీ తరువాయి)

విస్తరణతో పాటు కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలన్నింటా మెరుగైన పౌర సదుపాయాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ శాఖ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీల్లో రూ. 2,780 కోట్ల ఖర్చుతో 2,432 పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ లో పొందుపరిచిన నగరాభివృద్ధి నిధులతో పాటు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్) పథకాల నుంచి ఈ నిధులను మంజూరు చేసింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన మున్సిపాలిటీలకు రూ. 20 కోట్లు, పాత మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు రూ. 30 కోట్లు మంజూరు చేశారు. ప్రాధాన్యత క్రమంలో ఈ నిధులను ఖర్చు చేయాలని మున్సిపల్ శాఖ మార్గదర్శకాలను రూపొందించింది. అన్ని మున్సిపాలిటీలలో సంబంధిత విభాగాలు వెంటనే టెండర్లు పిలిచి ఈ పనులను ప్రారంభించాలని సిఎం సూచించారు. 2026 మార్చి నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని గడువును ప్రభుత్వం నిర్ణయించింది.

## ఏకాకులను చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

పోతామన్నారు. బిసి రిజర్వేషన్‌లను నోటికాడికి వచ్చిన బుక్కను తరిమికొడుతున్నారని అన్నారు.

**రాజకీయాలకు అతీతంగా విపిసింగ్‌ను అడ్డుకున్నారు..**

బిసి రిజ్వేషన్‌లను ప్రధానిగా విపి సింగ్ ప్రవేశపెట్టారన్నారు. ఆనాడు రాజకీయాలకు అతీతంగా రిజర్వేషన్‌లను అడ్డుకున్న పరిస్థితి చూశామన్నారు. అసెంబ్లీలో మద్దతు ఇచ్చిన తరువాత గవర్నర్ పెడింగ్ పెట్టుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెడింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు అడ్డుపడుతున్నారనే అంశంపై స్పష్టమైన వైఖరి ఉండాలన్నారు. ఈ గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల నాటకాలతో సాగుతుందని విమర్శించారు. అన్ని రాజకీయ పక్షాలు బంద్‌లో పాల్గొన్నాయని, కానీ చిత్తశుద్ధి ఎవరికి ఉందో మనం ఆలోచనల చేయాలన్నారు. చాలా మంది ప్రకటన చేశారు కానీ, ఏ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు బంద్‌లో ఉన్నారో ఆలోచన చేయాలన్నారు. చిత్త శుద్ధి లేని శివుని పూజ ముందుకు పోదన్నారు. 9 షెడ్యూల్‌లో చేర్చటానికి చేస్తున్న పోరాటంలో సిపిఐ పార్టీ సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తుందన్నారు. ప్రత్యక్షంగా కూడా పాల్గొంటుందన్నారు. తెలంగాణ ఉద్యమం తరువాత చిరంజీవులు, విశారధన్ మహారాజ్, జస్టిస్ ఈశ్వరయ్య బిసి సమాజం కోసం అనేక రకాలుగా, భావజాల వ్యాప్తికి వారి శక్తినంతా బిసి ఉద్యమానికి దారపోస్తున్నారని ప్రశంసించారు. శత్రువుని ఏకాకిని చేస్తేనే తప్పుకుండా విజయం సాధిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఒకనాడు వ్యతిరేకించిన శక్తులు కూడా ప్రజల ఆకాంక్షను గుర్తించిందన్నారు. సిపిఐ తెలంగాణ ఉద్యమానికి తీర్మానం చేసిన మొట్టమొదటి పార్టీ అని సత్యం గుర్తు చేశారు. కుట్రలు, కుతంత్రాలను అడ్డుకొని, 9 షెడ్యూల్ చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మీద వత్తిడి తీసుకొద్ధామన్నారు. తెలంగాణ ఉద్యమం మాదిరిగానే బిసి ఉద్యమాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి, బిసి రిజర్వేషన్‌లు సాధిద్దామన్నారు.

**ప్రభుత్వాలు అనుకుంటే గంటలో రిజర్వేషన్లు: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకుంటే గంటలో రిజర్వేషన్లు వస్తాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా బిసి రిజర్వేషన్‌లను అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిసి రిజర్వేషన్‌ల బిల్లును ఆమోదించి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

**మోదీ, కెసిఆర్ ఎందుకు మాట్లాడరు : పూర్ణచంద్రరావు**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లపై బిజెపి ఎందుకు మాట్లాడదని అఖిలభారత బహుజన సమాజ్ పార్టీ (ఎఐబిఎస్‌పి) జాతీయ సమన్వయకర్త, రిటైర్డ్ డిజిపి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్‌లపై ఇప్పటివరకు నోరు మెదపని కెసిఆర్, జూబ్లీహిల్స్ బిసి ఎమ్మెల్యే అభ్యర్థిని రౌడీషీటర్‌గా పేరుపడిన ఎన్నుకోవద్దని చెప్పడానికి సమయం దొరికిందా అని ప్రశ్నించారు. కానీ బిసి రిజర్వేషన్‌లపై మాట్లాడడానికి నోరు రాలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌లో చాలా చిన్న చిన్న విషయాల గురించి కూడా మాట్లాడతారని, మరి ఇంత పెద్ద విషయం గురించి ఆయన ఎందుకు ప్రస్తావించారని ప్రశ్నించారు.

# అన్ని చర్యలు చేపట్టాలి

### అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కర్నూల్‌లో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిజేశారు. ఈ ఘటనపై ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డితో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు జెన్‌కో సిఎండి హరీష్‌ను వెంటనే ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. గద్వాల కలెక్టర్, ఎస్‌పిలు అక్కడే అందుబాటులో ఉండాలని, బాధిత కుటుంబాలకు అండదండగా ఉండాలని సూచించారు. మృతుల గుర్తింపుతో పాటు క్షతగాత్రులకు అవసరమైన వైద్యసాయం అందించే చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

**బాధిత కుటుంబాలను ఆదుకుంటాం**

కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడ్డ తెలంగాణ ప్రాంతానికి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రమాద ఘటనా స్థలాన్ని శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా అధికారులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతి చెందారని, పదిమంది గాయాలతో బయటపడ్డారన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. మృతి చెందిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి సీఎం రేవంత్ రెడ్డి రూ.5 లక్షలు, గాయపడ్డ వారికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు. ఈ ప్రమాదం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ 2013లో పాలెం వద్ద జరిగిన ఘటనలో 48 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సుశిక్షకులైన డ్రైవర్లను నియమించుకునేలా, రవాణా శాఖ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మంత్రితోపాటు తెలంగాణ జెన్‌కో సిఎండి హరీష్, అలంపూర్ ఎంఎల్‌ఎ విజయుడు, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్, ఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్‌పి మొగిలయ్య. ఆర్‌డిఓలు అలివేలు, ఉండవెల్లి ఎంఆర్‌ఓ ప్రభాకర్ తదితరులున్నారు.

**విచారం వ్యక్తం చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ..**

21 మంది మరణించిన బస్సు దుర్ఘటనపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలియజేసారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ దారుణ ఘటన మన రహదారులపై భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని, ఇటువంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియచేస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

**హెల్ప్‌లైన్ ఏర్పాటు..**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న బస్సు ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో బాధిత కుటుంబాలకు సహాయం అందించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. హెల్ప్‌లైన్ నెంబర్లు.. 9912919545 ఎం.శ్రీ రామచంద్ర, అసిస్టెంట్ సెక్రటరీ, 9440854433 ఈ.చిట్టిబాబు, సెక్షన్ ఆఫీసర్ లను సంప్రదించాలి.


## ఆహుతైన ప్రాణాలు
(మొదటి పేజీ తరువాయి)

వైద్యశాలలో, కొందరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికి త్స పొందుతున్నారు. రోడ్డుపై వెళుతున్న వాహనదారులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీసులు, అగ్నిమాపక వాహనం అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురు, బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఒక్కొక్కరు, తమిళనాడుకు ఇద్దరు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్నాటకకు చెందిన ఇద్దరు ఉన్నారు. మరో మృత దేహాన్ని గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన రమేష్ దంపతులతోపాటు కుమార్తె, కుమారుడు నలుగురూ కాలిబూడిదైనట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన మరికొందరు కన్నీరు మున్నీరు అవుతున్నారు. గుర్తుపట్టలేని విధంగా శరీరాలు కాలిపోవడంతో రక్తపు ముద్దలను తీసి డీఎన్ఏ టెస్టుకు పంపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ ఎ.సిరి, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ నూరుల్‌కమర్, కమిషనర్ విశ్వనాథ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన విషయం తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర పతి ముర్ము, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటపై ఉలిందకొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదనపు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**ప్రమాదంలో సజీవదహనం అయినవారు :** కర్నాటకకు చెందిన ఫీలోమెన్‌బేబీ (64) కిషోర్ కుమార్ (41) తమిళనాడుకు చెందిన ప్రశాంత్ (32), యువన్‌శంకర్‌రాజ్ (22) తెలంగాణాకు చెందిన అర్గా బంధోపాధ్యాయ (23) మేఘనాథ్ (25), చందన (23) సంధ్యారాణి (43), అనూషా (22), గిరిరావు (48), బీహార్‌కు చెందిన అమరీత్‌కుమార్ (18), బాపట్లకు చెందిన ధాత్రి (27) రమేష్, అనూషా దంపతులతోపాటు వారి కుమారుడు శషాంక్, కుమార్తె మమత, ఒడిశాకు చెందిన కె.దీపక్‌కుమార్ (24) ఉన్నారు. వివరాలు లేని మరో వ్యక్తి కాలిబూడిదైపోయారు. వీరితోపాటు బైక్ నడుపుతున్న కర్నూలు జిల్లా బి.తాండ్రపాడుకు చెందిన శివశంకర్ (24) మృతి చెందారు.

**ఎపి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు**

ప్రమాదంగురించి తెలుసుకున్న ఎపి రాష్ట్ర హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. రోడ్డు ప్రమాదంలో 20 మంది సజీవదహనం సంఘటన చాలా దురదృష్టకరమని, బైక్ స్పార్క్ వల్లనే మంటలు వ్యాపించి దుర్ఘటన చెందిన నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని, 27 మంది సురక్షితంగా బయటపడ్డారని, ప్రమాదంపై అన్ని కోణాల నుండి దర్యాప్తు చేపడతామని మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఘటనపై 16 ఫ్లోరెన్సిక్ టీంలు వేశామని, 13 టీంలు డీఎన్ఏ, రెండు ప్రమాదం జరిగినపుడు వచ్చిన బ్లాసింగ్ సౌండ్‌పై, రెండు రసాయపరమైన విశ్లేషణ సంబంధించి టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, అదనపు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నారని తెలిపారు. డీఎన్ఏలు చేసి మృతదేహాలు ఆ కుటుంబాలకు అందచేయడం జరుగుతుందన్నారు. ఘటనపై పోలీసుల, రెవిన్యూ, రవాణా శాఖ అధికారులతో హైపర్ కమిటీ వేస్తామన్నారు. ఏపీకి చెందిన మృతుల కుంటుబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో మాట్లాడి ఎక్స్‌గ్రేషియా అందచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



## లోపాలు సహించం
(మొదటి పేజీ తరువాయి)

90 శాతం లబ్ధిదారులు ఎఫ్ఆర్ఎస్ విధానంలో సరుకులు అందుకుంటుండగా, దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కనీసం ఒక కొత్త చిన్నారి చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్లే స్కూళ్ల స్థాయిలోనే విద్యా నాణ్యత ఉండేలా తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని సూచించారు. ఈ నెలలో ఇప్పటి వరకు గర్భిణుల హాజరు 80 శాతం బాలింతల హాజరు 85 శాతం ఉండటం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల హాజరు ప్రస్తుతం 68 శాతం ఉండగా, దాన్ని 90 శాతానికి పెంచే లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా పురోగతి నివేదికలను సమర్పించాలని మంత్రి అన్నారు.

**బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలువాలి**

బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించి ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే శక్తి సదనాలు, స్టే హోమ్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్షలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు.

## ఎసిబిలో అవినీతి!
(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే విచారించారు. అయినప్పటికీ అక్రమాస్తుల కేసులో వారికి ఆశించిన ఆస్తులు కనిపించకపోవడంతో అధికారులు బినామీలను బెదిరించి దండుకునే దారి ఎంచుకున్నారు.

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో పట్టుకున్న నిందితుడిని ఆగస్టు 30న రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో నిందితుడు సెప్టెంబర్ 30 వరకు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ సమయంలో నిందితుడి వాట్సప్‌లో హసన్‌పర్తికి చెందిన 711 సర్వేనంబర్‌లో 36 గుంటల భూమికి సంబంధించి పత్రాలను ఎసిబి అధికారులు గుర్తించారు. అయితే ఆ భూమి క్రయ విక్రయాలతో సదరు నిందితునికి ఏలాంటి సంబందం లేదని విచారణలో తేలింది. కాగా ఆ భూమికి సంబంధించి హైదరాబాద్ కు చెందిన ఓ యువకుడిని ఎసిబి అధికారులు విచారణకు పిలిపించారు. ఈ కేసులో నిందితునితో సంబంధాలు ఉన్నాయని అతనికి చెందిన 36 గుంటల భూమి సీజ్ చేస్తామని వేధింపులతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయాందోళనలకు గురైన యువకుడు తన సమీప బంధువుకు విషయం చేరవేశాడు. ఈ వ్యవహారం నుంచి ఆ యువకుడిని తప్పించేందుకు హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ స్థాయి అధికారి రంగ ప్రవేశం చేశాడు. ఈ కేసులో బినామీలను ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు రూ.1 కోటి రూపాయాలు ఇవ్వాలని అవినీతి దండు డిమాండ్ చేయగా అందుకు రూ. కోటి ఇచ్చే విధంగా సెప్టెంబర్ 8న ఒప్పందం కుదిరింది. లంచం డబ్బులు ఎక్కడికి తెచ్చి అంద జేనేందుకు ఎసిబికి చెందిన అధికారి తన మిత్రుడైన మరో అధికారితో మంతనాలు జరిపి, ఇందులో భాగంగా తాను ఉంటున్న ప్రాంతాన్ని వాట్సప్ లోకేషన్ షేర్ చేశాడు. వరుసగా బెదిరింపులు వస్తుండటంతో బాధితుల్లో ఒకరు 20లక్షల రూపాయలను తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి గత నెల 11న వరంగల్ లోని పిస్తా హౌస్ హోటల్ వద్ద సదరు ఎసిబి అధికారి తరపున వచ్చిన వారికి ఇచ్చాడు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే డబ్బు తీసుకున్న ఇద్దరిలో ఒకరు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ విభాగంలో డిఎస్‌పిగా పని చేస్తుండటం విశేషం. వెరసి గత నెల 11న రాత్రి 10.45 నిమిషాల సమయంలో హైదరాబాద్ నగరానికి చెందిన నార్కోటిక్ విభాగంలో పనిచేస్తున్న ఎసిపి వరంగల్ లో ఉంటున్న ఎసిబి అధికారికి రూ. 20లక్షలు ముట్టచెప్పాడు. అయితే ఈ కేసులో 15 రోజుల పాటు బినామీలను ఇబ్బంది పెట్టకుండా వదిలేశారు. మిగిలిన రూ.80 లక్షలు ముట్టకపోవడంతో తిరిగి ఆ కేసులో బినామీలకు వేధింపులు, బెదిరింపులు మొదలయ్యాయి. కాగా ఈకేసులో రూ.కోటి మేరకు లంచం మొత్తాలు ఖరారు కావడం, ఇందులో రూ. 20 లక్షలు చేతులు మారడం, వీరికి సహకరించిన అధికారులంతా ఒకే బ్యాచ్ కావడం కొసమెరుపు. తమ వద్ద లంచం డబ్బుల గురించి మాట్లాడిన సెల్ ఫోన్ ఆడియో రికార్డులు సైతం ఉన్నాయని బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు బాధితులు ఎసిబి అదనపు డిజికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ సాగుతుందని ఎసిబి వర్గాలు బాధితుడికి సమాచారం అందించాయి. బాధితులు చెప్పినట్లు విచారణలో తేలితే ఇద్దరు డిఎస్‌పిలు సస్పెండ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.




# జనరల్
STATE & REGIONAL NEWS

## 'పార్టీ ఫిరాయింపుల'పై స్పీకర్ విచారణ

31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో పోలీసు ఆంక్షలు




ప్రజాపక్షం/హైదరాబాద్ : 'పార్టీ ఫిరాయింపుల'పై దాఖలైన అనర్హత పిటిషన్‌పైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. శాసనసభలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన విచారణకు ఎంఎల్ఎల తరపున వారి న్యాయవాదులు హాజరయ్యారు. టి.ప్రకాశ్ గౌడ్, కాలే యాదయ్య,బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిలపై దాఖలైన పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా ఇరువైపుల న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. ఈ పిటిషన్లకు సంబంధించి ఇరు వర్గాల వారు తమ వద్ద ఉన్న ఆధారాలను, అఫిడవిట్లను స్పీకర్‌కు సమర్పించారు. కాగా విచారణల నేపథ్యంలో ఈనెల 31వ తేదీ వరకు అసెంబ్లీ పరిసరాల్లో పోలీసు ఆంక్షలు అమలులో ఉంటాయి.

# విజ్ఞాన వినియోగంతో ఉజ్వల భవిష్యత్తు



పరిశోధనలతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాపక్షం/గజ్వేల్ : విజ్ఞాన వినియోగంతో పరిశోధన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, జాతీయ ప్రమాణాలతో కూడిన కావేరి విత్తన పరిశోధన కేంద్రం ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం శివారులోని కావేరి విత్తన పరిశోధన కేంద్రం, కావేరి విశ్వవిద్యాలయం పరిశీలించి ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్‌ను ఛాన్సలర్ భాస్కరరావుతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి వాటి ఫలాలు రైతులకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను పొంది మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. నూతన సాంకేతికతతో అద్భుత వంగడాలు, ఆహార సంపద సృష్టించి దేశ పునర్నిర్మాణంలో కావేరి విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. యువ శాస్త్రవేత్తలకు అద్భుతాలు సృష్టించే సత్తా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని తమలోని సత్తా చాటాలని చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి అగ్రిటెక్ యూనివర్సిటీ కాగా, ఆధునిక సాంకేతికత జోడించి పరిశోధన క్షేత్రస్థాయిలో ఇక్కడి విద్యార్థులు విశిష్ట సేవలు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సమాజ మార్పుకు దిక్సూచిలా ఉండాలని, భవిష్యత్తు, ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యత ఇస్తూ విభిన్న రంగాల విజన్‌తో ముందుకు వెళ్తున్న కావేరి విత్తన పరిశోధన కేంద్రం చక్కటి ఫలితాలు సాధించి ఖ్యాతి గడించాలని స్పష్టం చేశారు. డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధితో నిరంతర ఆవిష్కరణలు జరగాలని, దైనందిన జీవితంలో డ్రోన్ టెక్నాలజీ ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. పర్యావరణానికి హాని జరగ కుండా సహజ సిద్ధంగా లభించే సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరిగి ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు సాధించాలని వివరించారు. మొదటగా కావేరి సంస్థలు సాధించిన పురోగతి, క్షేత్రస్థాయి పరిశోధనలు, అధునాతన వసతులు, ఎంటమాలజీ, పాథాలజీ, బ్రీడింగ్ , ఫిజియోలజీ ల్యాబ్స్ తదితర పరిశీలించగా, విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల డ్రోన్ టెక్నాలజీ, రోబో టెక్నాలజీ, 3డి ప్రింటింగ్, ఏఆర్ అండ్ విఆర్ మోడల్స్, అగ్రికల్చరల్ ఇన్నోవేషన్స్ తిలకించారు. అనంతరం వైస్ చాన్సలర్ ప్రవీణ్ రావు మాట్లాడుతూ కావేరి యూనివర్సిటీ అద్భుత పరిశోధనలతో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కావేరి సీడ్స్ కంపెనీతో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగానికి మనోబలం చేకూరుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్, ఏసిపి నర్సింలు, ఆర్డీవో చంద్రకళ, ఎమ్మార్వో రఘువీరా రెడ్డి, కావేరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష పాలసాని, అగ్రికల్చరల్ డీన్ ప్రతాప్ కుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ కొండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడిగా పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులు

ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం

ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక భేటీ




ప్రజాపక్షం/హైదరాబాద్: అడ్వాన్సుడ్ టెక్నాలజీస్, గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, సస్టైనబుల్ ఇంజనీరింగ్, క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణల కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఇక్కడి ప్రముఖ విద్యాసంస్థలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌లు, కోఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్ ను చేపట్టాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం ఉమ్మడి పరిశోధన, ఇన్నోవేషన్ బేస్డ్ కొలాబరేషన్, అకడమిక్ ఎక్స్ఛేంజ్, స్టార్టప్‌ల భాగస్వామ్యం తదితర అంశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, టీ హబ్, టీ వర్క్స్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలకు ఈ భాగస్వామ్యం మరింత ఊతమిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' మారేందుకు అవసరమైన ఎకో సిస్టం కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ వైస్ ప్రోవోస్ట్ ప్రొఫెసర్ మ్యాథ్యూ గిలెస్పీ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పరిశోధనలు, సం యుక్త ప్రాజెక్టులను చేపట్టేందుకు వీలుగా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ లే హైవూ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ థామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

**విక్టోరియా పార్లమెంట్‌ను సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు**

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం 'విక్టోరియా పార్లమెంట్'ను సందర్శించారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ 'లీ తార్లామిస్', పార్లమెంటరీ సెక్రటరీ 'షీనా వాట్' ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లెజిస్లేటివ్ ప్రొసీజర్స్, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. శాసనాల తయారీలో పౌరుల భాగస్వామ్యం పెరిగినప్పుడే పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను వారికి వివరించారు. ట్రాన్స్‌పరెంట్, టెక్నాలజీ ఎనేబుల్డ్ సిటిజన్‌డ్రివెన్ గవర్నెన్స్ మోడల్స్ రూపకల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పారు. 'తెలంగాణ – విక్టోరియా' మధ్య ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్‌ను పెంపొందించేందుకు చొరవ చూపాలని కోరారు. ప్రగతిశీల విధానాలను అనుసరిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న 'తెలంగాణ' లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని 'లీ తార్లామిస్', 'షీనా వాట్' తెలిపారు. 'తెలంగాణ విక్టోరియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఇంటింటికీ శతాబ్ది ఉత్సవ సందేశం

బహిరంగ సభకు భారీ జన సమీకరణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్రను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసేందుకు శతాబ్ది ఉత్సవ సందేశాన్ని ఇంటింటికి తెలియజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. వందేళ్ల కాలంలో చేసిన త్యాగాలు, జరిపిన పోరాటాలను మననం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. రఘునాథపాలెం మండల సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సభలో కూనంనేని మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో అధికారం లేకుండా వందేళ్లు ప్రజల పక్షాన నిలిచిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ ఆ తర్వా త అనేక పోరాటాలను నిర్వహించిందని కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారితో లాలుచిపడుతున్న సమయంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిం ది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కనీస ఊసు కూడా లేని మతోన్మాద బిజెపి దేశం కోసం ప్రాణాలు అర్పించిన కమ్యూనిస్టులను తక్కువగా అంచనా వేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్వాతంత్ర్య అనంతరం ప్రజ ల హక్కుల కోసం, సంక్షేమం కోసం పోరాడిందని దున్నే వానికే భూమి దక్కాలని పోరాడిన పార్టీ సిపిఐ మాత్రమేనని కూనంనేని తెలిపారు. బ్యాం కుల జాతీయకరణ, రాజభరణాల రద్దు లాంటి అనేక సంస్కరణల వెనక కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు దాగి ఉన్నాయన్నారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు పోరాట పురిటిగడ్డ ఖమ్మం వేదిక కానుండటం అభినందనీయమన్నారు. ప్రపంచ చరిత్రలోనే తెలంగాణ సాయుధ పోరాటానికి ఒక విశిష్ట స్థానం ఉందని అటువంటి సువర్ణక్షర లిఖిత పోరాటంలో ఖమ్మం జిల్లా కీలక భూమిక పోషించిందన్నారు. డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు లక్షలాది మంది హాజరయ్యేలా ప్రతి సిపిఐ కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి , తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు తాటి నిర్మల, శ్రవణ్, సైదా, అర్బన్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**FORMAT C-1**

*(for candidate to publish in Newspapers, TV)*

**Declaration about criminal cases**

*(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)*

**Name and address of candidate** : **NAVEEN YADAV. V**
H.No.8-3-229/S/3/5, Rahmath Nagar,
Yousufguda Check post, Yousufguda,
Hyderabad – 500045.

**Name of Political Party** : **INDIAN NATIONAL CONGRESS**

**Name of Election** : **BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of Constituency** : **61-JUBILEE HILLS**

I, **NAVEEN YADAV. V**, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No. and dated | Status Ofcase(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description ofoffence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |



# సిఎంఆర్ బియ్యం నిల్వల్లో గోల్‌మాల్

రూ.1.54 కోట్ల ధాన్యం మళ్లించిన రైస్ మిల్ యజమాని



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయా ప్రాంతాల్లో శుక్రవారం జరిపిన దాడుల్లో సిఎంఆర్ బియ్యం నిల్వలను గోల్‌మాల్ చేసిన ఉదంతం వెలుగు చూసింది. భారీ మొత్తంలో సిఎంఆర్ ధాన్యం మళ్లించబడుతుందని విశ్వసనీయ సమాచారం అందడంతో సిద్దిపేట జిల్లాలోని ఎంఎం ఫుడ్ ప్రాసెసింగ్ పారాబాయిల్డ్ రైస్ మిల్లుపై ఆర్సిపురం యూనియల్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2024–25 రబీ సీజన్‌కు సంబంధించిన 6,674 క్వింటాళ్ల సిఎంఆర్ నిల్వలు రూ.1.54 కోట్ల విలువైన మళ్లించారని కనుగొన్నారు. రైస్ మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు.

**ఆకస్మిక రూట్ చెక్..**

హైదరాబాద్ సిటీ1 యూనిట్ విజిలెన్స్, ఎంవిఐ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ డిపార్ట్‌మెంట్, వాణిజ్య పన్ను అధికారితో కలిసి గురువారం మధ్య రాత్రి 11:00 నుండి మరుసటి రోజు ఉదయం 4:30 వరకు పటాన్‌చెరు, ముతంగి టోల్ గేట్, పరిసర ప్రాంతాలలో ఆకస్మిక రూట్ చెక్ నిర్వహించారు. ఓవర్ లోడ్ లైసెన్స్, పన్ను, పర్మిట్ మొదలైన వాటికి సంబంధించిన ఉల్లంఘనలకు ఎంవిఐ చట్టం కింద 10 కేసులు నమోదు చేశారు. వాహన డ్రైవర్లపై సుమారు రూ. 5,18,600 జరిమానా విధించారు. రెండు ఇటుకలు, దుమ్ము, ఇసుక రవాణాలో ఉల్లంఘనలకు మైనింగ్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. సుమారు రూ.27,198 జరిమానా విధించారు. రెండు జిఎస్టి చట్టం కింద కేసులు నమోదు చేసి రూ.1,82,712 జరిమాన విధించారు. రెండు రోజుల రూట్ చెకింగ్, తనిఖీ సమయంలో విధించిన మొత్తం పన్ను సుమారు రూ.7,28,51 నమోదు అయ్యింది. కరీంనగర్ యూనిట్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురు, శుక్ర రోజుల్లో ఆర్‌టిఎ విభాగం అధికారులతో కలిసి రాజీవ్ రహదరి (కరీంనగర్ పెద్దపల్లి రోడ్డు), మానకొండూర్ గ్రామం (కరీంనగర్ వరంగల్ రోడ్డు)లలో ఆకస్మిక రూట్ తనిఖీలు నిర్వహించి, గూడ్స్ వాహనాలను అడ్డగించి 18వాహనాలపై మోటార్ వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేశారు. వీరికి రూ.6,50,000 చలానా విధించారు. నల్గొండ యూనిట్ ద్వారా ఆకస్మిక రూట్ చెక్‌ను సూర్యాపేట జిల్లా నాగారం మండలం చెన్నపూర్ గ్రామంలో ఉన్న మెస్సర్స్ విఎంఎన్‌ఆర్ స్టోన్ క్రషర్స్ (పి) లిమిటెడ్ ఆధీనంలో ఉన్న స్టోన్ క్రషింగ్ యూనిట్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగానికి చెందిన నల్గొండ యూనిట్ అధికారులు, సూర్యాపేట జిల్లా మైనింగ్ శాఖ అధికారులతో కలిసి 23న తనిఖీ చేశారు. మెస్సర్స్ విఎంఎన్‌ఆర్ స్టోన్ క్రషర్స్ (పి) లిమిటెడ్‌కు సంబంధించి ఎడి, ఎంఅండ్‌జి, సూర్యాపేట రికార్డుల క్షేత్ర తనిఖీ, ధృవీకరణ తర్వాత, కంపెనీ వివిధ పరిమాణాల బిల్డింగ్ స్టోన్, రోడ్ మెటల్ 3,252.00 ఎంటి అదనపు స్టాక్‌ను కలిగి ఉందని, పర్మిట్ ఫీజు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (ట్రస్ట్) ఫీజు, స్టేట్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ మరియు ఐటీతో పాటు రూ.2,53,65,600 సాధారణ సీగ్నియోరేజ్ ఫీజును ఎగవేసినట్లు అనుమానిస్తున్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ ఆదాయం లీకేజీని, ప్రభుత్వ నిధులు, సహజ వనరుల దుర్వినియోగాన్ని నివారించడానికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కట్టుబడి ఉంది. ప్రభుత్వ నిధులు లేదా వనరులలో ఏవైనా అవకతవకలు లేదా దుర్వినియోగం జరిగితే విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## తృటిలో తప్పించుకున్న ఆరుగురు



మంగ సంధ్యారాణి, చందన



అనూష రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద శుక్రవారం అర్ధరాత్రి తరువాత జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ వాసులు మృతి చెందగా మరో ఆరుగురు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. మెదక్ జిల్లా శివ్వాయిపల్లి మండలానికి చెందిన తల్లీకూతుళ్లు మంగ సంధ్యారాణి (43), మంగ చందన (23) సజీవ దహనం అయ్యారు. సంధ్యారాణి భర్త మస్కట్‌లో ఉండగా కొడుకు అలాహాబాద్‌లో ఉన్నారు. ఒకే కుటుంబంలో ఒకే ఘటనలో తల్లీ కూతుళ్లు చనిపోవడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఇదే ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తకొండూర్‌కు చెందిన మహేశ్వరం అనూష రెడ్డి (27) మృతి చెందారు. అనూష బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. దీపావళి పండుగకి ఊరికి వచ్చిన తిరిగి వెళ్లే క్రమంలో రాత్రి ఖైరతాబాద్‌లో కావేరి ట్రావెల్స్‌కి చెందిన బస్సు ఎక్కింది. తప్పించుకున్న ఆరుగురి వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన మన్నెంపల్లి సత్యనారాయణ (27) గాయపడి ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన బదంత్ర జయసూర్య (24), కర్నూలు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. హయత్‌నగర్‌కు చెందిన అండోజ్ నవీన్ కుమార్ (26), గాయపడి చికిత్సలో ఉన్నారు. తెలంగాణకు చెందిన కపర్ అశోక్ (27) తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన పునుపట్టి కీర్తి (28) ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు క్షేమంగా చేరుకున్నారు. తెలంగాణకు చెందిన వేణుగోపాల్ రెడ్డి (24) చికిత్స అనంతరం హైదరాబాద్ చేరుకున్నారు.



**తూప్రాన్ మున్సిపాలిటీ కార్యాలయం: మెదక్ జిల్లా**

Lr.No.E1/85/2025 తేదీ: 23.10.2025

ఇ-మెయిల్ : municipalitytoopran@gmail.com
కాంటాక్ట్ నంబర్ : 9849069769 / 9490066885 / 9866296751

కొటేషన్ టెండర్ నోటీసు

తూప్రాన్ మున్సిపాలిటీలో 2025-26 గ్రాంట్లకు నగరాభివృద్ధి మౌలిక సదుపాయాలు & అభివృద్ధి పనుల కింద సరఫరా మొక్కలు & చెట్లు, పూల మొక్కలు, పిల్లల ఆట పరికరాలు, పార్క్ పరికరాలు, పార్కులు, LED లైట్లు, సంభాలు, పిల్లల వినోద వస్తువులు, సందర్శకుల బెంచీల పనుల కోసం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ & ఏజెన్సీల నుండి కొటేషన్లు ఆహ్వానించడమైనది.

| | | | |
|---|---|---|---|
| 1 | కొటేషన్ బిడ్ డాక్యుమెంట్ దాఖలుకు ప్రారంభ తేదీ | 25/10/2025 | 11.25 AM |
| 2 | కొటేషన్ బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేదీ | 30/10/2025 | 3.10 PM |
| 3 | బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం | 30/10/2025 | 3.25 PM |
| 4 | కొటేషన్ బిడ్ ప్రారంభ తేదీ (ఆర్థిక బిడ్ దశ) | 30/10/2025 | 3.40 PM |

మరిన్ని వివరాలు మరియు స్పష్టీకరణలను అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో తూప్రాన్ మున్సిపాలిటీ కమిషనర్ లేదా మున్సిపల్ ఇంజనీర్ నుండి పొందవచ్చు.

సం/- మున్సిపల్ కమిషనర్
తూప్రాన్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 9653-PP/CL/ADVT/1/2025-26, Date: 24-10-2025

**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
మేడ్చల్–మల్కాజ్ గిరి జిల్లా

ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన

1). Lr. No.E1/PMC/QUOTATIONS/122/2025-26, తేదీ: 24-10-2025.
2). LGSF టెక్నాలజీతో నిర్మించబడే ఆస్పిరేషన్ టాయిలెట్ యొక్క క్రింది వస్తువుల కోసం ప్రముఖ కంపెనీల నుండి రేట్లు పొందడానికి బహిరంగ మార్కెట్ నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనది.
3).
4). ఏజెన్సీలు / సేవా కేంద్రాలు.
1: బాహ్య ముఖం సిమెంట్ బోర్డులతో లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమ్ వర్క్‌పై బాహ్య గోడ వ్యవస్థ బయటి ముఖం. ఇంజనీర్-ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా10 మి.మీ.ల మందంపాటి సిమెంట్ బాండెడ్ పార్టికల్ బోర్డు మొదలైన వాటిపై స్థిరపరచబడిన 8 మి.మీ.ల మందంపాటి సిమెంట్ బాండెడ్ పార్టికల్ బోర్డ్ కలిగిన బాహ్య ముఖం.
2: ఇంజనీర్ ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా 12.5 మి.మీ.ల మందంపాటి జిప్సం ప్లాస్టర్ బోర్డ్ ( టైప్ B యొక్క సిమెంట్ ఫైబర్ బోర్డ్ 8 మి.మీ.ల మందం)తో లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమ్ వర్క్‌పై అంతర్గత గోడ ప్యానెల్స్‌ను బిగించడం.
3: ఇంజినీర్ ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా 9 మి.మీ.ల మందంపాటి హెవీ డ్యూటీ ఫైబర్ సిమెంట్ బోర్డు మొదలైన వాటితో లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమ్ వర్క్‌పై తడి ప్రాంత గోడలు.
4: PUF ఇన్సులేటెడ్ శాండ్‌విచ్ ప్యానెల్‌లు 40 మి.మీ.ల మందం మరియు 30+2 మి.మీ.ల సాంద్రతతో 40+_ 2 Kg/m3 మొదలైనవి ఇంజినీర్-ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా.
5: ఇంజనీర్ ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా 100 మి.మీ.ల మందం కలిగిన రెసిన్ బాండెడ్ రాక్ ఉన్ని మొదలైన వాటితో థర్మల్ ఇన్సులేషన్.
6: ఇంజనీర్ ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా గాజుగోడలు, హోల్లో సెక్షన్ అల్యూమినియం ముఖభాగం మరియు విండో షేడ్ మొదలైనవి.
7: వాటర్ ప్రూఫింగ్ & ఇన్సులేషన్ : పై కప్పు యొక్క ధ్వని మరియు తేమలేని ఉపరితలం మరియు ఇతర సంబంధిత వస్తువులకు వాటర్ ప్రూఫింగ్ చికిత్స ఇంజనీర్-ఇన్-చార్జి నిర్దేశించిన విధంగా.
5). కొటేషన్ల సమర్పణ ప్రారంభ తేదీ: 25-10-2025 11:00 AM
6). కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ: 28-10-2025 3:00 PM
7). కొటేషన్లు ఓపెనింగ్: 28-10-2025 3:00 PM
8). మరిన్ని వివరాలకు సంప్రదించండి. కార్యాలయం పనివేళల్లో లేదా 9000631586, 7331164056.

సం/- కమిషనర్
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 9690-PP/CL/ADVT/1/2025-26, Date: 24-10-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.74.43 కోట్ల నిధుల మంజూరు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ములుగు తో పాటు పలు జిల్లాల గ్రామీణ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.74.43 కోట్ల నిధులతో 32 కొత్త రహదారుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. గ్రామీణ రహదారులు పల్లె ప్రజల జీవితాల్లో కీలక పాత్రను పోషిస్తాయని, కొత్త రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పల్లె అభివృద్ధి చెందేలా, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మంత్రి సీతక్క శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని గిరిజన ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, అక్కడి పల్లెలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్న దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు.

## ఆర్‌టిసి కారుణ్య నియామకాల.. వయో పరిమితి 46 ఏళ్లకు పెంచాలి

ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో కారుణ్య నియామకాల వయోపరిమితిని గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి 46 ఏళ్లకు పెంచాలని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి యాజమాన్యానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో జి.ఓ 42 (2022) ద్వారా ప్రభుత్వ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచగా, జి.ఓ 30 (2024) ద్వారా రెండోసారి 46 ఏళ్లకు పెంచిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆర్‌టిసి కారుణ్య నియామకాలలో కూడా వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఆర్‌టిసిలో 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారినే నియమించుకుంటున్నారని, సేవలో ఉండగానే మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు 40 ఏళ్లు దాటిన కారణంగా వారి అభ్యర్థనలు తిరస్కరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా వందలాది కుటుంబాలు ఆదుకునే దిక్కులేక కష్టాల్లో ఉన్నాయని, ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత ఆర్‌టిసి యాజమాన్యంపై ఉందని వెంకన్న అన్నారు. అందువల్ల, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి కారుణ్య నియామకాల వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచి, గతంలో తిరస్కరించిన దరఖాస్తులను మళ్లీ పరిశీలించి, ఆ కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని వెంకన్న విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి ‘తెలంగాణ జాగృతి జనం బాట’

నాలుగు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర

ఆ తర్వాతే రాజకీయ భవిష్యత్‌పై ఒక నిర్ణయం..?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నెలల పాటు నిర్వహించనున్న ‘తెలంగాణ జాగృతి జనం బాట’ యాత్ర ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం నిజామాబాద్ నుంచి ప్రారంభించనున్నారు. అంతకుముందు ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయం నుంచి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడి నిజామాబాద్ జిల్లాకు చేరుకుంటారు. నాలుగు నెలల పాటు సాగనున్న యాత్రలో స్థానిక సమస్యలు, ప్రజల అభిప్రాయాలు,తాజా రాజకీయ పరిణామాలతో పాటు పలు అంశాలపై చర్చోపచర్చలు చేయనున్నారు. రైతులు, మహిళలు, కార్మికులు, యువత, మేధావులు, కుల సంఘాలు, జర్నలిస్టులు, తెలంగాణ ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలు తదితరులతో సమావేశం కానున్నారు. ప్రస్తుతం ‘తెలంగాణ ప్రజలు ఏం కోరుకుంటున్నారో,ఆ అంశాలను ఏజెండాతో ముందుకు సాగనున్నట్టు కవిత వెల్లడించారు. ఈ యాత్ర తర్వాతనే కవిత తన రాజకీయ భవిష్యత్‌పై ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు, తెలంగాణ జాగృతి విస్తరణ అంశాలపై కవిత ఒక నిర్ణయ తీసుకునే అవకాశాలు ఉన్నాయని జాగృతి వర్గాలు చెబుతున్నాయి. కాగా ముఖ్యంగా బిఆర్‌ఎస్‌తో విభేధించేందుకు దారి తీసిన కారణాలు, బిఆర్‌ఎస్‌లో కొందరు నాయకులు వ్యవహరించిన తీరు ఈ యాత్రలో చర్చకు రానున్నాయి.

## తెలంగాణ పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడిని అభినందించిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడిని డిజిపి బి.శివధర్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. 2025 అక్టోబర్ 13 నుండి 17వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలోని విఐటిలో జరిగిన 2వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 202526లో తెలంగాణ పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ జట్లు (వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా) పాల్గొన్నాయి. ఈ పోటీలో, తెలంగాణ పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు ఎండి. షుజావుద్దీన్ ఖాన్, (పిసి31603, పిఎస్ ఖైరతాబాద్, సి.పి ,హైదరాబాద్, )53 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా, పతక విజేత, కోచ్, డి.ఎస్.పి డాక్టర్ ఆర్.వి. రామారావు, , ఐ జి పి స్పోర్ట్స్ ఎం. రమేష్ లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డిని కలిశారు. పతక విజేత మరియు కోచ్‌ను డిజిపి అభినందించడంతో పాటు సత్కరించారు.

## జూబ్లీహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న పార్కును..
# సిఎం రేవంత్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో నిర్మాణంలో ఉన్న జిహెచ్‌ఎంసి పార్కు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వివాహ శుభకార్యాలకు హాజరై తిరిగివస్తున్న సందర్భంలో పార్కు వద్ద ఆగి జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. గతంలో చెత్తా చెదారంతో నిండిన ఈ ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా పార్కు నిర్మాణం చేపట్టాలని జిహెచ్‌ఎంసి అధికారులను సిఎం ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో, పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. పార్కులో పనిచేస్తున్న కూలీలతో సిఎం ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పనుల నాణ్యత, సౌకర్యాల ఏర్పాటు గురించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు.

**పలు వివాహా వేడుకలకు హాజరైన సిఎం రేవంత్ రెడ్డి**

అంతకు ముందు సిఎం రేవంత్ రెడ్డి నగరంలోని పలు వివాహ శుభకార్యాలకు హాజరయ్యారు. రాజేంద్రనగర్‌లో శాంతా బయోటెక్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి మనుమరాలు శృతి వివాహ వేడుకకు, హిమాయత్ సాగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కెకె మహేందర్ రెడ్డి కుమారుడు విపుల్ రెడ్డి వివాహానికి, అలాగే హైటెక్స్‌లో ఎమ్మెల్సీ సి.హెచ్. అంజిరెడ్డి కుమారుడు అనిష్ రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ముఖ్యమంత్రి పర్యటనతో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉత్సాహంగా స్వాగతం పలికారు.

## మద్యం షాపుల అప్లికేషన్ల గడువు ఎలా పెంచారు?

పెంపుపై ప్రభుత్వ వివరణకు ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్ :** మద్యం షాపుల ఎంపిక కోసం అప్లికేషన్ల సమర్పణ గడువును ఈ నెల 18వ తేదీగా నిర్ణయించాక దానిని ఈ నెల 23వ తేదీకి ఎలా మార్పు చేశారో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు ఆదేశించింది. దుకాణాల కేటాయింపు నిమిత్తం దరఖాస్తుల సమర్పించడానికి గడువును పొడిగింపునకు ఉన్న చట్ట నిబంధనలు ఏమిటో చెప్పాలంది. ప్రభుత్వ వివరణను బట్టి గడువు పెంపుపై స్టే ఇవ్వడమో లేక ఈనెల 18వరకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగా షాపుల కేటాయింపు చేయాలనే ఆదేశాలిస్తామని చెప్పింది. విచారణను శనివారానికి వాయిదా వేసింది. మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 18 నుంచి 23వరకు పొడిగింపునకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను హైదరాబాదీ వెంకటేశ్వర్‌రావు ఇతరులు వేసిన పిటిషన్లను జస్టిస్ తుకారాంజీ శుక్రవారం విచారించారు.

నోటిఫికేషన్ రూల్స్‌ను మార్పు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని పిటిషనర్ లాయర్ వాదించారు. ఇదేవిధంగా ఏపీలో చేస్తే అక్కడి హైకోర్టు అడ్డుకుందని చెప్పారు. కొన్ని జిల్లాల నుంచి గడువు పెంచాలనే ప్రతిపాదన వస్తే చట్ట వ్యతిరేకంగా ఉన్నతాధికారులు గడువు పెంచారని చెప్పారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ దుకాణాల కేటాయింపు ప్రక్రియ విధానపరమైనదని, దీనిలో కోర్టుల జోక్యానికి ఆస్కారం తక్కువని చెప్పారు. 18న బంద్ జరగడం వల్ల, సాంకేతిక సమస్యల వల్ల గడువు పెంచాల్సివచ్చిందన్నారు. గడువు తర్వాత 5793 దరఖాస్తులు మాత్రమే అందాయన్నారు. స్టే ఇవ్వొద్దని కోరారు. గడువు పొడిగింపుతో అందిన అదనపు అప్లికేషన్లపై తీర్పు ఉండేలా చేయవచ్చునని చెప్పారు. షాపుల ఎంపికలో గడువు తర్వాత అప్లికేషన్లు చేసుకున్న వాళ్లు ఉంటే వాళ్లకే తీర్పు అమలు చేసేలా ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. వివరణ చెప్పడానికి గడువు కావాలని కోరారు. దీంతో విచారణను శనివారానికి వాయిదా పడింది. మద్యం దుకాణాల కేటాయింపులో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించకపోవడాన్ని సవాలు చేసిన మరో పిటిషన్‌ను కూడా హైకోర్టు విచారించింది. షాపుల కేటాయింపు ప్రక్రియపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. భువనగిరి జిల్లాకు చెందిన శ్రీనివాస్ వేసిన పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

# మత్స్యకారుల జీవనోపాధికి రూ.123కోట్లు

రాష్ట్రంలోని 23వేల చెరువుల్లో రూ.88కోట్ల చేప పిల్లల విడుదలకు చర్యలు

ముదిరాజ్‌లను బిసి(డి) నుండి బిసి(ఎ) లోకి మార్చేందుకు ప్రయత్నిస్తాం

రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి





**ప్రజాపక్షం/తాండూరు :** రాష్ట్రంలోని మత్స్యకారుల కుటుంబాల జీవనోపాధి కల్పించేందుకు రూ.125కోట్ల నిధులు కావాలని కోరితే రూ.123కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజనుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి ప్రాజెక్టులో చేపపిల్లల విడుదల, తాండూరు పట్టణ శివారులో రూ.50లక్షల నిధులతో చేపట్టనున్న ముదిరాజ్ భవన నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమానికి స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డితో కలసి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కోట్‌పల్లి ప్రాజెక్టులో మూడు రకాల 10లక్షల పైగా చేపపిల్లలను వివిధ కార్పోరేషన్ల చైర్మన్లతో కలసి వదిలారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలలో మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెను మార్పులు తీసుకవచ్చిందన్నారు. మత్స్యకారులకు ఉపాధి కల్పిచెందుకు రాష్ట్రంలోని 23వేల చెరువుల్లో 88కోట్ల చేప పిల్లల వదులటకు చర్యలు చేపట్టామని అన్నారు. ముదిరాజ్ కుటుంబాలను కులవృత్తిని ఆధారంగా చెరువుల్లో చేపలను పట్టుకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని సద్దుద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా పెద్ద ఎత్తున్న రిజర్వాయర్ల, ప్రాజెక్టుకులు, చెరువుల్లో చేప పిల్లలను వదలడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులను సరిగ్గా పట్టించుకున్న పాపన పోలేదని, ఎన్ని చెరువుల్లో ఎన్ని చేప పిల్లలు విదిలారో కూడా లెక్కలు లేవని ఆరోపించారు. జిల్లలో ఒక కోటి 29లక్షల చేపపిల్లలను దిలేందుకు ప్రభుత్వం నుంచి అనుతులు రావడం జరిగిందని, దీనికి కోటి 7లక్షల నిధులు వచ్చించడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు ఏదైన ప్రమాదాలకు గుర అయినట్లయితే కోటి 40లక్ష ఉచిత బీమాకు గాను ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలోని బిసిడి/19లో ఉన్న ముదిరాజ్‌లను బీసిఎ/19లోకి మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు. తాండూరులో ముదిరాజ్ భవన నిర్మాణానికి తనవంతు పూర్తి సహకారం అందజేస్తానని అన్నారు. తాండూరులో రూ.5కోట్ల నిధులతో స్టేడియం ఏర్పాటుకు మంత్రి హామి ఇచ్చారు. సెట్విన్ ఆద్వర్యాన తాండూరులో నిరుద్యోగ యువకుల కోసం జాబ్ మేళా నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

**ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా...ఎమ్మెల్యే బిఎంఆర్**

సాధరణ ఎన్నికల సమయంలో తాండూరు ముదిరాజ్‌లకు ఇచ్చిన మాట ప్రకారం తాను ఎంఎల్‌ఏ గెలిచిన 23నేలల కాలంలోనే ముదిరాజ్ భవనాన్ని మంజూరు చేయించి తన మాట నిలబెట్టకున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ముదిరాజ్‌లకు అధిక ప్రధాన్యత ఉందన్నారు. మంత్రి సహకారంతో త్వరలోనే ముదిరాజ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్ అథారిటి చైర్మన్ శివసేనారెడ్డి,రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్, వైశ్య కార్పోరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్, మత్యక్స సహారం సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞానేశ్వర్, డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, అధనపు కలెక్టర్ సుదీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, బిసి సంక్షేమాధికారి మాధవ రెడ్డి,ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు ఉత్తమ్ చంద్, కార్యదర్శి జర్నప్ప, లొంక నర్సిములు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ తదితరులు పాల్గోన్నారు.

**గురుకుల పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం**

తాండూరు పట్టణ శివారులోని మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డితో కలసి రాష్ట్ర మత్స్యసహాకార, పశు సంవర్ధక, క్రీడలు, యువజనశాఖాల మంత్రి వాకిటి శ్రీహరి అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలను సందర్శించిన మంత్రి వండిన అన్నం, శాంబారులను రుచి చూచారు. ప్రభుత్వం మెస్‌చార్జీలను పెంచిందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు ఉన్నతమైన విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.



## 27న మద్యం షాప్‌ల డ్రా..

గడువు ముగిసినా 95,137 దరఖాస్తులు : ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని దరఖాస్తులు చివరి రోజున 23 గురువారం రాత్రి వరకు 4822 దరఖాస్తులు వచ్చాయి. బిసి బంద్, పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్టు బస్సులు నడువక పోవడం, కొన్ని చోట్ల బ్యాంకులు పని చేయక పోవడం లాంటి ఘటనలను దృష్టి ఉంచుకొని ఎక్సైజ్ శాఖ మద్యం షాపులకు దరఖాస్తుల గడవు ఈ నెల 23 వరకు పొడగించిన విషయం తెలిసిందే. తెలంగాణలో 2620 మద్యం షాపులకు గడువు ముగిసే నాటికి 95,137 దరఖాస్తులను దాఖలు చేశారు. రంగారెడ్డి డివిజన్‌లో 29,420 అత్యధికంగా రాగా, అదిలాబాద్ డివిజన్‌లో 4154 తక్కువగా వచ్చాయి.27న మద్యం షాపులకు డ్రా తీయనున్నారు. ఎక్సైజ్ సూపరిండెంట్‌ల, జిల్లా వారిగా మద్యం షాపుల దరఖాస్తుదారుల సమక్షంలో ఈనెల 27న డ్రా తీయబడును. 27న ఉదయం 11 గంటలకు కలెక్టర్ల సమక్షంలో మద్యం షాపులకు డ్రా తీయబడును. ఎక్సైజ్ జల్లాల వారిగా.. అదిలాబాద్‌లో 771, కోమురం భీమ్ అసిఫాబాద్‌లో 680, మంచిర్యాల్‌లో 1712, నిర్మల్‌లో 991, హైదరాబాద్‌లో 3201, సికింద్రాబాద్‌లో 3022, జగిత్యాలలో 1966, కరీంనగర్‌లో 2730, పెద్దపల్లిలో 1507,రాజన్న సిరిసిల్లలో 1381, ఖమ్మంలో 4430, కొత్తగూడెంలో 3922, జోగులాంబ గద్వాలలో 774, మహబూబ్‌నగర్‌లో 2487, నాగర్‌కర్నూల్‌లో 1518, వనపర్తిలో 757, మెదక్‌లో 1420, సంగారెడ్డిలో 4432, సిద్దిపేట్‌లో 2782, నల్లగొండలో 4906, సూర్యపేట్‌లో 2771, యాదాద్రి భువనగిరిలో 2776, కామారెడ్డిలో 1502, నిజామాబాద్‌లో 2786, మల్కాజిగిరిలో 5168, మేడ్చల్‌లో 6063, సరూర్‌నగర్‌లో 7845, శంషాబాద్‌లో 8536, వికారాబాద్‌లో 1808, జనగామాలో 1697, జయంశంకర్ భూపాల్‌పల్లిలో 1863, మహబూబబాద్‌లో 1800, వరంగల్ రూరల్‌లో 1958 వరంగల్ అర్బన్‌లో 3175 మొత్తంగా 95,137 దరఖాస్తులు వచ్చాయి.

## రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయండి




‘కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ’లో హరీశ్‌రావు, కృష్ణయ్య, జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి బలమైన ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నిరుద్యోగ జెఎసి అధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జల విహార్‌లో ‘కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ’ కార్యక్రమానికి తన్నీరు హరీష్ రావు, ఆర్. కృష్ణయ్య,జాన్‌వెస్లీ, బిఆర్‌ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ నిరుద్యోగ జెఎసి,విద్యార్థి సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు వేడుకుని, ఆ తర్వాత నిరుద్యోగులను ఎన్నికల్లో వాడుకుని, తీర అధికారంలోకి రాగానే వారికి ఇచ్చిన హామీలను వదిలేశారని మండిపడ్డారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని కాంగ్రెస్ మాయ మాటలతో మోసం చేస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్ నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి వస్తే ఆయన అసలు రంగు బయటపడుతుందన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయడంలేదని, కానీ రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు జారీ చేశారని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి అంతా ఒక బోగస్ అని, రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయిందని ఎద్దేవా చేశారు. జాబులు నింపాలంటే, జేబులు నింపుకుంటున్నారని, గల్లా పెట్టెలు నింపుకుంటున్నారని ఆరోపించారు.గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు.

## పన్ను చెల్లింపుదారుల పట్ల అమర్యాద

జిఎస్‌టి అధికారులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్బోధ

ఘజియాబాద్ : వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) అధికారులు నిజాయితీగా వ్యవహరించి పన్ను చెల్లింపుదారుల జీవితాలను సులభతరం చేయాలని, అదే సమయంలో నిజాయితీలేని వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సిజిఎస్‌టి భవన ప్రారంభోత్సం సందర్భంగా ఆమె ప్రసంగించారు. అధికారులపై క్రమశిక్షణా చర్యలను సకాలంలో ముగించాల్సిన అవసరాన్ని మంత్రి నిర్మలాసీతారామన్ నొక్కిచెప్పారు. అలా చేయడం ద్వారా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డ్ (సిబిఐసి) దుష్ప్రవర్తన, విధినిర్వహణలో నిర్లక్ష్యం లేదా అనైతిక ప్రవర్తనను సహించబోమనే స్పష్టమైన సందేశాన్ని పంపుతుందని సీతారామన్ చెప్పారు.

రిజిస్ట్రేషన్ అనుమతులు, ఫిర్యాదుల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉ పయోగించమని ఫీల్డ్ అధికారులను మంత్రి నిర్మల కోరారు. వాణిజ్య సులభతర చర్యలను ముందుగానే చేపట్టే పనిని కూడా ఆమె వారికి అప్పగించారు. ‘మీకు, ట్రేడర్‌కు మధ్య ఎలాంటి ఇనుప గోడ లేదు. గాలి గాలిలా ఉంది. కష్టాన్ని మరింత గందరగోళానికి గురిచేయడం కంటే ఆ కష్టమే ఎక్కడ దాగి ఉందో మీరు అర్థం చేసుకోవచ్చు. నిజాయితీగల పన్ను చెల్లింపుదారులతో వ్యవహరించేటప్పుడు జిఎస్‌టి అధికారులు ఎక్కువ సానుభూతి, మర్యాదను చూపించాలి. తదుపరి తరం జిఎస్‌టి కింద గౌరవప్రదంగా వ్యవహరించబడుతున్నారనే భావనను వారికి కలిగించాలి’ అని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆకాంక్షించారు. ‘పన్ను చెల్లింపుదారులలో చెడ్డగొర్రెలు అధిక సంఖ్యలో ఉంటే వారిని పట్టుకోవడానికి ప్రోటోకాల్ ఉంది. కానీ అందరినీ అనుమానాస్పద దృష్టి కోణంతో చూడకండి’ అని మంత్రి సూచించారు. ‘తదుపరి తరం జిఎస్‌టి కేవలం రేట్ల గురించి మాత్రమే కాదు. మీరు మర్యాదగా ఉండటం అనేది ఎంతో ముఖ్యమైనది. తదుపరి తరం జిఎస్‌టి కేవలం రేట్లు, శ్లాబులు, సరళీకరణ గురించి కానే కాదు. ఇది పన్ను చెల్లింపుదారులను భిన్నంగా భావించేలా చేయాలి’ అని మంత్రి అన్నారు. అయితే మర్యాదను అమలులో రాజీగా చూడకూడదు అని కూడా నిర్మలా సీతారామన్ అన్నారు. ‘మంచి పనిని కొనసాగించండి. వేగాన్ని కొనసాగించండి. జీవితాన్ని సులభతర ం చేయడమే మా అంతిమ లక్ష్యం అని నిజాయితీపరులైన పన్ను చెల్లింపుదారులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. నిజాయితీపరులు కాని పన్ను చెల్లింపుదారులకు మీరు మీరు ఎట్టి పరిస్థితులలోనూ ఓదార్పును ఇవ్వకండి. మనం అలా చేసినట్లయితే ఆర్థికవృద్ధి, శ్రేయస్సు ఖచ్చితంగా మనల్ని అనుసరిస్తాయి’ అని మంత్రి చెప్పారు. నిజాయితీలేని పన్ను చెల్లింపుదారులతో పన్ను చెల్లింపుదారులు ‘ఆత్మాశ్రయంగా’ ఉండనవసరం లేదని అన్నారు. నిర్దేశించిన ప్రోటోకాల్‌ను లేదా ఎస్‌ఒపిని మాత్రమే అనుసరిస్తారని ఆమె తెలియజేశారు.

2025 నవంబరు 1నుండి సరళీకృత జిఎస్‌టి రిజిస్ట్రేషన్ పథకం రెండు సందర్భాలలో మూడు పని దినాలలో ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్ మంజూరు చేస్తుంది అని సీతారామన్ వివరించారు. డేటా ఆధారంగా సిస్టమ్‌ను గుర్తించే దరఖాస్తుదారులు వారి అవుట్‌పుట్ పన్ను బాధ్యత నెలకు రూ.లక్షకు మించదని స్వీయఅంచనా వేసేవారు.ఈ ఒక్క సంస్కరణ 96శాతం దరఖాస్తుదారులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. క్షేత్ర నిర్మాణం పని దానిని ఘర్షణతో అమలు చేయడం అని మంత్రి చెప్పారు.

## సిసిఐ సీనియర్ నేత స్టాలిన్ బాబు మృతి

నేడు గుంటూరులో అంతిమయాత్ర




**గుంటూరు/హైదరాబాద్ :** సిపిఐ సీనియర్ నాయకులు, విద్యార్థి, యువజనోద్యమ మాజీ నేత బొప్పూడి స్టాలిన్ బాబు (78) శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం విదితమే. స్వాతంత్ర్య సమరయోధుడు బొప్పూడి కోటయ్య కుమారుడు స్టాలిన్ బాబు. గుంటూరు ఎసి కళాశాలలో బిఎ చదివి, 1968లో కొడాలి మరుద్వతిని వివాహమాడారు. వీరికి మధుభారతి, కవిత ఇద్దరు కుమార్తెలు. స్టాలిన్ విద్యార్థి దశ నుంచే ఎఐఎస్‌ఎఫ్‌లో చురుకైన పాత్ర పోషించారు. సిపిఐ నాయకులు డాంగే, మీనాజ్ కర్, పెరవలి కష్ణయ్య, సుధాకర్ రెడ్డి, నారాయణకు అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. వీరు అనేక దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీతో ఎంతో అనుబంధం కలిగి ఉండి వివిధ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించారు. 1970లో గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) సదస్సును విజయవంతంగా నిర్వహించారు. సిపిఐ అగ్ర నేత చంద్ర రాజేశ్వరరావుతో వీరికి బలమైన అనుబంధం ఉంది. కనపర్తి నాగయ్య, వల్లూరు గంగాధరరావు, మల్లయ్యలింగం, వేములపల్లి శ్రీకృష్ణ వంటి ఆనాటి ప్రముఖ నాయకులతో కలిసి ఆయన పని చేశారు. 1975లో విజయవాడలో జరిగిన సిపిఐ 10వ జాతీయ మహాసభల్లో జనసేవా దళ్ రాష్ట్ర ఉప కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఎఐవైఎఫ్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా, ఎఐఎస్‌ఎఫ్ నాయకునిగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో పోరాటాలు నిర్వహించారు. కొన్ని వేల మంది విద్యార్థి, యువజన నాయకులకు 70వ దశకంలో మార్గదర్శిగా ఉన్నారు. సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఎంతో మంది ఆయన శిష్యులుగా ఎదిగి సిపిఐ ఉద్యమంలో కొనసాగుతున్నారు. ఆల్ ఇండియా ఎల్‌ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ సెక్రటరీ కూడా స్టాలిన్ బాబు పని చేశారు. స్టాలిన్ బాబు భార్య మరుద్వతి శ్రీవెంకటేశ్వర బాల కుటీర్ వారి అనుబంధ సంస్థ చేతన ఛారిటబుల్ ట్రస్ట్ కార్య నిర్వహకురాలిగా ఎన్నో వసంతాలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. స్టాలిన్ బాబు కళ్లను పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. శనివారం ఉదయం పది గంటలకు గుంటూరు శ్యామలనగర్ 7వ లైనులోని వారి స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని, స్తంభాలగరువులోని స్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నాకు రాజకీయ మార్గదర్శకులు స్టాలిన్ బాబు : కె.నారాయణ**

స్టాలిన్ బాబు మరణం పట్ల సిపిఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విచారం వ్యక్తం చేశారు. ‘నాకు రాజకీయ బాట చూపిన మార్గదర్శకులు స్టాలిన్ బాబు గుంటూరులో మన అందరినీ వదిలి నిర్దాక్షిణ్యంగా వెళ్లిపోయాడని తెలిసి తీవ్ర విచారం చెందాను. ఇలాంటి సమయంలో నేనుండాల్సిన బంధం మాది. అయితే పిల్లలతో ఉండాలని అమెరికా వచ్చేశాను. ఈ నెల 11, 12 తేదీలలో స్టాలిన్ బాబుతో, మా అమ్మలాంటి మరుద్వతి వదినను కలిశాను’ అని నారాయణ గుర్తు చేశారు. రాజకీయ జన్మనిచ్చిన స్టాలిన్ బాబు మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ... మరుద్వతికి, వారి పిల్లలకు సానుభూతి వ్యక్తం చేశారు.

**విద్యార్థి, యువజన ఉద్యమాలలో స్టాలిన్ పాత్ర మరువలేనిది : కూనంనేని**

సిపిఐ సీనియర్ నాయకులు స్టాలిన్ బాబు మరణం చాలా బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యార్థి, యువజన ఉద్యమాలలో ఆయన పాత్ర మరువలేనిదని తెలిపారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోట పేర్కొన్నారు. స్టాలిన్ బాబు మరణంపట్ల ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు కూనంనేని సాంబశివరావు సానుభూతి తెలిపారు. కాగా, స్టాలిన్ మృతికి సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి. చెన్న కేశవరావు సంతాపం తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రేపటి నుంచి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 'సంకల్ప్ యాత్ర'

**పాట్నా:** దళిత నాయకుడు రామ్ నరేష్ రామ్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 26న బిహార్‌లోని భోజ్‌పూర్ ప్రాంతంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 'సంకల్ప్ యాత్ర' నిర్వహించనుంది, అసెంబ్లీ ఎన్నికల వేళ 'సంకల్ప్ పాత్ర'ను ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్ సంకల్ప్ పాత్ర మహాఘట్‌బంధన్ మ్యానిఫెస్టోనుఅమలు చేయడానికి హామీగా నిలుస్తుందని వారు తెలిపారు. సిపిఐ(ఎంఎల్),సిపిఐ,సిపిఐ(ఎం) కాకుండా కాంగ్రెస్, ఆర్‌జెడి, విఐపిలను కలిగి ఉన్న మహాఘట్‌బంధన్ ఈనెల 28న బిహార్ కోసం మ్యానిఫెస్టోవిడుదల చేయనుంది. పరాస్జీగా పేరొందిన రామ్ 1995–2010 మధ్య బిహార్ అసెంబ్లీ సభ్యుడు, సిపిఐ(ఎంఎల్) వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగా ఉన్నారు. అక్టోబర్ 26న ఆయన 15వ వర్ధంతి. భోజ్‌పూర్ జిల్లాలో సిపిఐ(ఎంఎల్)10కి.మీ.పాదయాత్రనిర్వహించనుంది.సిపిఐ(ఎంఎల్) జన్మస్థలంగా గుర్తించబడిన,పార్టీవ్యవస్థాపకనాయకులు జగదీష్ మాస్టర్, రామ్, రామేశ్వర్‌యాదవ్‌లతో చారిత్రాత్మక ఎక్వారీ నుండి యాత్ర ప్రారంభమవుతుంది.

# బిహార్ ఇంకా పేద రాష్ట్రమే

### ఎన్‌డిఎ మళ్లీ అధికారంలోకి వచ్చినా నితీష్ సిఎం కారు
### బిజెపి నితీశ్‌కుమార్‌ను హైజాక్ చేసింది : తేజస్వీ యాదవ్



**పాట్నా:**జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎ 20 సంవత్సరాలు రాష్ట్రంలో పాలన సాగిస్తున్నప్పటికీ బిహార్ ఇప్పటికీ పేద రాష్ట్రమేనని ఆర్‌జెడి నేత, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. పాలక కూటమి మళ్లీ అధికారంలోకివస్తే ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి కాలేరని జోస్యం చెప్పారు. నితీష్ కుమార్‌ను బిజెపి హైజాక్ చేసిందని, గుజరాత్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు పరోక్షంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షానుఉద్దేశించి బిహార్‌లో పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రం సర్కార్ బిహార్ రాష్ట్రంలో అవినీతి నాయకులను, నేరస్థులను కాపాడుతోందని మండిపడ్డారు. సహర్సా జిల్లాలో సిమ్రీ భక్తియార్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో తేజస్వీ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల తర్వాత ఎన్నికైన ఎన్‌డిఎ కూటమి శాసనసభ్యులు బిహార్ ముఖ్యమంత్రిని నిర్ణయిస్తారని అమిత్ షా స్పష్టం చేశారని, అయితే ఎన్‌డిఎ మళ్లీ అధికారంలోకి వస్తే నితీష్ కుమార్‌ను సిఎంను చేయరని తేజస్వీ అన్నారు.ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే స్వచ్ఛమైన ప్రభుత్వాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఫిర్యాదులను వినే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని, వారికి సరసమైన మందులు ఉద్యోగాలు సమకూరుస్తానని మాజీ డిప్యూటీ సిఎం అన్నారు. 'నా రాష్ట్రం పేదరికంలో ఉందని, నిరుద్యోగం, అవినీతి, నేర కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఒక బిహారీగా నేను బాధపడ్డాను. బిహార్‌లో 20 సంవత్సరాలు, కేంద్రంలో 11 సంవత్సరాలు ఎన్‌డిఎ పాలన ఉన్నప్పటికీ, రాష్ట్ర తలసరి ఆదాయం అత్యల్పంగా ఉందని, రైతులు ఇంకా పేదవారిగానే ఉన్నారని విమర్శించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 'బహ్రీ' (బయటి వ్యక్తులు) కాకుండా 'బిహారీ'కి ఓటు వేయాలని సహర్సా ప్రాంత ఓటర్లకు ఆర్‌జెడి నాయకుడు విజ్ఞప్తి చేశారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులతో సహా ప్రతిపక్ష నాయకులపై దర్యాప్తు సంస్థలను ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వంపై కూడా ఆయన ఆరోపించారు. లాలూ మోదీకి భయపడక పోతే, అతని కుమారుడు కూడా భయపడడు అని ఆయన అన్నారు. అవినీతి, నేరాలు లేని, వృద్ధికి పెట్టుబడులను ఆకర్షించే బిహార్‌ను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే అత్యల్పంగా ఉందని, రైతులు, కార్మికులు దయనీయ స్థితిలో ఉన్నారని తేజస్వీ ఎత్తిచూపారు. తమకు ఒక అవకాశం ఇస్తే ఎన్‌డిఎ ప్రభుత్వం 20 సంవత్సరాలలో చేయలేనిది, 20 నెలల్లో చేసి చూపిస్తాము అని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే, ఎల్‌పిజి సిలిండర్ల ధరను దాదాపు రూ. 1,000 నుండి రూ. 500కి తగ్గిస్తానని, వృద్ధాప్య పెన్షన్‌ను రూ. 1100 నుండి రూ. 1,500కి పెంచుతానని, కాంట్రాక్టు కార్మికులు, కమ్యూనిటీ మొబిలైజర్ల సేవలను క్రమబద్ధీకరిస్తానని, బిహార్‌లోని ప్రతి ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తానని మరోసారి ఉద్ఘాటించారు. బిహార్ డిప్యూటీ సిఎంగా తన స్వల్ప కాలంలో సాధించిన విజయాలను కూడా యాదవ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు, 11 సంవత్సరాలలో 22 కోట్ల ఉద్యోగాల లెక్క ఎక్కడా? అని ఆయన ప్రశ్నించారు. అంతకు ముందు తేజస్వీ యాదవ్ పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ బిజెపి గుజరాత్‌లో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి బిహార్‌లో విజయం కోసం చూస్తోందని, ఇది జరగదు అని అన్నారు. బిహార్‌లో ఆర్‌జెడి పాలనలో 'జంగల్ రాజ్' జరిగిందని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలకుస్పందిస్తూ,'ప్రధానమంత్రి స్వయంగా నితీష్ కుమార్ ప్రభుత్వం చేసిన 55 కుంభకోణాలను ప్రస్తావించారు. ఆయన ఏ చర్య తీసుకున్నారని ప్రశ్నించారు. భారతదేశంలో అత్యధిక నేర కార్యకలాపాలు బిజెపి పాలిత రాష్ట్రాలలోనే జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

# గతంకంటే ఎన్‌డిఎ రికార్డుస్థాయి విజయాన్ని సాధిస్తుంది

### బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**సమస్తిపూర్/బెగుసరాయ్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బిహార్‌లోని సమస్తిపూర్, బెగుసరాయ్ జిల్లాల్లో నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బెయిల్ పై బయటకు వచ్చిన నడిపిస్తున్న ప్రతిపక్ష ఆర్‌జెడి, కాంగ్రెస్ కూటమిని ఓటర్లు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి రికార్డు విజయాన్ని సాధిస్తుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు. విచ్ఛిన్నమైన ప్రతిపక్ష ఇండియా కూటమి, సంఘటిత ఎన్‌డిఎ మధ్య వ్యత్యాసాన్ని గీయడానికి ప్రయత్నిస్తూ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడియు, చిరాగ్ పాస్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చాలతో కూడిన బిజెపి నేతృత్వంలోని సంకీర్ణం ఐక్యంగా అభివృద్ధిపై దృష్టి సారించిందని మోదీ అన్నారు. సమస్తిపూర్‌లో జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి 'జన్ నాయక్' (ప్రజల హీరో) అనే బిరుదును కాంగ్రెస్ కార్యకర్తలు దొంగిలించడాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. 'అక్టోబర్ 2005లో మీ తల్లిదండ్రులు 'జంగల్ రాజ్' (ఆర్‌జెడి–కాంగ్రెస్ పాలన)ను అంతం చేశారు. సరిగ్గా 20 సంవత్సరాల తరువాత, మీ భుజాలపై పెద్ద బాధ్యత ఉంది, సుపరిపాలన (సుశాసన్)కు అనుకూలంగా ఓటు వేయడం ద్వారా శ్రేయస్సు (సమృద్ధి)ను సులభతరం చేయవచ్చు' అని మోదీ యువ ఓటర్లనుద్దేశించి పేర్కొన్నారు. నితీష్ కుమార్ నాయకత్వంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ పోరాడుతోందని మోదీ స్పష్టం చేశారు. గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో బిజెపి అధికారాన్ని నిలుపుకోగలిగిందని, మహారాష్ట్రలో కూడా సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నదని, బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ మునుపటి రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుందని జోస్యం చెప్పారు. ప్రధాన మంత్రి ఇండియా కూటమిని 'మహాలత్ బంధన్' (భాగస్వాములు ఒకరినొకరు కర్రలతో కొట్టుకునే మహా కూటమి)గా ఆయన అభివర్ణించారు. ఇండియా బ్లాక్‌లోని రెండు అతిపెద్ద భాగస్వామ్య పక్షాలైన ఆర్‌జెడి, కాంగ్రెస్ నాయకులు అత్యంత అవినీతిపరులు, బెయిల్‌పై బయట ఉన్నారని ఆయన ఆరోపించారు. గత 11సంవత్సరాలలో, యుపిఎ ప్రభుత్వం కంటే రాష్ట్రం మూడు రెట్లు ఎక్కువ కేంద్ర సహాయాన్ని పొందిందని, నితీష్ కుమార్ అధికారంలోకి వచ్చినందుకు ప్రజలపై ప్రతీకారం తీర్చుకోవడానికి, రాష్ట్రానికి ఎటువంటి సహాయం అందించవద్దని కాంగ్రెస్‌ను ఆర్‌జెడి బ్లాక్ మెయిల్ చేసిందని ప్రధాని ఆరోపించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు మూడేళ్లు ఉచిత భోజనం

**చెన్నై :** గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జిసిసి)లోని పారిశుద్ధ్య కార్మికులకు మూడేళ్ల పాటు ఉచిత భోజనం అందించడానికి తమిళనాడు ప్రభుత్వం రూ.186.94 కోట్లకు పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. ఈ చర్య ద్వారా 512 ప్రదేశాలలో ప్రైవేట్ కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్న సిబ్బందితో సహా దాదాపు 29,455 మంది కన్జర్వెన్సీ కార్మికులకు భోజనం అందించడానికి జిసిసి దోహదపడుతుందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటి సరఫరా విభాగం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులో తెలిపింది. జిసిసి పరిధిలోని రెండు జోన్లలో వ్యర్థ పదార్థాలనిర్వహణకార్యకలాపాలనుప్రైవేటీకరించడం, ఉద్యోగాలను క్రమబద్ధీకరించడాన్ని నిరసిస్తూ పారిశుద్ధ్య కార్మికులు సుదీర్ఘంగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఆగస్టు 14న ప్రభుత్వం ప్రకటించిన ఆరు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలలో ఉచిత భోజన పథకం ఒకటి. నిర్దేశిత వంటశాలలలో ఆహారాన్ని తయారు చేయడానికి పౌర సంస్థ మూడు సంవత్సరాల పాటు కాంట్రాక్టుపై క్యాటరింగ్ ఏజెన్సీని నియమిస్తుంది. ఫుడ్‌సేఫ్టీఅండ్‌స్టాండర్డ్స్అథారిటీ ఆఫ్ ఇండియానిబంధనలకుఅనుగుణంగాతయారుచేసిన భోజనాన్ని ప్యాక్ చేసి, సంబంధిత కార్యాలయాలలో పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేయబడుతుంది. ఈ పథకాన్ని మూడు సంవత్సరాల పాటు అమలు చేయడానికి మంజూరు చేయబడిన మొత్తం రెండవ, మూడవ సంవత్సరాలలో తయారీ, పంపిణీ ఛార్జీల కోసం 5 శాతం ఖర్చు పెరుగుదలను కవర్ చేసింది.


**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 325 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

..... Disputant

VERSUS

**MD.AFROZ JABEEN & OTHERS**

...Opponents

1. Mohd Afroz Jabeen W/O Mohd.Yakub Pasha Aged About 47 Years Occ: Business, R/O. H.No.1-7-185, Subeadari, Hanamkonda.
2. Mohd. Yakub Pasha S/O Haneef Aged About 54 Years Occ: Business. R/O. H.No. 2-9-898/1, NGO" colony, Waddepally, Hanmkonda.
3. Siripuram Shekar S/O Mallaiah Aged About 54 Years Occ: Sr.Asst. Irrigation Dept. R/O. H.No.1-9-148, Julywada, Hanamkonda.
4. Hameed Bin Mahaboob S/O Mohd.Bin Ahmed Aged About 50 Years Occ: Special Associate/SBI Bank. R/O. H.No. 24-3-85/4/2, Prakesh Reddy Peta, Julywada, Hanamkonda.
5. Pendli Kanaka Malla Reddy S/O Ram Reddy Aged About 70 Years Occ: Business. R/O. H.No. 1-8-109/2/1, Balasamudram, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**


## అడ్వర్‌టైజింగ్ దిగ్గజం పీయూష్ పాండే మృతి



**న్యూఢిల్లీ:** అడ్వర్‌టైజింగ్ దిగ్గజం పీయూష్ పాండే మృతిచెందారు. ఆయన వయసు 70 ఏళ్లు. ఫెవికాల్, క్యాడ్‌బరీ,ఏషియన్‌పేయింట్స్‌లాంటి ప్రఖ్యాత బ్రాండ్‌లకు ఆయన యాడ్స్ రూపొందించారు. గత కొన్నాళ్ల నుంచి ఆయన ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. శనివారం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సుమారు నాలుగు దశాబ్ధాల నుంచి ఆయన అడ్వర్టైజింగ్ పరిశ్రమలో ఉన్నారు. ఓగ్లివీ యాడ్ కంపెనీలో చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా చేశారు. 1982లో ఓగ్లివీ కంపెనీలో పాండే చేరారు. సన్‌లైట్ డిటర్జెంట్ కోసం ఆయన తొలిసారి యాడ్ రాశారు. ఆరేళ్ల తర్వాత కంపెనీ క్రియేటివ్ శాఖలో చేరాడు. ఆ తర్వాత ఎన్నో పాపులర్ యాడ్స్‌ను ఆయన రూపొందించారు. ఫెవికాల్, క్యాడ్‌బరీ, ఏషియన్ పేయింట్స్, లూనా మోపెడ్, ఫార్చ్యూన్ ఆయిల్‌తో పాటు అనేక బ్రాండ్లకు యాడ్స్‌నుతయారు చేశారు. ఓగ్లివీ ఇండియా యాడ్ ఏజెన్సీ ఆయననాయకత్వంలో వరుసగా 12 ఏళ్ల పాటు నెంబర్ వన్ స్థానంలో కొనసాగింది. పాండే ఎన్నో అవార్డులను గెలుచుకున్నారు. 2016లో ఆయన్ను పద్మశ్రీ వరించింది. సినిమాల్లో కూడా ఆయన నటించారు. 2013లో రిలీజైన మద్రాస్ కేఫ్‌లో నటించారు. జాతీయ సమగ్రత కోసం రూపొందించిన మిలే సుర్ మేరా తుమారా పాటకు సాహిత్యాన్ని అందించారు. భోపాల్ ఎక్స్‌ప్రెస్ అనే చిత్రానికి ఆయన స్క్రీన్‌ప్లే సహకారం అందించారు. పీయూష్ పాండే మృతిపట్ల అనేక మంది సెలబ్రిటీలు, నేతలు సంతాపం తెలిపారు. పీయూష్ పాండే సృజనాత్మకత అద్భుతమని ప్రధాని మోదీ అన్నారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. భారతీయ అడ్వర్‌టైజిజింగ్ రంగంలో ఆయన లెజెండ్ అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

# యువత సాధికారతకు కృషి : మోదీ

**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం యువతకు సాధికారత కల్పించడానికి కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలనుస్వల్పంగాకోల్పోయినఅభ్యర్థులనుప్రైవేట్ రంగంలో కాబోయే యజమానులతో అనుసంధానించడానికి మార్గాలను సృష్టించిందని చెప్పారు. 17వ రోజ్‌గార్ మేళాలో ప్రధానమంత్రి మోదీ రికార్డు చేసిన సందేశంలో దేశ విదేశాంగ విధానాన్ని కూడా యువకుల ఆసక్తినిదృష్టిలోఉంచుకుని రూపొందిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగిన రోజ్‌గార్ మేళాల్లో 51,000 మందికి పైగా అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం నియామక లేఖలు అందుకున్నారు. రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటివరకు 11 లక్షలకు పైగా నియామక లేఖలు జారీ చేయబడ్డాయని ప్రధాని మోదీ చెప్పారు. ప్రభుత్వం 'ప్రతిభా సేతు పోర్టల్' అనే కొత్త చొరవను ప్రారంభించిందని ప్రధాని చెప్పారు, ఇది యుపిఎస్‌సి తుది జాబితాలో చేరి ఎంపిక కాని అభ్యర్థులకు అవకాశాలను అందిస్తుంది. 'వారి ప్రయత్నాలు వృథా కావు, ఎందుకంటే ప్రైవేట్ మరియు ప్రభుత్వ సంస్థలు ఇప్పుడు ఈ పోర్టల్ ద్వారా ఈ ప్రతిభావంతులైన వ్యక్తులతో నిమగ్నమై ఉన్నాయి' అని ప్రధాని మోదీ అన్నారు. యువత ప్రతిభను ఇంత ఉత్తమంగా ఉపయోగించడం భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి ప్రదర్శిస్తుందని అన్నారు. 'యువతకు సాధికారత కల్పించడం బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం అనేక యూరోపియన్ దేశాలతో పెట్టుబడి భాగస్వామ్యాలను కుదుర్చుకుందని, వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. పెట్టుబడి పెంచడానికి, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇలకు మద్దతు ఇవ్వడానికి బ్రెజిల్, సింగపూర్, దక్షిణ కొరియా, కెనడా వంటి దేశాలతో తాము అనేక ఒప్పందాలపై సంతకం చేశామని చెప్పారు. ఈ సహకారాలు ఎగుమతులను బలోపేతం చేస్తాయని, భారతదేశ యువతకు వృద్ధి, అవకాశాలకు కొత్త మార్గాలను తెరుస్తాయన్నారు. విదేశాంగ విధానం కూడా భారతదేశ యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడుతోందన్నారు. తమ దౌత్యపరమైన చర్యలు, ప్రపంచ ఒప్పందాలు యువత శిక్షణ మరియు ఉపాధి కల్పనపై ఎక్కువగా దృష్టి సారించాయని మోదీ పేర్కొన్నారు. జిఎస్‌టి రేట్లలో ఇటీవలి తగ్గింపు దేశంలో ఒక పెద్ద సంస్కరణను గుర్తించిందని, దానిప్రభావం ప్రజల పొదుపును పెంచడం కంటే చాలా ఎక్కువగా ఉందని ప్రధాన మంత్రి అన్నారు. తదుపరి తరం జిఎస్‌టి సంస్కరణలు ఉపాధి, వృద్ధికి అవకాశాలను కూడా విస్తరిస్తున్నాయన్నారు. రోజువారీ వస్తువులు చౌకగా మారినప్పుడు, డిమాండ్ పెరుగుతుందని, ఇది ఉత్పత్తి , సరఫరా గొలుసులను వేగవంతం చేస్తుందని అన్నారు. ఫ్యాక్టరీ ఉత్పత్తి పెరగడం వల్ల కొత్త ఉద్యోగాలసృష్టిజరుగుతుందని, జిఎస్‌టి బచత్ ఉత్సవ్ కూడా ఉపాధి పండుగగా మారుతోందని ఆయన అన్నారు.

## ఇద్దరు అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులు అరెస్టు

**న్యూఢిల్లీ:** దీపావళి రోజున దక్షిణ ఢిల్లీలోని ఒక మాల్, పబ్లిక్ పార్క్‌తో సహా దేశ రాజధానిలోని జనసమ్మర్ద ప్రాంతంలోఉగ్రవాద దాడికి ప్రణాళిక వేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు శుక్రవారం ఒక అధికారి తెలిపారు. అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులు ఇద్దరిలోఢిల్లీలోని సాదిక్ నగర్‌కు చెందిన అద్నాన్, మరొకరు భోపాల్‌కు చెందినవారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ అరెస్టులు ఢిల్లీలో జరిగే ఉగ్రవాద దాడిని నివారించాయని ఆయన అన్నారు. ఐసిస్‌కు 'విధేయత ప్రమాణం' చేస్తున్న వీడియో, ఢిల్లీలో పేలుడుకు వారు ప్లాన్ చేస్తున్న ప్రదేశాల ఫోటోలతో సహా పోలీసులు వారి వద్ద నుండి నేరారోపణ సామగ్రినిస్వాధీనంచేసుకున్నారు. ఐఇడి కోసం టైమర్ తయారుచేయడానికి వారు ఉపయోగిస్తున్న గడియారం, ఐఇడి తయారీకి అవసరమైన సామగ్రిని సేకరించడానికి వెళ్తున్న ప్రదేశాల ఫోటోలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అదనపు పోలీసు కమిషనర్ (స్పెషల్ సెల్) ప్రమోద్ కుష్వాహా విలేకరుల సమావేశంలో తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని ఒక మాల్, పబ్లిక్ పార్క్‌లలో దాడులకు ప్రణాళికలు వేస్తున్న ఢిల్లీలోని ప్రదేశాలను వారు పరిశీలించారనిచెప్పారు. మొదట, అక్టోబర్ 16న సాదిక్ నగర్ నుండి ఒక కార్యకర్తను అరెస్టు చేశారు. తరువాత మరొకరిని భోపాల్ నుండి అరెస్టు చేశారు. జ్ఞాన్‌వాపి మసీదు సర్వే చేస్తున్నందుకు సోషల్ మీడియాలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ)అధికారిని బెదిరించారనే ఆరోపణలతో భోపాల్ నివాసిఅద్నాన్‌నుఉత్తరప్రదేశ్‌పోలీసులుఅరెస్టు చేశారు.


**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**

( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )

Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,

E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.

**B.CATEGORY NOTIFICATION: PGECET-2025**

| S.No. | M.Pharmacy | Intake | B-Category Seats |
|---|---|---|---|
| 1 | Pharmaceutics | 12 | 4 |
| 2 | Pharmaceutical Analysis | 12 | 4 |

Applications are invited under B category for the above mentioned courses for the academic year 2025-2026. Interested and eligible candidates may submit applications along with the copies of certificates in the college or submit online. Admissions Criteria will be as per the guidelines of TGCHE_Hyderabad

Sd/- Principal

**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**

( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )

Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,

E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.

**SPOT ADMISSIONS**

* Spot Admissions will be made on 27/10/2025 & 28/10/2025 in College Premises.
* Interested Candidates can Report before 5.00 PM along with the original Certificates
* Tuition Fee in form of DD/Challan.
* Admissions will be made as per guidelines issued by the TGEAPCET-2025

Sd/- Principal

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS08UB1238 | Pasunuti Srivani | Bharat Benz 1214R FBT | 2014 |
| 2 | AP24AB2696 | Venkatesh Ambala | John Deere 5310 Harvester | 2008 |
| 3 | AP20AR1699 | Sripathi Komala | Indica Vista VX Tech BS4 Diesel 5Seat | 2012 |
| 4 | AP16ER-1360 | Srikanth Bonagiri | John Deere 5310 Harvester | 2017 |
| 5 | TS02UC7427 | Gadikota Vishvanath | AL E Comet 1012 FBT | 2011 |

**AUCTION DATE: 25-10-2025**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 7702785091


## ఒత్తిడిలో నిర్ణయాలు తీసుకోం
### భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



**బెర్లిన్:** ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడికి గురై లేదా తొందరపడి నిర్ణయాలు తీసుకోబోమని భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జరిగిన 'బెర్లిన్ డైలాగ్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, యూరోపియన్ యూనియన్ (ఇయు), అమెరికా వంటి దేశాలు, ప్రాంతాలతో భారత్ సక్రియంగా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నదని తెలిపారు. ఇయుతో చర్చలు జరుపుతున్నామని, అమెరికాతోనూ సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. అయితే, గడువుల కోసం ఒప్పందాలు చేసుకునే ప్రసక్తి లేదని అన్నారు. ఒక వాణిజ్య ఒప్పందాన్ని తక్షణ లాభాల దృష్టితో కాకుండా, దీర్ఘకాల దృష్టితో చూడాలని వ్యాఖ్యానించారు. అమెరికా భారీ సుంకాలు విధించిన ఉత్పత్తులపై సమ్యలు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. అందుకే, కొత్త మార్కెట్లను భారత్ అన్వేషిస్తున్నదని తెలిపారు. భారత్ కూడా అమెరికాపై అదే తీరులో స్పందిస్తుందా? అనే ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం చెప్పలేదు. అయితే, జాతీయ ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో ఉంచుకొని స్నేహితుల ఎంపిక జరుగుతుందే తప్ప, ఇతరత్రా అంశాలపై ఆధారపడి జరగదని అన్నారు. ఏ దేశం నుంచి ఏఏ ఉత్పత్తులు కొనాలన్న నిర్ణయం ప్రపంచ దేశాలన్నీ సమన్వయంగా చర్చించి తీసుకోవాల్సిన నిర్ణయంగా గోయల్ అభిప్రాయపడ్డారు. రష్యా నుండి ముడి చమురు కొనుగోళ్లు ఆపాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో, గోయల్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


**BEFORE THE HONBLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 326 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

...Disputant

VERSUS

**M.KUMARASWAMY & OTHER**

......Opponents

3. Mekala Srinivas S/O Odaiah Aged About 47 Years Occ: Business. R/O. H.No.1- 39,Ramachandrapur, Huzurabad.
4. Kusuma Suryakiran S/O Sarweshwar Aged About 49 Years Occ: Business. R/O. H.No. 5- 2-10-900, SBH Colony, Waddepally, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 322 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

.....Disputant

VERSUS

**B.SRILAXMI & OTHERS** .....Opponents

1. Bikkasani Srilaxmi W/O Satyanarayana Aged About 57 Years Occ:House Wife. R/O. H.No.2-55, Nellipaka, Bazara, Ashwapuram, Khammam.
2. Bikkasani Satyanarayana S/O Ramaiah Aged About 64 Years Occ:Agriculture . R/o. H.No. 2-55, Nellipaka, Bazara, Ashwapuram, Khammam.
3. Sreekumrmam Ajaykumar S/O Rammohan Rao Aged About 54 Years Occ: Foreman /Ap Genco-Vijayawada. R/O. H.No. 23-98,Ibrahimpatnam, Krishna Dist.
4. Mohammad Rasheed S/O Wahead Aged About 44 Years Occ:Jr.Plant Attendent /Ap Genco-Vijayawada R/O.H.No.G-161, BI colony, Kondapalli, Krishna Dist.
5. Yadana Durgaprasad S/O Venkata Krishna Rao Aged About 38 Years Occ: Security Asst/ Intelligence-Hyd. R/O. H.No.1-103, Nellipaka, Bazara, Ashwapuram, Khammam.
6. Bikkasani Vamshi Krishna S/O Satyanarayana Aged About 38 Years Occ:Business. R/O. H.No.2-55, Nellipaka, Bazara, Ashwapuram, Khammam.
7. Duggineni Ramanaiah S/O Venkataswamy Aged About 51 Years Occ: Business. R/O H.No.1-68/1,Govindarao pet, Dumpaligudem, Waranagal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 323 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

.....Disputant

VERSUS

**M.VIJAYALAXMI & OTHERS**

......Opponents

1. Muppidi Vijayalaxmi D/O M.Janardhan Aged About 40 Years Occ:Pvt Techear. R/O. H.No.25-8-196, Bapujinagar, Kazipet, Hanamkonda.
2. Panja Rajkumar S/O Laxminarsaiah Aged About 49 Years Occ:Line Inspector TSNPDCL/KZPT R/O. H.No.25-8-196,Bapujinagar, Kazipet, Hanamkonda.
4. Praveen Sulthana W/O Manzoor Ahmed Aged About 45 Years Occ:Tech-I/SCR/KZPT .R/O. Q.No. 295/3,Type-II, Rly Qters, Shanthinagar, Kazipet, Haanmkonda.
5. Mohammed Raheemuddin S/O Chotemiya Ahmed Aged About 42 Years Occ: Jr. Lineman/TSNPDCL/KZPT. R/O. 24-5-254, Afzalnagar, Darga, Kazipet.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HONBLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 324 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

....Disputant

VERSUS

**P.KANKAMALLA REDDY & OTHERS**

....Opponents

3. Pendli Gopi S/O Kanaka Malla Reddy Aged About 43 Years Occ: Civil Contractor. R/O. H.No. 1-8-109/2/1, Balasamudram. Hanamkonda.
4. Billa Ram Reddy S/O Kantha Reddy Aged About 69 Years Occ: Civil Contractor R/O. H.No. 1-7-237,Revunue Colony, Subedari, Hanmkonda.
5. Mandala Venkata Ramana Reddy S/O Thirupathi Reddy Aged About 46 Years Occ:Business. R/O. H.No. 6-58, Singarakuntapally, Venkatpur, Narsapuram, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS05UC8739 | Morri Jevvetha | TATA LPT 3118 CUMMINS FBT | 2018 |
| 2 | TS05UB3789 | MORRI NAGARAJU | TATA LPT 3118 CUMMINS FBT | 2015 |
| 3 | TS25D9279 | Shravan Kumar Chetti | TRIBER RXL PETROL 7 SEATER | 2020 |
| 4 | TS08UE1147 | Sravanthi Buggarapu | AL 3718 IL FBT | 2017 |
| 5 | TS08UF3996 | SUMAN MUSHKA M | LPT3718 | 2018 |
| 6 | TS08UD0626 | Vinod Kumar Aarepelli | TATA Zest | 2016 |
| 7 | TS27T7014 | Penugonda Padma | TATA ZEST DIESEL-P | 2018 |
| 8 | TS16EL3813 | LINGAMALLU BOSE | ZEST 1.3L XMS QUADRAJET 90PS DIESEL 5 SEATER | 2017 |
| 9 | TG251396 | KANNURI RAVI | MAHINDRA YUVO 575DI | 2020 |
| 10 | AP36TA-9733 | Shreesha Thadicherla | TATA ACE | 2012 |
| 11 | TS25T-3269 | Cholleti Malathi | AL 3718 IL FBT-T | 2018 |

**AUCTION DATE : 25-10-2025**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

1st Floor, H No 6-159, Above DCC Bank. Reddy Colony, Jayashankar Bhupalpally. Cell :9849981545, 9949340057

ప్రజాపక్షం
శనివారం, 25 అక్టోబరు

# బిహార్ ఎన్నికల రణక్షేత్రం

బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల క్షేత్రం రెండు ప్రధాన కూటముల మోహరింపుతో రణక్షేత్రాన్ని తలపిస్తున్నది. ఈ ఎన్నికలు బిహార్‌కేగాక యావత్ దేశానికి ప్రాముఖ్యత గలవి. జెడియు నేత నితీశ్‌కుమార్ ప్రధాన భాగస్వామిగా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ–20 ఏళ్ల పాలనపట్ల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేక భావన (Anti–incumbancy)ను అధిగమించి అధికారం నిలుపుకోవటం ఒక సవాలు. నితీశ్‌కుమార్ వయస్సు, ఆరోగ్యం దృష్ట్యా – ఎన్‌డిఏ కూటమిలో పెద్దపార్టీగా ఆవిర్భవించి సాధ్యమైతే ప్రభుత్వ నాయకత్వాన్ని సొంతం చేసుకోవటం బిజెపి వ్యూహంగా ఉంది. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్‌షా మాటలు శిలాక్షరా లు. ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారు అన్నారేగాని నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించలేదు. నితీశ్‌కుమార్ నాయకత్వంలో ఎన్‌డిఏ ఎన్నికల్లో పోటీ చేస్తున్నదని మాత్రమే చెప్పారు. పార్టీ గత రెండు మాసాలుగా అంతా నరేంద్రమోదీ మయంగా ఎన్నికల ముందస్తు ప్రచారం సాగిస్తోంది. ఈ శుక్రవారం ప్రధాని మోదీ సమస్తిపూర్ నుంచి అధికారికంగా ఎన్‌డిఏ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

ఈ కూటమిని సవాలు చేస్తున్న ప్రధాన ప్రత్యర్థి ఆర్‌జెడి నాయకత్వంలోని మహాగట్బంధన్. ఇది బిహార్‌లో ఇండి అలయెన్స్ రూపాంతరం. 2020 ఎన్నికల్లో కొద్దిపాటి సీట్ల తేడాతో అధికారానికి దూరమైన మహాగట్బంధన్ ఈసారి మరింత పకడ్బందీగా పోటీకి దిగింది. ఆర్‌జెడి, కాంగ్రెస్‌లతోపాటు మూడు వామపక్ష పార్టీలు – సిపిఐ(ఎంఎల్), సిపిఐ, సిపిఐ(ఎం), అత్యంత వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం వహించే వికాస్ శీల్ ఇన్‌సాన్ పార్టీ (ముకేశ్ సహాని దాని అధ్యక్షుడు), ఐఐపి ఈ కూటమి భాగస్వాములు. భారత ఎన్నికల కమిషన్ బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఐదారు మాసాలముందు ఓటర్ల జాబితాలు ప్రక్షాళన ప్రారంభించటంపై దాని ఉద్దేశాలను ఎండగడుతూ మహాగట్బంధన్, ముఖ్యంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. మరోవైపున ప్రజాసంస్థలు, కొన్ని రాజకీయ పక్షాలు సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయటం తెలిసిందే. ఈ పోరాటంలో ప్రతిపక్షాలు పూర్తిగా కాకపోయినా పాక్షికంగా విజయం సాధించా యి. బడుగు బలహీన వర్గాలు, షెడ్యూల్డు కులాలు, తెగలు, ముస్లింల ఓట్లను ఏరివేయటం ఎస్ఐఆర్ లక్ష్యంగా ప్రతిపక్షాలు ప్రచారం చేశాయి. ఈ ఆందోళన ఫలితం పోలింగ్‌లో ప్రతిఫలిస్తే అది ఎస్ఐఆర్ ప్రారంభం కానున్న ఇతర రాష్ట్రాలకు ఆదర్శమవుతుంది. 'ఓట్ చోరీ'పై రాహుల్‌గాంధి సాగిస్తున్న పోరాటం ఎన్నికల సంఘాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. బిజెపి వ్యూహాత్మకంగా ఓటర్ల జాబితాల్లో అవకతవకలకు పాల్పడుతోందని, ఎన్నికల సంఘం అధికారులు అందుకు తోడ్పడుతున్నారన్నది రాహుల్ సాక్ష్యాధారాలతో చేస్తున్న పోరాటం. ఇది ఎన్నికల కమిషన్‌తోపాటు బిజెపిని ముగ్గులో నిలబెడుతున్నది. అందువల్ల సాధారణ ఎన్నికల క్షేత్రం రణక్షేత్రం కానుంది. ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా, విఐపి పార్టీ అధ్యక్షుడు ముఖేశ్ సహానీ ఉపముఖ్యమంత్రి అభ్యర్థిగా మహాగట్బంధన్ ఎన్నికల సమరం సాగిస్తున్నది.

ఎన్నికల వ్యూహకర్తగా నరేంద్రమోదీ మొదలు జగన్‌మోహన్‌రెడ్డి వరకు ఎందరికో సేవలందించిన ప్రశాంత్ కిశోర్ నెలకొల్పిన జన సురాజ్ పార్టీ తొలిసారి ఎన్నికల క్షేత్రంలో దిగింది. అందువల్ల కనీసం ఓ వంద సీట్లలో త్రిముఖ పోటీలుండవచ్చు. అయితే ఈ పార్టీ ఏ కూటమి ఓట్లు రాబట్టుకుంటుందోనని ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. ఆప్, బిఎస్‌పి సహా మరో అరడజను పార్టీలు రంగంలో ఉన్నాయి. అయితే పరిశేష బిహార్ రాజకీయ చరిత్రను చూస్తే, 2000 నవంబర్‌లో బిహార్‌నుండి జార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటు చేశాక 2005లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో రెండు కూటములకు కలిపి పోలైన ఓట్లలో 53 శాతం లభించాయి. అప్పటినుంచి అన్ని ఎన్నికల్లోను దాదాపు మూడింట రెండు వంతుల ఓట్లను ఈ రెండు కూటములే పంచుకుంటున్నాయి. అందువల్ల ఈ పర్యాయం కూడా ఆ ధోరణి నుంచి బిహార్ ఓటర్లు బయటపడకపోవచ్చు.

ఎన్‌డిఏ కూటమి మొత్తం 243సీట్లను తమ భాగస్వాములమధ్య పంచుకుని సంపూర్ణ ఐక్యతతో ఎన్నికల క్షేత్రంలో దిగిందన్న భావన కల్పించింది. బిజెపి, జెడి(యు)లు చెరో 101 సీట్లు పంచుకుని లోక్‌జనశక్తి(ఆర్‌వి)కి 29, హిందూస్థానీ ఆవామీమోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలకు చెరి ఆరు సీట్లు కేటాయించాయి. మధుర సీటులో ఎల్‌జెపి అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావటంతో ఆ పార్టీ నికరంగా 28సీట్లకు పోటీ చేస్తున్నది. కాగా మహాగట్బంధన్ భాగస్వాములు ఆర్‌జెడి 143, కాంగ్రెస్ 60, సిపిఐ(ఎంఎల్) 20, విఐపి 14, సిపిఐ 9, సిపిఐ(ఎం)4 సీట్ల కు పోటీచేస్తున్నాయి. కాగా 5 సీట్లలో కాంగ్రెస్, ఆర్‌జెడి మధ్య, మూడు సీట్లలో కాంగ్రెస్ సిపిఐ మధ్య స్నేహపూర్వక పోటీలున్నాయి. సుగాలి సీటులో విఐపి అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైనందున మహాగట్బంధన్ కూడా 242 సీట్లలోనే పోటీ చేస్తున్నది. స్నేహపూర్వక పోటీ సీట్లపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. నవంబర్ 6, 11తేదీల్లో పోలింగ్.14 న ఓట్ల లెక్కింపు. ''చలో బిహార్– బదలే బిహార్'' మహాగట్బంధన్ శంఖారావం. బిహార్ ఓటర్లు మార్పును ఎంచుకుంటారని ఆశించుదాం.

# జన్యు వనరులపై ఐరాస ఒప్పంద సమావేశంలో గట్టి వైఖరి

## కేంద్ర వ్యవసాయ మంత్రికి శాస్త్రవేత్తల విజ్ఞప్తి

ప్రముఖ భారతీయ శాస్త్రవేత్తల సమూహం ''సైంటిస్ట్స్ ఫర్ జెనెటిక్ డైవర్సిటీ (SGD)'' ఆధ్వర్యంలో, కేంద్ర వ్యవసాయ&రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు న్యూఢిల్లీ, అక్టోబర్ 22, 2025న అత్యవసర విజ్ఞప్తి చేశారు. పెరూలో జరగనున్నఅంతర్జాతీయ వృక్ష జన్యు వనరుల ఆహార మరియు వ్యవసాయ ఒప్పందం (ITPGRFA)యొక్క11వ పాలకమండలి సమావేశం (GB11)లో వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జన్యు వనరుల వినియోగం మరియు ప్రయోజనాల భాగస్వామ్యం (ABS) పై చర్చలలో నెలకొన్న కీలక ప్రతిష్టంభనను శాస్త్రవేత్తలు హైలైట్ చేశారు.

ప్రస్తుత స్వచ్ఛంద వ్యవస్థ, గ్లోబల్ సౌత్‌లోని జీవవైవిధ్య సంపన్న దేశాల నుండి తీసుకున్న జన్యు వనరుల వాణిజ్య విలువ బిలియన్ల డాలర్లు ఉన్నా, ఆయా దేశాలకు తగిన పరిహారాన్ని అందించడంలో విఫలమైందని వారు ఉద్ఘాటించారు.

**GB-11 కోసం కీలక డిమాండ్లు:**

**1.తప్పనిసరి ప్రయోజనాల భాగస్వామ్యం:** విఫలమైన స్వచ్ఛంద విరాళాల నమూనా స్థానంలో, Annex I పంటలను ఉపయోగించే కంపెనీల వాణిజ్య టర్నోవర్‌తో నేరుగా అనుసంధానించబడిన తప్పనిసరి మైలురాయి సబ్‌స్క్రిప్షన్ వ్యవస్థకోసం భారతదేశం గట్టిగా డిమాండ్ చేయాలి.

**2.DSI పై సార్వభౌమ హక్కులు:**భౌతిక జన్యు వనరులకు 'డిజిటల్ ప్రాక్సీ' అయిన డిజిటల్ సీక్వెన్స్ సమాచారం (DSI)పై కూడా భారతదేశపు సార్వభౌమ హక్కులు వర్తించాలని శాస్త్రవేత్తలు పట్టుబట్టారు. DSI వినియోగానికి తప్పనిసరి ప్రయోజనాల భాగస్వామ్యం వర్తించాలి.

**3.వ్యూహాత్మక అస్త్రం:**Annex I విస్తరణను తిరస్కరించడానికి మరియు తప్పనిసరి బహుళపక్ష వ్యవస్థ (MLS) వృద్ధి ప్యాకేజీని సురక్షితం చేసే వరకు DSI పై ఎలాంటి ఒప్పందాన్ని నిలిపివేయడానికి గ్లోబల్ సౌత్‌ను సమీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయం మరియు జాతీయ ప్రయోజనాల రక్షణ కోసం ఇది అత్యంత శక్తివంతమైన దౌత్య సాధనంగా పరిగణించబడుతోంది.

**భారతదేశం ప్రపంచ ప్రమాణంగా:**

భారతదేశం పంట వైవిధ్యానికి ప్రధాన కేంద్రంగా ఉండటంతో పాటు, వృక్ష రకాలు మరియు రైతుల హక్కుల పరిరక్షణ చట్టం (PPV&FR చట్టం, 2001)వంటి మార్గదర్శక చట్టాన్ని రూపొందించింది. రైతుల హక్కులను పరిరక్షించే ఈ చారిత్రక చట్టాన్ని, జన్యు వనరుల సమాన పాలన కోసం ప్రపంచ ప్రమాణంగా ఉపయోగించుకోవాలని విజ్ఞప్తిలో నొక్కి చెప్పారు.

న్యాయమైన మరియు తప్పనిసరి ప్రయోజనాల భాగస్వామ్య వ్యవస్థను సురక్షితం చేయడం భారతీయ రైతాంగ సంక్షేమాన్ని పరిరక్షించడానికి మరియు దేశం యొక్క కీలక జన్యు సంపదపై సార్వభౌమ నియంత్రణను నొక్కి చెప్పడానికి ప్రాథమికమని శాస్త్రవేత్తలు ముగించారు.

అంతర్జాతీయ వృక్ష జన్యు వనరుల ఆహార మరియు వ్యవసాయ ఒప్పందం (ITPGRFA) యొక్క 11వ పాలకమండలి సమావేశం (GB11) నవంబర్ 2025లో పెరూలో జరగనుంది. ఈ సందర్భంగా కీలక చర్చల గురించి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వ్యవసాయ శాస్త్రవేత్తలు రాసిన లేఖాంశాలను ఇక్కడ ఇస్తున్నాం – సం॥.

అభివృద్ధి చెందిన దేశాల మొండి వైఖరి, జన్యు వనరుల వినియోగం మరియు ప్రయోజనాల భాగస్వామ్యం (ABS) విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో, భారతదేశం తన రైతుల సార్వభౌమ హక్కుల కోసం మరియు జన్యు సంపద పరిరక్షణ కోసం గట్టిగా నిలబడాల్సిన అవసరం ఉంది.

**చర్చలలో పరిష్కరించాల్సిన ముఖ్యమైన సమస్యలు:**

* జన్యు సంపద యొక్క పరిహారం లేని బదిలీకి పూర్తి నష్టపరిహారం, సాంకేతికత బదిలీ మరియు వ్యవసాయ జీవవైవిధ్యం యొక్క సుస్థిర వినియోగానికి కట్టుబాటుతో సహా, గ్లోబల్ సౌత్ దేశాలకు అనుకూలమైన బలమైన ప్రయోజనాల భాగస్వామ్య ఏర్పాటును సురక్షితం చేయడం.
* జన్యు పదార్థాల మార్పిడి మరియు మెరుగైన జన్యు పదార్థం మరియు జ్ఞానాన్ని తిరిగి ఇవ్వడం వంటి బహుళపక్ష వ్యవస్థ (MLS) కార్యకలాపాల పారదర్శకత మరియు జవాబుదారీతనం.

ప్రభుత్వం ఒత్తిడి చేయాలని మేము గుర్తించిన సమస్యలు పరిష్కారం కాకుండా పోతే, సాంకేతికంగా సంపన్నమైన గ్లోబల్ నార్త్ దేశాలు, ఆర్థిక నష్టపరిహారం, సాంకేతికత బదిలీ వంటి ప్రయోజనాలను అందించకుండానే గ్లోబల్ సౌత్ యొక్క జన్యు సంపదను సొంతం చేసుకొని, మేధో సంపత్తి (IP) హక్కులను క్లెయిమ్ చేసే ప్రమాదం ఉంది. ప్రధాన ఆందోళనలోని ముఖ్య అంశాలు:

* **పరిష్కరించబడని రుణభారం:**బహుళపక్ష వ్యవస్థ (MLS) కింద సుమారు ఏడు మిలియన్ల జన్యు వనరులు బదిలీ చేయబడ్డాయి. గ్లోబల్ సౌత్ నుండి ఉద్భవించిన ఈ వనరులు ప్రపంచ విత్తన మరియు బయోటెక్ పరిశ్రమలకు బిలియన్ల డాలర్ల వాణిజ్య విలువను అందించాయి. అయినప్పటికీ, ఈ అపారమైన సహకారానికి సంబంధించిన చెల్లింపు చాలా తక్కువగా ఉంది.
* **స్వచ్ఛంద విధానం వైఫల్యం:**ద్రవ్య ప్రయోజనాలను స్వచ్ఛందంగా పంచుకునే ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. అందువల్ల, స్వచ్ఛంద విరాళాలపై ఆధారపడిన ఈ ఒప్పందం యొక్క ఆర్థిక విధానం అస్థిరమైనది, అన్యాయమైనది అని స్పష్టంగా తెలుస్తోంది.

**పారదర్శకత మరియు జవాబుదారీతనం లోటు**

స్వచ్ఛంద విధానం వైఫల్యంతో పాటు, ఒప్పందం అమలులో ఉన్న లోపాలు ప్రయోజనకర్త దేశాలకు నిరంతరం అన్యాయం చేస్తున్నాయి:

* **నిరుపయోగమైన ప్రయోజనాల భాగస్వామ్యం:** బెనిఫిట్ షేరింగ్ ఫండ్(BSF)లో జమ అయిన ద్రవ్య చెల్లింపులు చాలా తక్కువగా ఉన్నాయి, మరియు ఈ నిధులను ప్రొవైడర్ కమ్యూనిటీలకు నేరుగా పంచుకోవడానికి ప్రస్తుత వ్యవస్థలో స్పష్టమైన నిబంధన లేదు.
* పారదర్శకత వైఫల్యం:సెక్రటేరియట్ ద్వారా MLS అమలులో పారదర్శకత లోపం ఉంది, ముఖ్యంగా ప్రామాణిక మెటీరియల్ ట్రాన్స్‌ఫర్ ఒప్పందాలపై (SMTAలు) సమాచారాన్ని పాలక మండలికి నివేదించడంలో లేదా ప్రజల పరిశీలన కోసం ప్రచురించడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది.
* **బలహీనమైన సంస్థాగత నిబద్ధత:**మూడవ పక్షం లబ్ధిదారుడు/ఒప్పంద సెక్రటేరియట్ మరియు PGRFA స్వీకర్త మధ్య ఎటువంటి నిర్బంధ, ఆవర్తన సంభాషణ లేకపోవడం జవాబుదారీతనాన్ని తగ్గిస్తుంది.

**భారతదేశపు బలం–– ప్రపంచ న్యాయ ప్రమాణం**

భారతదేశం పంట జన్యు వైవిధ్యానికి ప్రధాన కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

* మనవృక్ష రకాలు మరియు రైతుల హక్కుల పరిరక్షణ చట్టం (PPV&FR చట్టం, 2001)ప్రపంచంలోనే ప్రత్యేకమైనది. ఇది విత్తనాలపై రైతులకు ప్రత్యేక చట్టపరమైన హక్కులను మంజూరు చేస్తుంది.
* జన్యు వనరుల సమాన పాలనకు PPV&FR చట్టాన్ని ప్రపంచ ప్రమాణంగా ప్రదర్శించడానికి భారతదేశం ఈ దేశీయ విజయాన్ని ఉపయోగించుకోవాలి.

ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే, సాంకేతికంగా సంపన్నమైన గ్లోబల్ నార్త్ దేశాలు గ్లోబల్ సౌత్ యొక్క జన్యు వనరులను స్వాధీనం చేసుకొని, మేధో సంపత్తి (IP) సాధనాల ద్వారా వాటిపై యాజమాన్యాన్ని క్లెయిమ్ చేస్తాయి.

ఈ నేపథ్యంలో, గ్లోబల్ సౌత్‌ను సమీకరించి, ఈ క్రింది బలమైన ఏర్పాట్లను సాధించాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము:

**1.తప్పనిసరి (చట్టబద్ధమైన) ప్రయోజనాల భాగస్వామ్య వ్యవస్థ**

* Annex I పంటలను ఉపయోగించే కంపెనీల వాణిజ్య టర్నోవర్‌తో నేరుగా అనుసంధానించబడిన ద్రవ్య మరియు ద్రవ్యేతర ప్రయోజనాలను కలిగి ఉన్న తప్పనిసరి మైలురాయి సబ్‌స్క్రిప్షన్ వ్యవస్థకోసం పిలుపునివ్వడంలో నాయకత్వం వహించండి.
* MLS ద్వారా పొందిన PGRFA వినియోగం నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉత్పన్నమయ్యే వాణిజ్య ఉత్పత్తులపై ఎలాంటి IP హక్కులపైనా నిషేధం విధించేలా చూడండి.

**2. డిజిటల్ సీక్వెన్స్ సమాచారం (డ్రSI)పై సార్వభౌమ హక్కులు**

* గ్లోబల్ సౌత్‌లోని మన దేశాల సార్వభౌమ హక్కులు భౌతిక రూపంలో ఉన్న జన్యు పదార్థానికి లేదా డిజిటల్ సీక్వెన్స్ సమాచారం (DSI)రూపంలో ఉన్న దానికీ సమానంగా వర్తించాలి.
* DSI అనేది సార్వభౌమ భౌతిక వనరులకు 'డిజిటల్ ప్రాక్సీ' అని స్పష్టం చేస్తూ, దాని వినియోగానికి తప్పనిసరి ప్రయోజనాల భాగస్వామ్యంవర్తించాలని భారతదేశం గట్టిగా నిలబడాలి.

**3. వ్యూహాత్మక తిరస్కరణ**

* Annex I విస్తరణను తిరస్కరించడానికి గ్లోబల్ సౌత్‌ను సమీకరించండి.
* MLS వృద్ధి ప్యాకేజీని తప్పనిసరిగా సురక్షితం చేసే వరకు DSI పై ఎలాంటి ఒప్పందాన్ని ఆమోదించకుండా నిలిపివేయండి. ఈ వ్యూహాత్మక తిరస్కరణ న్యాయాన్ని నిర్ధారించడానికి, మన జాతీయ ప్రయోజనాలను కాపాడటానికి అత్యంత శక్తివంతమైన దౌత్య సాధ నం.

న్యాయమైన, తప్పనిసరి ప్రయోజనాల భాగస్వామ్య వ్యవస్థను సురక్షితం చేయడం మన రైతుల సంక్షేమాన్ని పరిరక్షించడానికి మరియు మన జన్యు వనరులపై భారతదేశ సార్వభౌమ నియంత్రణను నొక్కి చెప్పడానికి ప్రాథమికమని మేము విశ్వసిస్తున్నాము.

భవదీయులు,

సైంటిస్ట్స్ ఫర్ జెనెటిక్ డైవర్సిటీ

డా. సుమన్ సహాయ్
చైర్ పర్సన్, జీన్ కాంపేన్

డా. శరత్ బాబు బలిజేపల్లి
ప్రెసిడెంట్, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా &ఎక్స్‌ప్రిన్సిపల్ సైంటిస్టు, ఐసిఎఆర్–ఎన్‌బిపిజిఆర్

డా. దినేష్ అబ్రోల్
సమన్వయ కర్త, నేషనల్ కిసాన్ కమిషన్

డా. సోమ మర్ల
ఎక్స్ ప్రిన్సిపల్ సైంటిస్టు, ఐసిఎఆర్–ఎన్‌బిపిజిఆర్

# లొంగుబాట్లు – ఎన్‌కౌంటర్లు – ఉద్యమ భవితవ్యం ?

దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, ఆకలి కేకలు, మతోన్మాదం తదితర విషయాలతో పాటు మావోయిస్టు పార్టీ భవితవ్యం పైన తీవ్ర చర్చ సాగుతున్నది. మావోయిస్టు పార్టీ భవితవ్యానికి సంబంధించి అటు కేంద్ర ప్రభుత్వంలోనూ ఇటు మావోయిస్టు వ్యతిరేకులు, అనుకూలురలోనూ ఉద్యమ భవితవ్యం ఏమిటన్న ప్రశ్న మదిలో మెదులుతున్నది. 2026 మార్చి ఆఖరు నాటికి ఈ దేశంలో వామపక్ష తీవ్రవాదం ఉండదని శపథం చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఒక వైపు, 13 రాష్ట్రాల్లో ఉద్యమాన్ని నడిపి కొన్ని ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు ఉద్యమం మరో వైపు నిలబడింది. గత రెండేళ్లుగా ఆపరేషన్ కగార్ మావోయిస్టులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. రెండు దశాబ్దాల కాలంలో ఎన్నడు జరగని ఎన్‌కౌంటర్లు జరిగాయి. గతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఎక్కువ శాతం దళ సభ్యులే ఉండేవారు. కానీ మావోయిస్టుల్లో పెరిగిన కోవర్టులతో ఏడాదిగా దళ సభ్యులు కాకుండా నేతలే పోలీస్ తుపాకీ గుండ్లకు బలవుతున్నారు. ఇందులో దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగి పార్టీని నడిపించడంతో పాటు వెన్నుముఖగా నిలిచిన అనేక మంది హతమయ్యారు. ఇక లొంగుబాట్ల విషయానికి వస్తే దళంలో సాధారణ సభ్యులుగా ఉండి పోలీస్ ఎరకు బలై తుపాకులతో సహా లొంగిపోవడమో లేకుంటే ఆయుధాలు లేకుండా లొంగిపోవడమో జరుగుతుండేది. కానీ ఇప్పుడు ఉద్యమ భవిష్యత్తుపై చర్చ ఎందుకు సాగుతుందంటే బలవుతున్న వారు కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యుడు దశాబ్దాల పాటు ఊరు వాడ వదిలి అడవుల్లో గిరిజన ప్రజల మధ్య జీవితాన్ని గడిపిన వారు. తమ మేధస్సును ఉపయోగించి ఈ రాజ్యంపై ఎదురు దాడి చేసిన వారు. ఉద్యమ ఆటుపోట్లను సైతం తట్టుకుని పార్టీని విస్తరించిన వారు. రెండవ పక్క పార్టీకి వెన్నెముకగా నిలిచి ఇప్పుడు పార్టీ పంథాయే తప్పు, పార్టీ ఆలోచన వైఖరి కారణంగానే వందల మంది బలవుతున్నారని చెబుతూ ఆయుధాలతో సహా లొంగిపోతున్నవారు. 1960 దశాబ్దపు చివరిలో ఏర్పడిన సాయుధ పోరాటం భారతదేశంలో అప్పటి పీపుల్స్ వార్ ఆ తర్వాత మావోయిస్టు పార్టీ పేరుతో బాగా విస్తరించింది. ఇప్పుడు ప్రజల్లో లేదా మావోయిస్టు అనుకూల వ్యతిరేక వర్గాల్లో నడుస్తున్న చర్చ ఉద్యమ భవిష్యత్తు ఏమిటన్నది. ఇక భారతదేశంలో అమిత్‌షా చెప్పినట్లుగా 2026 మార్చి తర్వాత ఈ దేశంలో వామపక్ష తీవ్రవాదం ఉండదా అన్న ప్రశ్నకు అంత తేలిక సమాధానం దొరకదు. సిపిఐ, సిపిఎం, ఇతర నక్సల్స్ గ్రూపులు లేదా వామపక్ష పార్టీలు మావోయిస్టు సాయుధ పోరాటానికి ఇది సరైన సమయం కాదని అందరం కలిసి ఈ దేశంలో ఒక బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. దీనికి ప్రస్తుత అవశేష మావోయిస్టు నాయకత్వం అంగీకరించకపోవచ్చు. అమిత్ షా మాటలు కేవలం రాజకీయ వాగ్దానం కాదనేది అందరికీ అవగతమవుతుంది. దశాబ్దకాలంగా భారతదేశాన్ని క్రమేపి కార్పొరేట్‌లపరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అటవీ సంపదపై కన్నేసింది. దానికి రక్షణగా నిలిచిన మావోయిస్టుల ఏరివేత మాత్రమే దండకారుణ్య ప్రకృతి సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు సహకరిస్తుంది తప్ప మరొకటి కాదన్న ఆలోచనతోనే అమిత్‌షా ఆ ప్రకటన విడుదల చేసి అందుకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టారు. మావోయిస్టు వ్యతిరేకులు కూడా ఈ సందర్భంగా అంగీకరించాల్సిన విషయం దండకారణ్యంపై మావోయిస్టుల పట్టు కారణంగానే కార్పొరేట్ లేదా ఇతర వ్యాపార సంస్థలు దండకారణ్యం వైపు చూడలేకపోయాయి.

ఇప్పుడు అన్నింటికి మించి ఒక కార్పొరేట్ సంస్థ మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను లొంగిపోయిన నాడు తాము మల్లోజుల వేణుగోపాల్‌ను నిధి నిక్షేపాలను వెలికి తీసేందుకు ఉద్యోగిగా నియమించుకుంటామని ప్రకటించడం మావోయిస్టు ఉద్యమ నిర్మూలన ప్రకటన వెనక ఉన్న ఆంతర్యాన్ని చెప్పకనే చెబుతుంది. ఇక భవిష్యం గురించి చెప్పాల్సి వస్తే అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు గుర్తించాల్సింది ఒకటి ఉన్నది అది రిక్రూట్‌మెంట్. రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్లు లేని ఏ సంస్థ, సంఘం, రాజకీయ పార్టీ మనజాలదు. మావోయిస్టు ఉద్యమం పెను సవాళ్లు ఎదుర్కొంటున్న వేళ ప్రధానమైంది ఆ మావోయిస్టు పార్టీలో చేరికలు లేకపోవడమే. ఒకప్పుడు 20 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన యువత సాయుధులై దండకారణ్యం వైపు పరుగులు పెట్టింది. ఇందులో మేధావి వర్గమే ఎక్కువ. అనేక విషయాలలో నైపుణ్యం కలిగి వైద్యులుగా, ఇంజనీర్లుగా, ఉపాధ్యాయులుగా, ఇతర రంగాలలో నిష్ణాతులైన వారు ఉద్యమం వైపు వెళ్లడమే కాకుండా అకుంఠిత దీక్షతో ఉద్యమంలో పని చేశారు. సామాజిక పరిస్థితులు, రాజ్యం వైఖరి, ప్రజల అవసరాలు గుర్తెరిగి పనిచేశారు. రెండు దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీ వైపు మేధావులు చూడటం లేదు. హైదరాబాద్‌లోనో లేదా మరెక్కడో మావోయిస్టు సానుకూల ప్రకటనలు ఇవ్వడంతోనే ఇప్పటి వామపక్ష అనుకూల మేధావులు సరిపెట్టుకుంటున్నారు తప్ప కార్యక్షేత్రంలోకి వెళ్లే ప్రయత్నం చేయడం లేదు. 60 నుంచి 70 ఏళ్లు పైబడిన వాళ్లే కేంద్ర నాయకత్వ స్థానాల్లో కొనసాగుతున్నారు తప్ప కొత్త నాయకత్వం ఆ స్థాయికి చేరుకోవడం లేదు. రెండవది తొలితరం ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారు పార్టీపై పెత్తనం సాగిస్తున్నారన్న అపవాదును మూటకట్టుకున్నారు. కొన్నేళ్లుగా కేవలం ఆదివాసీల పైనే ఆధారపడి ఉద్యమాన్ని నడుపుతున్నారు. ఒకప్పుడు ఆదివాసీ సహకారం ఎంతగా ఉండేదంటే మావోయిస్టుల రక్షణ కోసం తమ ప్రాణాలను తమ పిల్లల ప్రాణాలను ఫణంగా పెట్టేవారు. ఇప్పుడు మావోయిస్టులకు ఆ సహకారం అందడం లేదు. ప్రభుత్వ పరంగా వస్తున్న పథకాలు, ప్రకటనలు మావోయిస్టు ప్రభావిత ఆదివాసీలను సైతం ఆలోచింపజేస్తున్నాయి. దీనితో ఆదివాసీ యువత పోలీస్ వలలో చిక్కుకుని ఇన్ఫార్మర్లుగా మారిపోతున్నారు. ఇది ఉద్యమంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఒక పక్క రిక్రూట్‌మెంట్లు లేకపోవడం మరో పక్క ఉద్యమాన్ని ఎవరి హక్కుల కోసం, ఎవరి రక్షణ కోసం నిర్వహిస్తున్నారో వారి నుంచి సహకారం లేకపోవడం ఉద్యమం బలహీనపడటానికి కారణమైంది. ప్రజల్లో సానుకూల ఆలోచన లేకుండా దండకారణ్యం కానీ మరెక్కడైనా ఉద్యమాన్ని కొనసాగించడం తేలిక కాదు. ప్రస్తుతానికి మావోయిస్టు ఉద్యమం కొనసాగుతుందా లేదా అనే దానికంటే ప్రజల సహకారం లేక ప్రభుత్వ ఒత్తిడి పెరిగి ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్నది. ఇదే సమయంలో ఈ దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. రాజ్య హింస పెరుగుతున్నది. ప్రశ్నించే వారిని అణిచివేయాలన్న ధోరణి, ఎవరు ఏమైతే మనకు సంబంధించిన కార్పొరేట్ మిత్రులు బాగుంటే చాలన్న వైఖరి ఈ ప్రభుత్వంపైన వ్యతిరేకతను పెంచుతున్నది.

ఆకలి కేకలు ఇంకా 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో వినిపిస్తూనే ఉన్నాయి. కానీ ప్రజలు ప్రపంచీకరణ నేపథ్యంలో పోరాటాలకు సిద్ధంగా లేరు. పోరాటం అవసరమే కానీ అది మనం కాకుండా ఇతరులు చేస్తే బాగుండు అన్న ఆలోచన రోజురోజుకూ పెరుగుతున్నది. ఇప్పుడు సాయుధ పోరాటంలో ఉన్న వారు, పోరాట విరమణ చేసి బయటకు వచ్చిన వారు లేదా ఇతర విప్లవోద్యమ శక్తులు ప్రజలను సన్నద్ధం చేయాలి. ప్రజలను సన్నద్ధం చేయకుండా తాము మాత్రమే తుపాకులను పట్టుకుంటే సైన్యం లేని రాజు పరిస్థితిలా ఉంటుంది. ప్రజల ఆలోచన విధానంలో మార్పును, వారిలోని పోరాట సన్నద్ధత రాహిత్యాన్ని శాస్త్రీయం గా అంచనావేసి వారిని పోరాటోన్ముఖులను చేసేందుకు అవసరమైన, సరైన ఎత్తుగడలను రూపొందించి ఆచరించటంలోనే కమ్యూనిస్టు ఉద్యమ భవిత్యం ఆధారపడి ఉంటుంది. మావోయిస్టులు ఈ సత్యాన్ని గ్రహిస్తే దేశంలో వామపక్ష ఉద్యమం బలోపేతానికి దోహదం చేసిన వారవుతారు.

ఏనుగు వెంకటేశ్వరరావు
'ప్రజాపక్షం' ప్రతినిధి, ఖమ్మం

# ట్రంప్ నియంతృత్వ విధానాలపై పెరుగుతున్న నిరసన జ్వాలలు!



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

అమెరికాకు రెండవసారి అధ్యక్షులుగా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరించటం మొదలు పెట్టాడు. తానే సూపర్ పవర్‌గా.. అమెరికాయే ప్రపంచానికి సూపర్ దేశంగా అన్నట్లు అడ్డగోలు నిర్ణయాలతో ఇంటా బయట తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తున్న డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన 60 రోజుల్లోనే ఏకంగా 100 కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశాడు. ఆయన నిర్ణయాలన్నీ ప్రశ్నించేది లేదన్నట్లుగా అమెరికన్ ఆధిపత్యానికి అనుకూలంగా, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ప్రజా వ్యతిరేకతను ట్రంప్ అప్పుడే మూటగట్టుకుంటున్నాడు. బాధ్యత చేపట్టిన నెలలోనే అమెరికాలో వివిధ సంస్థలు జరిపిన సర్వేలో ట్రంప్ రేటింగ్ శరవేగంగా పడిపోయింది. 52 శాతం మంది ప్రజలు ట్రంప్ పని తీరు పట్ల పెదవి విరిచారు. 57 శాతం మహిళలు ట్రంప్ ప్రభుత్వంపై అసంతృప్తి వెలిబుచ్చారు. మరోవైపు ప్రధాన మీడియా సంస్థలు ట్రంప్ చర్యల పట్ల తీవ్రమైన విమర్శలు చేస్తున్నాయి. 'ది న్యూయార్క్ టైమ్స్', 'ది వాషింగ్టన్ పోస్ట్', 'వాల్ స్ట్రీట్ జర్నల్' ట్రంప్ పాలన విధానాలు అమెరికా అంతర్జాతీయ ప్రభావాన్ని తగ్గిస్తున్నాయని తేల్చి చెప్పాయి. ట్రంప్ దుందుడుకు దూకుడు విధ్వంసకర ఫాసిస్టు విధానాలు ప్రపంచ దేశాలపైనే కాక అమెరికాపైన తీవ్రంగా ఉండబోతున్నాయి.

గత పాలకులైన బైడెన్ హయాంలో ద్రవ్యోల్బణం కట్టుతప్పి జీవన వ్యయాన్ని పెంచడంతో సామాన్య ప్రజలు అల్లాడిపోయారు. ఆ దుస్థితిని తప్పిస్తానంటూ హామీ ఇస్తూ.. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా ప్రబల ఆర్థికశక్తిగా రూపొందిస్తానని ట్రంప్ ఎన్నికల్లో చెప్పడం శ్వేత జాతీయులకు వారి పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ వంటి ఆయన మద్దతుదారులను బాగా ఆకర్షించి ఎన్నికల్లో గెలవడానికి దోహపడ్డారు. ట్రంప్ అధికార పీఠాన్ని అధిష్టించిన తర్వాత 'తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అన్నట్లు వ్యవహరిస్తూ సగటు అమెరికన్లను మరింత ఇక్కట్లలోకి నెడుతున్నారు.

**టారిఫ్ వార్.. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం!**

ట్రంప్ టారిఫ్ వార్‌తో ప్రపంచంలో పరిస్థితులన్నీ అల్లకల్లోలంగా మారాయి. 'అమెరికా ఫస్ట్' నినాదంతో ట్రంప్ సృష్టించిన సుంకాల పెంపు వివాదం ప్రపంచ విపణి లో అమెరికా ఆధిపత్యాన్ని పెంచేందుకే నన్నది స్పష్టం. పర్యవసానంగా అమెరికాలో పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఫళంగా ఉద్యోగాలెన్నో ఊడిపోతున్నాయి. మరోవైపు షట్ డౌన్ మూలంగా లక్షల మందికి వేతనాలు నిలిచిపోయా యి. ఈ నేపథ్యంలో ఆహార విహారాలపై సామాన్యుల వ్యయం తగ్గిపోతుంది. రోజువారి బతుకు బండిని లాగడమే చాలామందికి కనాకష్టంగా మారుతుంది.

మరోవైపు ట్రంప్ పద్ధతులు ధనవంతులకు మరింత మేలు చేసేలా ఉంటున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మూడీస్ సంస్థ విశ్లేషణ ప్రకారం అమెరికన్ సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి. నాలుగున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా గరిష్ఠస్థాయికి చేరాయి. జన జీవితాలను బాగు చేయడంపై దృష్టి పెట్టని ట్రంప్ తన మూర్ఖ పాలనా ధోరణలతో ప్రజా వ్యతిరేకతను చేజేతులా కొని తెచ్చుకుంటున్నారు. తద్వారా అమెరికా కంపెనీల లాభాలు పెరుగుతాయన్న ట్రంప్ అనాలోచిత దుందుడుకు విధానాల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమయ్యే పరిస్థితిలో పడింది. గత మార్చి 10న అమెరికా స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. 4 లక్షల కోట్ల డాలర్ల విలువ సంపద ఆవిరైంది. దీనికి తోడు ఉద్యోగుల తొలగింపు, పొదుపు పేరుతో ప్రభుత్వ వ్యయానికి విధిస్తున్న పరిమితులు మార్కెట్‌ను కుంగదీస్తున్నాయి. ఇప్పటికే నిరుద్యోగంతో ఇబ్బంది పడుతున్న అమెరికన్ల కొనుగోలు శక్తి కూడా సన్నగిల్లుతున్నది. ద్రవ్యోల్బణం రోజురోజుకు పెరుగుతుంది. దిగుమతి సుంకాలు పెంచడం వల్ల వస్తువుల ధరలు పెరిగినా ద్రవ్యోల్బణం పెరిగినా ట్రంప్ పట్టించుకోవడం లేదు. ట్రంపుకు అత్యంత సన్నిహితుడు సూపర్ అధ్యక్షుడిగా పేరొందిన పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ తో సహా పలువురి మాటలను పెడచెవినపెట్టి వారినందరిని దూరం చేసుకున్నాడు.

**ద్రవ్యోల్బణం – ధరలు పెరుగుదల:**

ముఖ్యంగా ట్రంప్ ప్రతీకార చర్యలవల్ల ఎగుమతులు తగ్గి, అగ్రరాజ్య రైతుల ఆదాయాలు పడిపోయాయి. ధరలు ఎగబాకి పేద, మధ్యతరగతి వర్గాల బతుకులు మరింత దుర్భరమయ్యాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాలనే నెపంతో సర్కారీ కొలువులకు ట్రంప్ భారీగా కోతపెట్టారు. విద్యాశాఖను మూసేశారు. పోషకాహారం, వైద్యం పరిశోధనలు వంటి వాటికి నిధులను తగ్గించడానికి సిద్ధపడ్డాడు. వీటికి తోడు విమర్శకుల నోళ్లను మూయించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. శాంతి భద్రతల పేరుతో రాష్ట్రాల్లో ఫెడరల్ మిలిటరీ జోక్యానికి నారు పోస్తూ ప్రజాస్వామ్య వాతావరణానికి భంగం కలిగిస్తున్నారు.. అత్యంత శక్తివంతమైన అధ్యక్ష పదవిని 'పిచ్చివాడి చేతిలో రాయి' అన్నట్లుగా మార్చిన ట్రంప్ ను అమెరికా జనాలే కాదు మొత్తం ప్రపంచమే ఈసడించుకుంటున్నది.

**నిరసన జ్వాలలు:**

ట్రంపు దుందుడుకు ఫాసిస్టు చర్యలతో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నిరసనలు హోరెత్తుతున్నాయి. తాను చెప్పిందే శాసనమన్నట్లుగా ప్రవర్తిస్తున్న ట్రంప్‌లోని నిరంకుశ రాచరిక పోకడలను చీత్కరిస్తూ 'నో కింగ్స్' పేరుతో జూన్ లో అమెరికన్ ప్రజానీకం పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని నినదించింది. అయినా పద్ధతి మార్చుకోని ట్రంప్ తన అస్తవ్యస్థ విధానాలతోనే ముందుకు వెళుతున్నాడు. తాజాగా మరోసారి అమెరికా జన సామాన్యం ఆందోళనల బాట పట్టింది. మొన్నటి వారం మొదటి రోజునే 50 రాష్ట్రాలలోని 50 కేంద్రాలలో యూనివర్సిటీల లోని విద్యార్థులు 70 లక్షలకు పైగా నిరసన ప్రదర్శనలు పాల్గొన్నట్లు వార్తలొచ్చాయి. ఆ మరుసటిరోజున దేశవ్యాప్తంగా విద్యార్థులు, ప్రజలు నియంతృత్వం కాదు, జనస్వామ్యం కావాలంటూ' 2700 పట్టణ కేంద్రాలలో నిరసన వెల్లువెత్తాయి. అమెరి కా నుంచి వలసదారులను వెళ్లగొడతామంటూ ట్రంప్ హుంకరిస్తున్నా డు. అక్రమ వలసదారులంటూ అవమానకరమైన రీతిలో స్వదేశాలకు తరలించాడు. వలసదారులపై ఉక్కు పాదం మోపడం, ఆరోగ్య రంగానికి నిధులు కోత పెట్టడం తదితరాలతో సమాజాన్ని అభద్రతలోకి నెడుతున్న ట్రంప్ తీరుపై మొదట్లోనే నిరసనకారులు ధ్వజమెత్తారు. హెచ్1 బి వీసాలకు లక్ష డాలర్ల రుసుము అంటూ ఏకంగా మొత్తం వాణిజ్య వ్యవస్థకే తూట్లు పొడిచే ప్రయత్నం చేశాడు. నిరసన వెల్లువలతో ఎఫ్1 లేదా ఎల్1 వీసాల నుంచి హెచ్ బి వీసాలకు మారే సమయంలో లక్ష డాలర్లు కట్టనవసరం లేదని ప్రకటించారు.

ట్రంప్ నియంతృత్వ పోకడలను, ప్రజాస్వామ్యాన్ని, సమానత్వాన్ని కాలరాస్తూ ఉండటాన్ని నిరసనకారులు దుయ్యబట్టారు. సొంత ప్రజల ఆవేదనను శాంతంగా ఆలకించే యుక్తా యుక్త విచక్షణతో మసులుకోవాల్సిన ట్రంప్ ఆ పని చేయకపోగా నిరసనలు తెలిపిన వారిపై వెకిలి దాడులకు దిగి తన బుద్ధి మాలినతనాన్ని మళ్లీ బయట పెట్టుకున్నాడు. ఇదే ధోరణి కొనసాగిస్తూ ఉంటే ట్రంప్‌కు తగిన గుణపాఠం తప్పదు.

## పోలీస్ అమరవీరుల జీవితాలు చిరస్మరణీయం : సిఐ



**ప్రజాపక్షం/మక్తల్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మక్తల్ సిఐ రామ్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామ్ లాల్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టే దిశగా అవగాహన అవసరమని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరం గా ఉండి సమాజారికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల లెక్చరర్స్, పోలీసులలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆహ్లాదకరంగా పార్కులు : కార్పొరేటర్ ప్రభుదాస్



**ప్రజాపక్షం/కాప్రా :** హెచ్ కాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్ పార్కు, కృష్ణానగర్ పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది అందుబాటులోకి త్వరలోకి తేనున్నామని స్థానిక కార్పొరేటర్ ప్రభు దాస్ అన్నారు. హర్టికల్చరల్ విభాగ డిప్యూటి డైరెక్టర్ అన్నపూర్ణ, ఇతర అధికారులు లోకేష్, దేవిరాజ్‌లతో కల్సి ఆయనతో పాటు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ పార్కులో పాడైపోయిన ఓపెన్ జిమ్ పరికరాల స్థానం లో కొత్త వాటిని ఏర్పాటు చేయటంతో పాటు పూర్తిస్థాయిలో పచ్చదనం కల్పించే విధంగా మొక్కలుంటాయన్నారు. బయోవర్సిటీ పార్కు నమూనాలో అభివృద్ధి చేయాలన్నారు.

## జర్మనీలో నర్సింగ్ శిక్షణ, ఉద్యోగావకాశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జర్మనీలో నర్సింగ్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శిక్షణతో కూడిన నియామకాలు జరుగనున్నాయని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి తెలిపారు. రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజన్సీ తెలంగాణా ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా అర్హత కల్గిన నైపుణ్యం కల్గిన సెమిస్కిల్డ్ కార్మికులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ఈ నియామకాలు జరుగుతున్నాయన్నారు. జర్మనీలో ఆరోగ్య సంరక్షణ కార్మికులకు నర్సులుగా పనిచేసే వారికి అధిక డిమాండ్ ఉన్న దృష్ట్యా ఆసక్తి ఉన్న అభ్యర్థులకు జర్మనీలో మూడేళ్ల ఇంటర్నేషనల్ నర్సింగ్ డిగ్రీ శిక్షణ ఇచ్చి వెంటనే అక్కడే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ అవకాశాలు కల్పిస్తోందన్నారు. జర్మనీలో నర్సింగ్ శిక్షణా సమయంలో ఒక లక్ష రూపాయలు స్టైఫండ్, ఆ తర్వాత ఈ ఉద్యోగాలకు గాను నెలకు రూ.2 నుండి 3లక్షల వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్‌మీడియట్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, 18 నుండి 28 ఏళ్ల వయస్సుండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జర్మనీకి పంపించే ముందు హైదరాబాద్‌లో జర్మన్ భాషలో తొమ్మిది మాసాల పాటు జర్మనీ భాషల రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు tomcom.recruitmentmanager@gmail.com వెబ్‌సైట్ ద్వారా కానీ tomcom యాప్ ద్వారా కానీ ఈ నెల 30లోగా దరఖాస్తు చేయాలని, మరిన్ని వివరాల కోసం 6302292450, 9440051763 ద్వారా తెల్సుకోవచ్చన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాల్ రాజ్ తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి నాగారం ఫీడర్‌ను 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయడంతో రెడ్డి కాలనీ, భగావన్ కాలనీ, చక్రీపురం హై టెన్షన్ లైన్, టీచర్స్ కాలనీ, కట్టింగ్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఎఇ తెలిపారు.

## ఎలక్షన్ ప్రక్రియలో జోక్యం చేసుకోం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బయోమెట్రిక్, ఒటిపి ఆధారిత ఓటరు విధానాన్ని అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలనే పిటిషన్‌లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై పిటిషనర్ వినతి పత్రంపై ఎన్నికల సంఘమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలానికి చెందిన సయ్యద్ జాకీర్ హుస్సేన్ వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని డివిజన్‌బెంచ్ కొట్టివేసింది. ఈ పిటిషనర్ ఇచ్చిన వినతి పత్రంలోని అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఇసినే నిర్ణయం తీసుకుంటుందని చెప్పింది.

## తరగతులకు అనుమతించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన రుస్దా ఉస్మాని అనే విద్యార్థిని ఎలాంటి షరతుల్లేకుండా తరగతులకు అనుమతించాలని ఖైరతాబాద్‌లోని నాసర్ పాఠశాలకు హైకోర్టు ఆదేశించింది. ఆమెను రెగ్యులర్ క్లాస్‌లకు అనుమతి ఇవ్వాలంది. విద్యార్థిని బహిష్కరణకు కారణాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వంతోపాటు పాఠశాలకు ఆదేశాలిచ్చింది. విచారణను నవంబరు 3వ తేదీకి వాయిదా వేసింది. ఆగస్టులో పాఠశాల సీలింగ్ ఫ్యాన్ పడిపోవడంతో పాక్షికంగా కంటిచూపు దెబ్బతినడంతో విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను పాఠశాల నుంచి బహిష్కరించారు. దీనిపై విద్యార్థి రుస్దా ఉస్మాని వేసిన పిటిషన్‌ను జస్టిస్ నంద శుక్రవారం విచారించి పైవిధంగా ఆదేశాలిచ్చారు.




## రైతుల ఆమోదం తర్వాతే భూసేకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ ఆర్)కు సంబంధించి రైతుల ఆమోదంతోనే భూసేకరణ చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర సమితి ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై శుక్రవారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్, రాష్ట్ర సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, డిజి నరసింహారావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యతో కూడిన రాష్ట్ర ప్రతినిధి బృందం హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఆర్ భూ సేకరణ అలైన్మెంట్ మార్చడం వల్ల రైతులు గందరగోళ పడుతున్నారని ప్రతినిధి బృందం కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఉత్తరం భాగంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం భూసేకరణ చేసిందని, కానీ ఇప్పటికీ స్థానిక గ్రామసభలు జరపకుండ, రైతులతో అధికారులు చర్చించకుండ నష్టపరిహారం నిర్ణయించకుండ రైతుల ఆమోదం లేకుండానే భూమిని తీసుకోవడం పూర్తయిందని ప్రకటించడం సమంజసం కాదన్నారు. దక్షిణ ప్రాంతంలో ప్రస్తుతం ప్రకటించిన అలైన్‌మెంట్ చేర్పులు, మార్పులతో అస్పష్టంగా వున్నప్పటికీ, అలైన్‌మెంట్‌లో ఏ మార్పులూ చేయలేదని కమిషనర్ చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కొంతమంది పెత్తందార్ల, రియల్ ఎస్టేట్ వ్యాపారులకోసం అలైన్మెంట్లు మార్చుతూ పేద రైతుల భూములు లాక్కునే చర్యను సిపిఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రైతుల తరపున ఆందోళన, పోరాటాలు కొనసాగిస్తుందని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

## అయ్యప్ప స్వామి భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి గ్రామంలోని శివాలయంలో అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. బాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్‌లు ఆగం పాండు ముదిరాజ్, ఆగం రాజు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులకు ప్రతీ ఏటాలాగే ఈ సంవత్సరం 41రోజుల పాటు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. అయ్యప్ప స్వామి మాలధారణ ధరించి 41 రోజుల



పాటు కఠోర దీక్షలతో మాలధారణ పూర్తిచేసుకుని శబరిమలైకి వెళ్లారు. ఇందులో భాగంగానే అయ్యప్ప మాలధారణ భక్తులకు ఆగం పాండు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రతీ ఏటా పదిహేడు సంవత్సరాలుగా నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా పాండు, రాజులు మాట్లాడుతూ ఎంతో భక్తి, శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో అయ్యప్ప స్వామి మాలను ధరించి 41 రోజుల పాటు దీక్షలో ఉండే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అల్పాహారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

### పండుగ సీజన్‌లో ప్రయాణీకుల రద్దీని..

# సమర్ధవంతంగా నిర్వహించాం

### రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్.గోపాలకృష్ణన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరుస పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని సమర్ధవంతంగా నిర్వహించామని సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ అన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఆయన రైల్వే మేనేజర్ ఎ. సంజీవరావు, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ షిఫాలితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణన్ మీడియా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే పండుగ సీజన్ కోసం సికింద్రాబాద్ డివిజన్ గ్రేడెడ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అభివృద్ధి చేశామన్నారు. ప్రయాణీకులు, వాహనాల కదలిక, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వినియోగం, ఎక్కువ రద్దీగా ఉన్న సమయాన్ని అంచనా వేయడం, స్టేషన్‌కు చేరుకు నే ట్రాఫిక్ అధ్యయనం మొదలైన వాటి గురించి వివరణాత్మక సర్వేలు నిర్వహించామన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు జరుగుతున్న ఈ కీలకమై న సమయంలో జనసమూహ నిర్వహణను ప్లాన్ చేయడంలో ఈ అంచనాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని, సికింద్రాబాద్ స్టేషన్‌కు సగటున 1.34 లక్షలు మంది వస్తుండగా, పండుగల సీజన్‌లో ఇది దాదాపు 1.84 లక్షలకు చేరుకుంటుందని తెలిపారు. ప్లాట్‌ఫారమ్‌కు ఒకవైపు గేట్ 2, గేట్ 4 వద్ద కొత్త హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయడం, కాజీపేట చివర వైపు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తెరవడం, సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్ వైపు కొత్త ఎగ్జిట్ గేట్ 5ఎ తెరవడం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలల గురించి కూడా ఆయన వివరించారు. ప్రధాన నగర టెర్మినల్స్‌లో రద్దీని తగ్గించడానికి, అధిక డిమాండ్ ఉన్న మార్గాల్లోని 24 రైళ్లకు లింగంపల్లి, హైటెక్ సిటీ మరియు చర్లపల్లి స్టేషన్లలో అదనపు స్టాప్‌లను ఏర్పాటు చేశామన్నారు.

వీటితోపాటు 92 కెమెరాలతో కూడిన పటిష్టమైన సి.సి. టి.వి నిఘా, మెరుగైన మౌలిక సదుపాయా లుగల 17 టికెటింగ్ కౌంటర్లు, 20 ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు, సికింద్రాబాద్ స్టేషన్, డివిజనల్ ప్రధాన కార్యాలయాలలో వార్‌రూమ్‌ల ఏర్పాటు వంటివి సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం కొన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు.



## అందుబాటులోకి 'బొల్లినేని' మైకాసా విల్లా ప్రాజెక్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిష్టాత్మక నూతన విల్లా ప్రాజెక్టు 'బొల్లినేని' మైకాసాను ప్రారంభించినట్టు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ షాంగ్రిలా ఇన్‌ఫ్రాకాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవ స్థాపకులు, ఛైర్మన్ బొల్లినేని సీనా తెలిపారు.

హైదరాబాద్ బేగంపేట్‌లోని టూరిజం ప్లాజాలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును పటాన్‌చెరు సమీపంలోని ఇస్నాపూర్‌లో ముంబై నేషనల్ హైవే పక్కన రూపుదిద్దుకొంటున్నదన్నారు. ఇందులో మొత్తం 391 విల్లాలు ఉండగా, కేవలం 18 నెలల వ్యవధిలోనే పూర్తి చేసి, హైదరాబాద్ నగర అభివృద్ధిలో మైలురాయిగా నిలువనున్నట్లు తెలిపారు.

ఇంటి స్వాధీనానికి ముందు ఎలాంటి ఇఎమ్‌ఐలు లేకుండా కొనుగోలుదారులకు ఆర్థిక విషయంలో ఉపశమనం కలిగిస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో వన్ నైన్ రీజో ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, ఎండి కె.క్రాంతికుమార్ రాజు, వెంచర్ క్యాపిటలిస్ట్ ఎన్.ఎం. వినయ్, మిసెస్ యూనివర్స్ హేమలతా రెడ్డి, బ్రూటిఫుల్ కాఫీ ఇండియా కో–ఫౌండర్ సనా, నటి లక్కీ వర్మ, సుధాజైన్ పాల్గొన్నారు.

## ఒయు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ..ఐఎస్‌బిని సందర్శించిన హై పవర్ కమిటీ ..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలను పరిశీలించి 'ఉస్మానియా విశ్వవిద్యాలయ' అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించేందుకు 'హైపవర్ కమిటీ' సిద్ధమైంది. ఒయు లో సమ గ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఒయు అభివృద్ధికి అవసరమైన అంశాలను విశ్లేషించి, ప్రపంచ స్థాయి విశ్వ విద్యాలయాల తరహాలో మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు, పాఠ్య ప్రణాళిక, విద్యార్థి సేవా కార్యక్రమాలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రభు త్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీకి సూచించింది. దీంతో హైపవర్ కమిటీ ప్రతినిధి బృందం శుక్రవారం శుక్రవారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)ని సందర్శించారు.

ఈనెల 25న( శనివారం) ఐఐటి హైదరాబాద్‌ను సందర్శించనున్నారు. ప్రముఖ విద్యాసంస్థల అభ్యాస నమూనాలను పరిశీలించి, ఒయు అభివృద్ధికి అనుగుణంగా రూపకల్పన చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.




## ఖైదీలకోసం 'సైకోథెరపీ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' కార్యక్రమం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ జైళ్ల శాఖ కేవలం శిక్షణ వ్యవస్థగా కాకుండా సంస్కరణాత్మక,పునరావాస కేంద్రంగా మారుతుందని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. శుక్రవారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీల కోసం సైకోథెరపీ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్(టిఒటి)ని జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా, సిఐడి, ఎసిబి డిజి చారుసిన్హాలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 9 జైళ్ల నుండి ఎంపికైన 60 మంది ఖైదీలకు ఫిలిస్ క్రిస్టల్ మెథడ్ ఆఫ్ హీలింగ్ అనే ప్రత్యేక మానసిక చికిత్సా విధానంపై శిక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. ప్రతి వ్యక్తికి మార్పు, అభివృద్ధి అవకాశాలు ఉండాలని, ఖైదీల మానసిక, భావోద్వేగ శ్రేయస్సుకోసం జైలుశాఖ చేపడుతున్న ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు అభినందనీయమని చారుసిన్హా అన్నారు. దేవాస్ అన్ లిమిటెడ్ సంస్థ సహవ్యవస్థాకురాలు శివాని సోలా, షగునా సిన్హాలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి(అడ్మినిస్ట్రేషన్)వై.రాజేష్, ఐజి(వెల్ఫేర్) మురళీ బాబు, హైదరాబాద్ రేంజ్ డిఐజి శ్రీనివాస్, జైలు పర్యవేక్షణాధికారి శివకుమార్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




**ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో సక్సెస్ మీట్**

రిటైర్డ్ అధికారుల సూచనలతో ప్రతి క్రీడకు ప్రమాణాలు సిద్ధం చేయడం భవిష్య ఈవెంట్లకు ఆదర్శంగా నిలుస్తుందని తెలంగాణ జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం 2025 సక్సెస్ మీట్‌ను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా అత్యధిక రాష్ట్రాలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వసతి, ఆహారం ఏర్పాట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సౌమ్య మిశ్రా విజయానికి తోడ్పడిన అధికారులు, సిబ్బందికి అభినందన పత్రాలు, మెమోంటోలను అందజేశారు. జైళ్ల శాఖ ఐజిలు వై రాజేష్, మురళీబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ వెంకట లక్ష్మి, డిప్యూటీ పర్యవేక్షణాధికారి భరత్, డిఐజిలు ప్రసగించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సంపత్, పర్యవేక్షణాధికారులు శివకుమార్‌గౌడ్, కళాసాగర్, కాళిదాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## బస్సు ప్రమాదంపై జాన్ వెస్లీ తీవ్ర దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లుతున్న ప్రైవేట్ స్లీపర్ బస్సు కర్నూలు వద్ద జరిగిన ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారికి సిపిఐ(ఎం) రాష్ట్రకమిటీ తరుపున తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. మరణించి వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బస్సుల ఫిట్నెస్, డిజైన్ , సామ ర్థం, పర్మిషన్ తదితర అంశాలను ప్రభుత్వం క్షుణంగా పరిశీలించిన తర్వాతే ప్రైవేట్ బస్సులకు అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎపి డిప్యూటి సిఎంను కలిసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓ వివాహ వేడుకకు విజయవాడ వెళ్లిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. హైడ్రాలాంటి వ్యవస్థ ఏపితో పాటు అన్ని రాష్ట్రాలకూ అవసరమని పవన్ కళ్యాణ్ అన్నారు. పాలకుల ముందు చూపు, నిబద్ధత గల అధికారుల పనితీరు ఏ వ్యవస్థకైనా మంచి పేరు తీసుకువస్తాయన్నారు. దేశంలోనే మొట్టమొదటిగా హైడ్రా రూపంలో సరికొత్త వ్యవస్థను తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. సరైన



అధికారిని నియమించడం, అధికారాలు కట్టపెట్టడం, పూర్తి స్వేచ్ఛతో పనిచేసే అవకాశం కల్పించడం జరిగితే ఫలితాలు బాగుంటాయన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న రంగనాథ్‌ని పవన్ కళ్యాణ్ అభినందించారు.

## ముడి చమురు కొనుగోలును పెంచనున్న భారతీయ రిఫైనర్లు

### రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత్ మొగ్గు

**న్యూఢిల్లీ :** రష్యాలోని రెండు ప్రధాన చమురు ఉత్పత్తిదారులపై వాషింగ్టన్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో రష్యా నుండి తగ్గిన చమురు దిగుమతులను భర్తీ చేయడానికి భారత చమురు శుద్ధి కర్మాగారాలు మధ్యప్రాచ్యం, లాటిన్ అమెరికా, అమెరికా నుండి ముడి చమురు కొనుగోళ్లను పెంచే అవకాశం ఉందని అధికార వర్గాలు, విశ్లేషకులు తెలిపారు.

రష్యాలోని రెండు అతిపెద్ద ముడి చమురు ఉత్పత్తిదారులైన రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా ప్రభుత్వం అక్టోబరు 22న ఆంక్షలు విధించింది. అన్ని అమెరికన్ సంస్థలు, వ్యక్తులు వారితో వ్యాపారం నిర్వహించకుండా నిషేధించింది. యునైటెడ్ స్టేట్స్ కాని సంస్థలు కూడా అనుమతి పొందిన కంపెనీలు లేదా వాటి అనుబంధ సంస్థలతో ఒప్పందం చేసుకుంటున్న విషయం ఒకవేళ తేలితే వారు జరిమానాలు ఎదుర్కోవాల్సిఉంటుందని,రోస్‌నెఫ్ట్,లుకోయిల్‌తో ఉన్న అన్ని సంబంధాలను నవంబరు21 నాటికి తగ్గించుకోవాలని యునైటెడ్ స్టేట్స్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఇటీవల హెచ్చరించింది.2025లో రోజుకు 1.7మిలియన్ బారెల్స్ చమురు(ఎంబిడి)ను ఉత్పత్తి చేయడానికి రష్యా ప్రస్తుతం భారతదేశం ముడి చమురులో దాదాపు మూడింట ఒక వంతును సరఫరా చేస్తోంది. ఇందులో దాదాపు 1.2 ఎంబిడి నేరుగా రోస్‌నెఫ్ట్, లుకోయిల్ నుండి వచ్చింది. ఈ వాల్యూమ్‌లలో ఎక్కువ భాగం ప్రైవేట్ రిఫైనర్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మరియు నయాగరా ఎనర్జీ కొనుగోలు చేశాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని రిఫైనర్లకు తక్కువ కేటాయింపులు జరిగాయి.

## పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

### టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంకటరత్నం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సీఎచ్ వెంకట రత్నం అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో గత మూడు నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే గ్రాటివిటీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట రత్నం, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు గత మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేక అనేక ఇబ్బందులకు గురవుతు కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆవేద వ్యక్తం చేశారు.

అదే విధంగా సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవులు గాని, డిఏ బకాయిలు జిపిఎఫ్ బకాయిలు గాని తదితర వాటన్నింటినీ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'ఒకరి కోసం అందరం అందరికోసం ఒకరం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఎఫ్డబ్ల్యుఎఫ్ లో సభ్యులుగా చేరాలని కోరారు. ఈ సందర్భంగా పరిగి మండలంలో గల వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నవాబుపేట మండలంలో టియస్ యూటిఫ్ కు మంచి ఆదరణ లభించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి, బి.పరమేశ్వర్, జిల్లా కార్యదర్శి పెద్దారం వెంకటయ్య, మండల కార్యదర్శిలు వెంకటయ్య, వెంకటయ్య, మండల ఎఫ్ డబ్లుఎఫ్ కన్వీనర్ అశోక్, మండల ఉపాధ్యక్షులు నరేందర్, మండల కార్యదర్శి విజయ్ కుమార్,తదితరులుపాల్గొన్నారు.



## జూదరుల అరెస్టు

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** ఆదిబట్ల మున్సిపల్ కేంద్రంలోని సాంబయ్య పామ్‌హౌస్‌కు ముందు ఉన్న వరండాలో ఉన్న ఖాళీ స్థలంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పెట్టి జూదం ఆడుతున్నారన్న సమాచారంతో ఆదిబట్ల పోలీసు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులలో అయిదుగురు పట్టుకున్నారు. ఒక వ్యక్తి పారిపోయడని పోలీసులు తెలిపారు. పేకాట ఆడుతూ దొరికిన వారిలో ఆదిబట్ల గ్రామనికి చెందిన పల్లె సాంబయ్య, గజ్జెల నర్సింహా, పల్లె ప్రకాష్, బుద్ధుల భాస్కర్, నాదర్గుల్ గ్రామనికి చెందిన కందికంటి మహిరాజ్ ఉండగా, ఆదిబట్ల గ్రామనికి చెందిన భూపతిగళ్ల రాజు పారిపోయిన వ్యక్తి పారిపోయినట్లు పోలీసులు వివరించారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి మొత్తం 25,050 రూపాయలు, 5 మొబైల్ ఫోన్లు, ఆటకు ఉపయోగిస్తున్న 2 సెట్‌ల పేక ముక్కలను ఆదిబట్ల పోలీసు వారు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వ్యక్తిని త్వరలో పట్టుకుని అతడిని సైతం కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎవరైన నిషేధించిన ఆటలను అడుతున్నట్టు దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుచుతామని హెచ్చరించారు.

## ప్రభుత్వస్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని షట్టర్లు నిర్మాణం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం కాలనీ వాసులు శుక్రవారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ శ్రీరమణ కాలనీలో గల సర్వే నెంబర్ 60లో ప్లాట్ నెంబర్ 332గల ప్లాటు పక్కన 700 గజాల ప్రభుత్వ స్థలం ఉన్నదని, అందులో 150 నుంచి 200 గజాల స్థలాన్ని ఆక్రమించి కమర్షియల్ షట్టర్లుగా నిర్మాణం చేసి అద్దె నిర్వహిస్తున్నారని, ఆక్రమదారుడిపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకొని, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ తహసీల్దార్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వి.శ్రావణ్ కుమార్, బి.రాజు, సూరి తదితరులు ఉన్నారు.

## పార్కులతో కాలనీ ప్రజలకు ఆరోగ్యం

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పార్కుల సుందరీకరణతోనే కాలనీ ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీవేంకటేశ్వర కాలనీలో నూతనంగా పార్కుల అభివృద్ధి కోసం మంజూరు అయిన 15.50 లక్షలతో పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ పార్కు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. అభివృద్ధి పనులకు కాలనీ వాసులు సహకారం ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎఇ కార్తీక్, కాలనీ వాసులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సొంతఖర్చులతో తాగునీటి సమస్య పరిష్కరించడం అభినందనీయం



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఎన్నో ఏళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు దాత ముందుకు వచ్చి బోరు వేయించి సమస్యను తీర్చడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో మంచినీటి దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన బిజెపి యువ నేత శంకర్‌ను గ్రామస్తులు అభినంధించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారని, దాంతో సొంత ఖర్చులతో బోరు వేయించడంతోపాటు మోటర్‌ను బిగించడం జరిగిందని వివరించారు. దాంతో మంచినీటి సమస్య తీరడంతోపాటు ప్రజల నీటి అవసరాలు తీరనున్నాయని, అడిగిన వెంటనే నీటి సమస్యను తీర్చినందుకు గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాల తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, కొమరబండ శ్రీశైలం, చెన్నయ్య, నేతలు యాదయ్య, వీరయ్య, జిబిశేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తెల్లవారు జామున కర్నూల్ సమీపంలో జరిగిన బస్సు అగ్నిప్రమాదంలో మరణించిన వారికి ప్రగాఢ సంతా పం తెలిపారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ ప్రైవేట్ బస్సు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే 23 మంది సజీవ దాహనం అయ్యారని, ఇందుకు బస్సు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ట్రావెల్స్ బస్సుల్లో కూడా కూలింగ్ గ్లాస్, సిలిండర్లు ఏర్పాటు చేసి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని తెలిపారు. ప్రాణాలు కొల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అంధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** మాల మహానాడు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా సవాళ్ల వినోద్‌కుమార్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బేగరి మహేష్ అధ్యక్షుతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫరూఖ్‌నగర్‌కు చెందిన సవాళ్ల వినోద్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ మాల మహానాడు సభ్యులు మాలల హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మాలలను ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయే తప్పా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయండం లేదని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సవాళ్ల వినోద్‌కుమార్ మాట్లాడుతూ మాలల హక్కుల సాధన కోసం తాను ఎల్లప్పుడు పోరాడుతానని అన్నారు. నిరంతరం గ్రామీణ స్థాయి నుండి మండల, జిల్లా స్థాయి వరకు మాలలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి మాల మహేష్, జిల్లా అధ్యక్షుడు బేగరి మహేష్ పాల్గొన్నారు.

## షాద్‌నగర్ జాగృతి ఇన్‌చార్జిగా చీమల రమేష్



**ప్రజాపక్షం/కేశంపేట :** షాద్‌నగర్ జాగృతి ఇన్‌చార్జిగా చీమల రమేష్‌ను నియమించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో షాద్‌నగర్ జాగృతి ఇన్‌చార్జిగా కేశంపేట మండలం కాకునూర్ గ్రామానికి చెందిన చీమల రమేష్‌ను నియమించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షురాలు కవిత షాద్‌నగర్ ఇన్‌చార్జిగా నియమించినందుకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రజా అవగాహనతోనే మార్పు సాధ్యం

హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల్లో అవగాహన వచ్చినప్పుడే మార్పు సాధ్యమని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ అన్నారు. హైడ్రాను ఎందుకు ఏర్పాటు చేశారు, హైడ్రా ఏంచేస్తుందనే విషయమై ఇప్పుడు అందరిలో అవగాహన వచ్చిందన్నారు. ఇంటర్‌నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లమాటిక్ రిలేషన్స్ (ఐసిసిడిఆర్) ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్‌డేను పురస్కరించుకుని మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సంస్కరణల అవసరం అనే అంశంపై గ్రీన్ పార్కు హోటల్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి పెద్ద పీట వేస్తుందన్నారు. ఆ దిశగా నగరంలో మెరుగైన జీవనవిధానాలు పెంపొందించేందుకు హైడ్రా పనిచే స్తోందన్నారు. ఆ క్రమంలోనే ఆక్రమణల తొలగింపు, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను పెద్దయెత్తున చేపట్టామన్నారు. ఇటీవల హైడ్రా వార్షికోత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలో నాలుగైదు తరగతుల విద్యార్థులు కూడా చెరువు ఎఫ్‌టిఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ జోన్‌ల గురించి వివరించిన తీరే హైడ్రా పట్ల ప్రజల్లో అవగాహన వచ్చిందనడానికి నిదర్శనమన్నారు.

### భారీవర్షాలు పడినా.. వరదలు నివారించాం

నగరంలో చెరువులను పునరుద్ధరిస్తున్నామని, ఆక్రమణలతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిన బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని రంగనాథ్ చెప్పారు. త్వరలోనే మరో 5 చెరువులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. నాలాలను కూడా పరిరక్షించే పనిని చేపట్టామన్నారు. ప్యాట్నీ నాలా విస్తరణతో 7 కాలనీలకు వరద ముప్పు తప్పించామన్నారు. నాలాల్లో పెద్దమొత్తంలో పూడికను తొలగించి, ఈ ఏడాది వరద ముప్పును తగ్గించామన్నారు. చెరువులు, వాటిని అనుసంధానం చేసే నాలాలను కాపాడుకోకపోతే, నగరాలను వరదలు ముంచెత్తుతాయని హెచ్చరించారు. ఈ ఏడాది భారీవర్షాలు కురిసినా, నగరంలో వరద కష్టాలు లేకుండా జాగ్రత్త పడ్డామన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నివేదిక ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు మాయం అయ్యాయని, ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే మిగతా 39 శాతం కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో హైడ్రాను ఏర్పాటు చేసి, చెరువులు, నాలాల పరిరక్షణకు పెద్ద పీట వేస్తోందన్నారు.

### 15 నెలల్లో వెయ్యి ఎకరాలు కాపాడాం..

ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించుకోవాల్సిన అవసరంపై ప్రజల్లో ఇప్పుడు పూర్తి అవగాహన వచ్చిందని రంగనాథ్ చెప్పారు. హైడ్రా ఏర్పాటు చేసి ఏడాది దాటి 3 నెలల వ్యవధిలో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామన్నారు. దీని విలువ దాదాపు రూ.60 వేల కోట్లు ఉంటుందన్నారు. రియర్ అడ్మిరల్ ఆర్.శ్రీనివాసరావు, మేజర్ ఎస్‌పిఎస్ ఓబెరాయ్ గౌరవ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పద్మ కాంత హాజారిక (ఓఎస్‌డి/మిషన్ డైరెక్టర్, ఎపిటిడిసిఎల్, అస్సాం), సర్సింగ్ ఎంగ్టి (చైర్మన్, డొరోతి వాలంటరీ అసోసియేషన్) ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సంస్థ సెక్రటరీ జనరల్, అంబాసిడర్ డాక్టర్ శ్రీనివాస్ ఎలూరి వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అవార్డులను అందజేశారు.

## క్రీడలతో విద్యార్థుల సమతుల్య జీవనశైలి అభివృద్ధి





డిఆర్‌ఎస్‌ఐఎస్ డైరెక్టర్, అంతర్జాతీయ స్కేటర్ గర్వ్ అగర్వాల్


**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల సమతుల్య జీవనశైలిని అభివృద్ధి చేసుకోవడానికి క్రమశిక్షణ, దృష్టి, వ్యక్తిగత వృద్ధిని పెంపొందించడానికి క్రీడలు దోహదం చేస్తాయని, అవి శారీరక దృఢత్వాన్ని పొందడంలో సహాయపడతాయని డిఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, అంతర్జాతీయ స్కేటర్ గర్వ్ అగర్వాల్ తెలిపారు. హైదరాబాద్ గుండ్ల పోచంపల్లిలోని డిఆర్‌ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో 'ఇంటర్ స్కూల్ క్రీడా పోటీలు సీజన్–4' ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 69 పాఠశాల విద్యార్థులతోపాటు ప్రభుత్వ జెడ్‌పిస్కూల్ విద్యార్థులు మొత్తం 1248 పాల్గొన్న ఈ క్రీడా పోటీలను గర్వ్ అగర్వాల్ ప్రారంభించి మాట్లాడారు. విద్య ప్రాధాన్యత మూలస్తంభంగా ఉన్న నేటి మారుతున్న ప్రపంచంలో క్రీడలు విద్యార్థికి తిరుగులేని ముఖ్యమైనపాత్ర పోషిస్తాయన్నారు. అంతర్జాతీయంగా రాష్ట్ర విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడానికి స్కేటింగ్, స్విమ్మింగ్, టెన్నిస్, కరాటే వంటి క్రీడలలో నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నామని, కార్యక్రమంలో డిఆర్‌ఎస్‌ఐఎస్ ప్రిన్సిపాల్ ఐ.వేణు గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవి.భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ పోలింగ్ స్టేషన్‌లలో.. ఓటర్లకు సౌకర్యాలు, సహాయ కేంద్రాలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లకు ప్రాథమిక సౌకర్యాలు, సహాయ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, సులభంగా ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సుధర్శన్ రెడ్డి తెలిపారు. మొదటిసారిగా, పోలింగ్ స్టేషన్‌ల బయట మొబైల్ ఫోన్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామని శుక్రవారం ఆయన చెప్పారు. ఓటర్లు తమ ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేసి ఈ కౌంటర్లలో ఉంచి, ఓటు వేసిన తర్వాత తిరిగి స్వీకరించవచ్చు అన్నారు. వృద్ధులు, దివ్యాంగులతో సహా అందరికీ ఓటింగ్ సులభంగా, అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. పోలింగ్ రోజుకు ముందే ప్రతి బూత్ సిద్ధంగా ఉంటుందని, తద్వారా ఓటర్లు సౌకర్యవంతంగా, ఆలస్యం లేకుండా ఓటు వేయవచ్చు అని ఆయన వివరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో తాగునీరు, టాయిలెట్లు, వేచి ఉండే స్థలాలు, లైటింగ్, ర్యాంపులు, స్పష్టమైన సైన్‌బోర్డులు ఉంటాయన్నారు. ఓటు రహస్యాన్ని కాపాడేందుకు ప్రామాణిక ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్నామనాన్నారు. ఓటరు సమాచార పోస్టర్లలో పోలింగ్ వివరాలు, అభ్యర్థుల జాబితా, గుర్తింపు కార్డు అవసరాలు, ఓటింగ్ సూచనలతో అందిస్తామన్నారు. ప్రతి పోలింగ్ స్థలంలో ఓటరు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు తమ పేరు, బూత్ నెంబర్‌ను ఓటరు జాబితాలో కనుగొనేందుకు సహాయపడతాయన్నారు.

## 'సీలీ ఇండియా' కొత్త పోస్చర్ అడ్వాన్స్ శ్రేణి విడుదల



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడవుతున్న మెట్రెస్ బ్రాండ్ 'సీలీ ఇండియా ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్' తన కొత్త పోస్చర్ అడ్వాన్స్ శ్రేణిని భారత్ మార్కెట్‌లోకి విడుదల చేసింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో శుక్రవారం జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి నటి రుమా శర్మ హాజరయ్యారు. అంతర్జాతీయ కోర్ సపోర్ట్ ప్లస్, ఎడ్జ్‌గార్డ్ హెచ్‌పి సాంకేతికతతో వెన్నెముకకు సరైన సపోర్టు, దీర్ఘకాలిక స్థిరత్వం కలిగిస్తుందని సీలీ ఇండియా నేషనల్ సేల్స్ హెడ్ కుశాల్ సింగ్ యాదవ్ తెలిపారు. వచ్చే మూడేళ్లలో వందకుపైగా స్టోర్లుగా పెంచాలనే లక్ష్యంతో కంపెనీ ముందుకు సాగుతున్నదని సీలీ ఇండియా మార్కెటింగ్ హెడ్ సోనాలి డే తెలిపారు.

## అన్నిరంగాల్లో బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ

అందుకు అన్ని పార్టీలు ఏకాభిప్రాయం తెలపాలి

రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** జనాభా ప్రకారం బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల అమలుకోసం రాజ్యాంగ సవరణ జరగాలని, అందుకు అన్ని రాజకీయపార్టీలు ఏకాభిప్రాయంతో ముందుకురావాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య కోరారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్, బిసి విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి రేష్విత్, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, జి.అనంతయ్య అధ్యక్షతన జరిగిన బిసి విద్యార్థి సంఘం రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిసిల విద్యాభివృద్ధికి ప్రత్యేక స్కీములు రూపొందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్థాయిలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ , ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. బిసిల సామాజిక రక్షణ, భద్రతకు 'బిసి యాక్టు'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టసభలలో కూడా బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం ఉధృతం చేయాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. 26న బిసి సంఘాలు ప్రజాసంఘాలతో సమావేశమై కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి సంఘం నేతలు గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, సి.రాజేందర్, జక్కుల వంశీ, శివ యాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర కాలనీలో హైడ్రా కూల్చివేతలు





**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సి బ్లాక్ లో ఉన్న కమ్యూనిటీ హాల్, పార్క్ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి రూమ్‌లను ఏర్పాటు చేసి క్రయ, విక్రయాలు జరుపుతున్నారని కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథన్ స్థలాన్ని పరిశీలించి శుక్రవారం హైడ్రా సిబ్బందితో వచ్చి కబ్జా నుండి 2000 గజాల స్థలాన్ని సుమారు 40 కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని కబ్జాదారుల నుండి విడిపించారని రాఘవేంద్ర కాలనీ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో రోజుల నుండి కబ్జాదారులు తమ కాలనీలోని కమ్యూనిటీ హాల్ కొరకు పార్క్ స్థలం కొరకు ఏర్పాటు చేసుకున్న 2000 వేల గజాల స్థలాన్ని కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారని హైడ్రాకు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి హైడ్రా అధికారులు కబ్జా స్థలంలో నిర్మించిన రూమ్‌లను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సూచిక బోర్డులను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను రౌడీలు అనడం కెసిఆర్ దొరకు అలవాటే

టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలను రౌడీలు అనడం కెసిఆర్ దొరకు అలవాటేనని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కుటుంబాన్ని రౌడీ కుటుంబం అని కెసిఆర్ అగ్రకుల దురహంకారంతో మాట్లాడటం తగదని తీవ్రంగా ఖండించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కెసిఆర్ దొర పాలనలో నవీన్ యాదవ్‌పై ఎన్ని కేసులున్నాయో కెసిఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నిక జరుగుతున్న ఈ సమయంలో రౌడీషీటర్లను, పోక్సో కేసులున్న వారిని బిఆర్‌ఎస్‌లో ఎందుకు చేర్చుకుంటున్నారో కెసిఆర్ సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ సంపదను రాబందుల్లా దోచుకున్న కెసిఆర్ కుటుంబీకులు, ఖజానాను ఖాళీ చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించారని ఆయన దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కెనడీ, జాన్, జోసెఫ్, పీటర్, చందు తదితరులు పాల్గొన్నారు.

# దళారీ వ్యవస్థను నియంత్రించేందుకే సిసిఐ కేంద్రాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్






**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దళారీ వ్యవస్థలను నియంత్రించేందుకే ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని రాఘవేంద్ర కాటన్ కార్పోరేషన్‌లో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పత్తిని సిసిఐ కేంద్రంలోనే విక్రయించేందుకు కృషి చేయాలని, దళారీలకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఏగ్రేడ్ క్వింటాల్ పత్తికి రూ.8110 చెల్లించడం జరుగుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, సీతారాములు, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

### దివ్యాంగులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తా

దివ్యాంగులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేందుకే శాశ్వత సదరం క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదరం యుడిఐడి క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సదరం క్యాంపు స్థానికంగా లేకపోవడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నతస్థాయి అధికారులతోపాటు సంబంధితశాఖ మంత్రితో మాట్లాడి నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. శాశ్వతంగా షాద్‌నగర్‌లోనే సదరం ఆర్థోపెడిక్ క్యాంపు ఉంటుందన్నారు. మీసేవ ద్వారా యుడిఐడి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, అందులో కొండాపూర్ ఆప్షన్ పెట్టుకుంటే షాద్‌నగర్‌కు వస్తుందని వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి శ్రీలత, డిపిఎంలు విజయశ్రీ, నర్సింలు, యాదయ్య, జయశ్రీ, నిర్మల, మార్కెట్ కమిటి వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, నందిగామ ఏపిఎం భగవాన్, ఫరూఖ్‌నగర్ ఏపిఎం జయ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, ఆర్థోఫెడిక్ డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## జకోవిచ్ రికార్డు బ్రేక్



పురుషుల టెన్నిస్‌లో దిగ్గజాలు రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ వీడ్కోలు తర్వాత కొత్త తారలు దూసుకొచ్చారు. వెటరన్ ప్లేయర్ అయిన నొవాక్ జకోవిచ్‌ను నిలువరిస్తూ టైటిళ్లు పట్టేస్తున్నారు. అయితే.. జోకో నెలకొల్పిన అత్యధిక గ్రాండ్‌స్లామ్స్ రికార్డు మాత్రం బ్రేక్ చేయడం గగనమే. ఎందుకంటే ఇప్పటికైతే అతడికి దరిదాపుల్లో ఎవరూ లేరు. కానీ, కార్లోస్ అల్కరాస్‌కు ఆ దమ్ముందని.. అతడు జకోను అధిగమించి ఆల్‌టైమ్ రికార్డు సృష్టిస్తాడని అంటోంది మాజీ క్రీడాకారిణి సెరీనా విలియమ్స్. 'టెన్నిస్ ఆటలో స్పానిష్ వాళ్ల ఆధిపత్యం ఎప్పటి నుంచో ఉంది. ఇదివరకూ రఫెల్ నాదల్ ఇప్పుడు అల్కరాస్. ఈమధ్య కాలంలో ఈ యంగ్‌స్టర్ అద్భుత విజయాలతో అదరగొడుతున్నాడు. నేను అతడికి పెద్ద అభిమానిని. ప్రతిసారి మ్యాచ్‌కు ముందు అతడికి ఫోన్ చేసి విజయం సాధించాలని చెబుతాను అని సెరెనా వెల్లడించింది. జకోవిచ్ తన పేరిట రాసుకున్న అత్యధిక గ్రాండ్‌స్లామ్స్ రికార్డును బ్రేక్ చేసేది ఎవరు? అనే ప్రశ్నకు ఇంకెవరు మన అల్కరాస్ అని ఠక్కున చెప్పేసిందీ అమెరికా లెజెండ్ ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న అతడు జకో రికార్డును బ్రేక్ చేస్తాడు. ఇప్పటివరకూ అతడు ఆరు టైటిళ్లు సాధించాడు. ఇదే జోరు చూపిస్తే అతడికి రికార్డు బద్ధలుకొట్టడం కష్టమేమీ కాదు. ఎందుకంటే.. టెన్నిస్‌లో ఏదైనా సాధ్యమేన'ని వివరించింది నల్ల కలువ. మహిళల టెన్నిస్‌లో దిగ్గజ ప్లేయర్ అయిన సెరెనా 23 గ్రాండ్‌స్లామ్స్ కొల్లగొట్టింది. సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి డబుల్స్‌లోనూ ట్రోఫీలు గెలుపొందిందీ క్వీన్. టీనేజ్ సంచలనంగా దూసుకొచ్చి.. టెన్నిస్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించిన సెరీనా.. 2022లో వీడ్కోలు పలికింది. వ్యక్తిగత జీవితంతో పాటు.. తన సొంత కంపెనీ బాధ్యతలు చూసుకోవాలని భావిస్తున్నట్టు చెబుతూ సుదీర్ఘ కెరీర్‌కు అల్విదా చెప్పేసింది గ్రేటెస్ట్ టెన్నిస్ ప్లేయర్. ప్రస్తుతం పురుషుల టెన్నిస్‌లో జకోవిచ్ ఆధిపత్యానికి గండి కొడుతున్నాడు అల్కరాస్. ఇటలీ కెరటం జనిక్ సినర్ కూడా సంచలన ఆటతో టాప్ సీడ్‌లతో పోటీకి సై అంటున్నారు. గతరెండేళ్లుగా ఈ ముగ్గురి మధ్యే కోర్ట్ వార్ నడుస్తోంది. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్..ఒలింపిక్స్ ఫైనల్లో జకోవిచ్‌ను ఓడించి స్వర్ణ పతకం సాధించాడు అల్కరాస్. గాయాలతో బాధపడుతున్న జకో..మరో ఏడాది మాత్రమే ఆడే అవకాశముంది. ఆలోపు అతడు 25వ గ్రాండ్‌స్లామ్ సాధిస్తాడా? అనేది చెప్పలేం.

**అత్యధిక గ్రాండ్‌స్లామ్స్**

1. నొవాక్ జకోవిచ్(సెర్బియా) – 24.
2. రఫెల్ నాదల్(స్పెయిన్) – 22.
3. రోజర్ ఫెదరర్(స్విట్జర్‌లాండ్) – 20.
4. పీట్ సాంప్రాస్(అమెరికా) – 14.
5. రోయ్ ఎమెర్సన్ (ఆస్ట్రేలియా) – 12.



## వదలని వాన

### శ్రీలంక, పాకిస్థాన్ ఆఖరి మ్యాచ్ రద్దు

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో శ్రీలంక, పాకిస్థాన్ జట్ల చివరి మ్యాచ్ వర్షార్పణమైంది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో టాస్‌కు అడ్డుపడిన వరుణుడు చివరకు మ్యాచ్‌ను మింగేశాడు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 34 ఓవర్ల ఆటకు సిద్ధమైన పాక్ ఇన్నింగ్స్ సమయంలో వర్షం అంతరాయం కలిగించింది. వాన తగ్గితే మ్యాచ్ ఆడించాలని అంపైర్లు చూసినా లాభం లేకపోయింది. దాంతో.. చివరకు ఆటను రద్దు చేశారు. ఫలితంగా మెగా టోర్నీని విజయంతో ముగించాలని ఆశపడిన ఇరుజట్లకు నిరాశే మిగిలింది. శ్రీలంక, పాకిస్థాన్ మ్యాచ్ టాస్‌కు ముందే వర్షం మొదలైంది. దాంతో.. రెండున్నర గంటల సమయం వృథా కావడంతో, 34 ఓవర్ల మ్యాచ్ ఆడించాలని భావించారు. 17:45 గంటలకు టాస్ వేయగా లంక కెప్టెన్ చమరి ఆటపట్టు బౌలింగ్ తీసుకుంది. ప్రపంచ కప్‌లో బోణీ కొట్టని పాక్ భారీ స్కోర్ చేసి లంకకు సవాల్ విసరాలని అనుకుంది. కానీ.. ఐదో ఓవర్ తొలి బంతి పడిందో లేదో మళ్లీ వాన అందుకుంది. దాంతో.. అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికి పాక్ స్కోర్.. 18–0. చివరి మ్యాచ్ కాబట్టి విజయంతో టోర్నీని ముగించాలని భావించిన పాక్ జట్టు.. స్వదేశంలో విక్టరీ కొట్టాలనుకున్న లంక క్రికెటర్లతో పాటు అభిమానులు దేవుడిని ప్రార్థించినా ఫలితం లేకపోయింది. దాంతో.. మ్యాచ్‌ను రద్దు చేసి చెరొక పాయింట్ కేటాయించారు అంపైర్లు. మ్యాచ్ రద్దుతో తీవ్ర అసంతృప్తికి లోనైన పాక్ కెప్టెన్ ఫాతిమా సనా ఐసిసికి కీలక విన్నపం చేసింది. 'ప్రపంచ కప్‌లో వాతావరణం మాకు అనుకూలించలేదు. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో విజయావకాశాలు ఉన్నవేళ వర్షం దెబ్బతీసింది. మరో రెండు మ్యాచ్‌లు కూడా వాన కారణంగానే రద్దు కాగా కీలక పాయింట్లు కోల్పోయా. అందుకే వాన ముప్పు లేని వేదికలను ఐసిసి ఎంపిక చేయాలి. ఎందుకంటే.. వరల్డ్ కప్ కోసం నాలుగేళ్లు నిరీక్షిస్తాం. అలాంటిది మ్యాచ్‌లు ఫలితం తేలకుండా రద్దయితే ఎంతో నష్టపోతాం' అని ఫాతిమా మ్యాచ్ అనంతరం చెప్పింది.

## జూనియర్ హాకీ వరల్డ్‌కప్ నుంచి

## తప్పుకున్న పాకిస్థాన్

భారత్‌లో జరగనున్న జూనియర్ హాకీ వరల్డ్ కప్ నుంచి పాకిస్థాన్ వైదొలగినట్లు అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ ధ్రువీకరించింది. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు జూనియర్ హాకీ వరల్డ్‌కప్ జరగాల్సి ఉన్నది. చెన్నై, మధురై వేదికల్లో ఆ మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే పాకిస్థాన్ తప్పుకున్న నేపథ్యంలో ఆ స్థానంలో మరో జట్టును ప్రకటించనున్నట్లు హాకీ ఫెడరేషన్ పేర్కొన్నది. వాస్తవానికి టోర్నీలోని గ్రూప్ బీలో పాకిస్థాన్ ఉన్నది. ఆ గ్రూపులోనే భారత్, చిలీ, స్విట్జర్లాండ్ దేశాలు ఉన్నాయి. భారత్‌లో జరుగుతున్న టోర్నీల నుంచి పాకిస్థాన్ వైదొలగడం ఇదే రెండో సారి. ఇటీవల మెన్స్ ఆసియాకప్ నుంచి కూడా పాక్ టీమ్ తప్పుకున్నది. బీమార్‌లోని రాజ్‌గిర్‌లో ఆ



టోర్నమెంట్ ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ ఏడవ తేదీ వరకు జరిగింది. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలు బలహీనపడిన విషయం తెలిసిందే. జూనియర్ హాకీ వరల్డ్‌కప్ నుంచి పాకిస్థాన్ తప్పుకున్న విషయంపై తమకు సమాచారం లేదని హాకీ ఇండియా పేర్కొన్నది.

# ఫోకస్ సైన్స్



## పరిధుల్లేని క్వాంటం ఎంటాంగిల్మెంట్ !

పక్కపక్కనే ఉన్న రెండు కణాల అనుసంధానాన్ని ఊహించుకోవచ్చు. కానీ, సుదూరంగా ఉండే రెండు లేదా అంతకంటే ఎక్కువ సబ్‌టామిక్ కణాల అనుసంధానం, ఒకే విధమైన వాటి విధానం ఆశ్చర్యం కలిగించక మానదు. అత్యంత శక్తివంతమైన అనుసంధానికి భౌతిక శాస్త్రం ఇచ్చిన కొత్త నిర్వచనమే ఇఆర్=ఇపిఆర్ (ఇఆర్ = ఇపిఆర్). ఐన్‌స్టీన్–రోసెన్ (ఇఆర్) వంతెనలు (వార్మ్‌హోల్స్)ను ఐన్‌స్టీన్–పోడోల్స్కీ–రోసెన్ (ఇపిఆర్)తో సమానమని కొత్త సిద్ధాంతం పేర్కొంటున్నది. క్వాంటం ఎంటాంగిల్మెంట్‌గా పిలిచే ఈ సిద్ధాంతంలో ఒక కణ లక్షణాన్ని 'స్పిన్'గా కొలిచినప్పుడు, మరొక కణం ఎంత దూరంలో ఉన్నప్పటికీ, దాని సంబంధిత లక్షణాన్ని ఇక్కడి నుంచే తెలుసుకోవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం, కణాలు వాటి వ్యక్తిగత గుర్తింపులను కోల్పోయి, ఒకే, ఏకీకృత క్వాంటం స్థితి ద్వారా ఆవిష్కృతమవుతాయి. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి కణాల మధ్య సంబంధం తక్షణమే ఉంటుంది. ఉదాహరణకు, మీరు ఒక కణాన్ని కొలిచి అది 'పైకి' తిరుగుతున్నట్లు కనుగొంటే, మరొకటి 'క్రిందికి' తిరుగుతున్నట్లు మీకు వెంటనే తెలుస్తుంది. అయితే, ఇది కాంతి కంటే వేగవంతమైన కమ్యూనికేషన్ రూపం కాదు. ఎందుకంటే కొలత ఫలితం యాదృచ్ఛికంగా ఉంటుంది. మీరు ముందుగా నిర్ణయించిన సందేశాన్ని పంపడానికి దీన్ని ఉపయోగించలేరు. సంప్రదాయ భౌతిక శాస్త్రంలో కనిపించే సిద్ధాంతాలకు భిన్నంగా గోచరించే ఎంటాంగిల్‌మెంట్ అనేది క్వాంటం మెకానిక్స్ యొక్క ప్రధాన సూత్రం. క్వాంటం కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడానికి ఇది చాలా కీలకమైనది. ఇక్కడ ఇఆర్=ఇపిఆర్ సిద్ధాంత విధానాలను పరిశీలించాల్సిన అవసరం ఉంటుంది. వార్మ్‌హోల్స్, ఇపిఆర్ అనేది చిక్కుకున్న కణాలు ఒకే అంతర్లీన అనుసంబంధానికి సంబంధించిన రెండు వేర్వేరు వర్ణనలను సూచించే ఊహాజనితమైన భౌతిక శాస్త్ర సూత్రం. ఇది గురుత్వాకర్షణ, క్వాంటం మెకానిక్స్ మధ్య లోతైన సంబంధాన్ని సూచిస్తుంది. జువాన్ మాల్డాసేనా, లియోనార్డ్ సస్కిండ ప్రతిపాదించిన ఈ ఆలోచన, చిక్కుకున్న కణాలు ఒక వార్మ్‌హోల్ ద్వారా అనుసంధానించబడి , గురుత్వాకర్షణ, క్వాంటం సిద్ధాంతాన్ని ఏకం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, బ్లాక్ హోల్ ఇన్ఫర్మేషన్ పారడాక్స్ వంటి దృగ్విషయాలను అర్థం చేసుకోవడానికి కొత్త మార్గాన్ని అందిస్తుందనే విషయాలను వివరిస్తుంది. కృష్ణబిలం లేదా బ్లాక్ హోల్‌లోకి పడిపోయే సమాచారం, ఈ వార్మ్‌హోల్ లాంటి నిర్మాణాల ద్వారా అనుసంధానించబడి, తప్పించుకునే హాకింగ్ రేడియేషన్‌తో చిక్కుల్లో ఎన్‌కోడ్ చేయబడి ఉండవచ్చు. కాబట్టి, ఇది వైరుధ్యాన్ని పరిష్కరించడానికి సహాయపడుతుంది.

ఒక ఆవిష్కరణ తర్వాతి కాలంలో సంచలనాలు సృష్టించవచ్చు. హెన్రిక్ హెర్జ్ ఆవిష్కరణే ఇందుకు నిదర్శనం. 19వ శతాబ్దంలో ఆయన కనుకొన్న ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాల విలువ అప్పట్లో ఎవరూ గుర్తించలేదు. 1886లో అతను జేమ్స్ క్లాక్ మాక్స్‌వెల్ ప్రతిపాదించిన ఎలక్ట్రోమాగ్నెటిజం సిద్ధాంతాన్ని విశ్లేషించడంపై దృష్టి కేంద్రీకరించాడు. ఈ క్రమంలోనే రేడియో తరంగాలను సృష్టించి, పరికరాలను తీర్చిదిద్దాడు. ఈ తరంగాలు ప్రతిబింబిస్తాయని, వంపు తిరుగుతాయని, అంతరిక్షంలో ప్రయాణిస్తాయని నిరూపించాడు. అయితే, ఈ ఆవిష్కరణ వల్ల లాభం ఏమిటో హెర్జ్‌కు కూడా తెలియదు. ఇలాంటి తరంగాలను ఎందుకు వినియోగిస్తారో అతను చెప్పలేకపోయాడు. కానీ, ఆ పరిశోధనలు ఒక విప్లవాత్మక మార్పుకు కారణమయ్యాయి. అన్ని రకాల

### వృథాకాని ఆవిష్కరణ..

తరంగాలను కొలిచే ప్రమాణాలను మెగా హెర్జ్, గిగా హెర్జ్ వంటి ప్రమాణాల్లో అతని పేరు చేరిపోయింది. అతని ప్రయోగాలు రేడియో, టెలివిజన్, రాడార్, మొబైల్ నెట్‌వర్క్‌లకు పునాది అయ్యాయి. కేవలం 36 ఏళ్ల వయసులో మృతి చెందినా, హెర్జ్ ఆవిష్కరణలు మనం వాడే ప్రతి వైర్‌లెస్ సిగ్నల్‌లలో కొనసాగుతున్నాయి. ఉపయోగం కనిపించదని భావించిన మనిషి, తన అదృశ్య తరంగాలపై నిర్మించిన ప్రపంచంలో నిత్యం జీవిస్తునే ఉంటాడు. హెర్జ్ అనుభవాలు ఆధునిక వైర్‌లెస్ సాంకేతికతకు మార్గదర్శకమయ్యాయి. చేతిలో ఉండే ఫోన్ నుంచి నింగిలోని ఉపగ్రహాల వరకూ అన్నిటా అతను కనుగొన్న ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాలే ఉపయోగపడుతున్నాయి.





### అదృష్టం అంటే..



అదృష్టం అంటే యాదృచ్ఛికంగా లభించే లాభదాయకమైన సంఘటనగా చాలా మంది అనుకుంటారు. శతాబ్దాలుగా ఉన్న బలమైన నమ్మకం ఇదే. కానీ, క్వాంటం ఫిజిక్స్‌లోని కొత్త సిద్ధాంతాలు ఆ అభిప్రాయాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఆధునిక శాస్త్రవేత్తలు అదృష్టం అనేది యాదృచ్ఛికం కాకుండా, ఉపకణాల కదలిక, వాటి పరస్పర చర్యల ప్రభావమని సూచిస్తున్నారు. క్వాండం స్థాయిలో ఏదీ నిశ్చయం కాదు. ఏదైనా సాధ్యమవుతుంది. ఉపఅణువులు వాటంతట అవే కదలవు. అవి గణితమయమైన తరంగ ఆకారాలను అనుసరిస్తూ, క్వాంటం ఎంటాంగిల్‌మెంట్ ద్వారా పరస్పర చర్యకు లోనవుతాయి. అంటే, చిన్న చిన్న సంఘటనలు, ఒక నాణెం బొమ్మ లేదా బొరుసు పడడం నుంచి సరైన సమయానికి ఎవరో వ్యక్తిని కలవడం వరకూ ఎన్నో ఘటనలు ఈ సూక్ష్మ మైన, కనిపించని తరంగ శక్తుల ద్వారా అనుసంధానమై ఉండవచ్చు. కాబట్టి, క్వాంటం స్థాయిలో అదృష్టాన్ని వ్యక్తిగత అంశాలకు ముడిపెట్టడం సరికాదు. పూర్వజన్మ సుకృతాలు అంతకంటే కాదు. అది భౌతిక వాద పరిణామం. ప్రకృతి నియమంలో ఒక భాగం. మొత్తం మీద అదృష్టానికి కొత్త నిర్వచనాన్ని ఇస్తున్న ప్రతిపాదనను ఒక విప్లవాత్మక ఆలోచనగా పేర్కోవచ్చు. ఈ ప్రతిపాదన శాస్త్రాన్ని, ఊహాధ్యాయాన్ని కలిపే సాధకం.

## కార్మికవర్గానికి దిక్సూచి ఎఐటియుసి : ఓమయ్య




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనలకు కార్మిక వర్గానికి దిక్సూచిగా ఎఐటియుసి నిలుస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఉపాధ్యక్షులు చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ఈనెల 31న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని, జెండాలను ఆవిష్కరించి ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి పోరాటాలతోనే కార్మిక చట్టాలను ఈ దేశంలో తీసుకువచ్చిందన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికుల హక్కులను హరించడంతోపాటు 12 గంటల పని విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుందని, కార్మిక వేతనాలు తగ్గించే కుట్రలు చేస్తున్నారని, మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 31న ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ఉపాధ్యక్షులు దేవేందర్, భాగ్యలక్ష్మి, కార్యదర్శి హనుమాండ్లు, అనిల్, కవిత, సంపత్, భానుచందర్, రమేష్, వసంత, రాధాకుమార్, అజీజ్, శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని ఎఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలకపల్లి ఆర్‌జిరెడ్డి జూనియర్ కళాశాల ఎఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు. ఆర్‌జిరెడ్డి కళాశాల నూతన కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా పల్లవి, కోకన్వీనర్‌గా శిరీషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 20 నెలలు గడుస్తున్న కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేయాలని, పటిష్టమైన ఫీజు నియంత్రణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు, విద్యార్థి నాయకులు పల్లవి, శిరీష, రవి, సంతోష్, లక్ష్మి, ప్రసన్న, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## యువతతోనే పార్టీకి పూర్వవైభవం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- సిపిఐలో చేరిన డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రమేష్
- సిపిఐ(ఎం)కు పలువురు రాజీనామా



**ప్రజాపక్షం/ఖమ్మం :** యువతతోనే కమ్యూనిస్టు పార్టీకి పూర్వ వైభవం వస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మారిన పరిస్థితుల్లో యువత రాజకీయాల వైపు దృష్టిసారించాలని ఆయన కోరారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు, సిపిఐ(ఎం) నాయకులు చింతల రమేష్ తన పదవికి రాజీనామా చేసి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా సమక్షంలో సిపిఐలో చేరారు. రమేష్‌కు పార్టీ కండువా కప్పి కూనంనేని ఆహ్వానించారు. రమేష్‌తో పాటు రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) శాఖ కార్యదర్శి జైపాల్, సభ్యులు జ్యోతిబాస్, చంద్రమ్మ, మల్లెంపాటి రమేష్‌తో సహా పలువురు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా పార్టీ విస్తరించాలన్నారు. ఆర్థిక అంతరాలు, పెరుగుతున్న మతోన్మాదం, హక్కుల హననం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కమ్యూనిస్టులను కోరుకుంటున్నారన్నారు. యువతతోనే సమాజ మార్పు సాధ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, యానాలి సాంబశివ రెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్, ఎఐవైఎఫ్ నాయకులు ఎం.శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## 30న హుజూర్‌నగర్‌లో సిపిఐ జిల్లా సమావేశం : గన్నా

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో స్పందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పార్టీ శ్రేణులను కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై సిపిఐ నాయకుల పోరాటాలతోనే పార్టీ బతోపేతం అవుతుందన్నారు. ఈనెల 30న హుజూర్‌నగర్‌లో సిపిఐ సూర్యాపేట జిల్లా జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి సిపిఐ జాతీయకార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరవుతారన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, సోమగాని కృష్ణ, మామిడి వెంకయ్య, ఇందిరాల వెంకటేశ్వర్లు, చెన్నగాని సైదులు, చక్రాల స్టాలిన్, సుందరి పద్మ, మామిడి నర్సయ్య, జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ వైద్యం పడకేయడంతో దోపిడీకి తెగబడుతున్న ప్రైవేట్‌వైద్యం



- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం పడకేయడంతో ప్రైవేట్ వైద్యం దోపిడీకి తెగబడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా ఆరోపించారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం రోగాల సీజన్ నడుస్తుందని, టైఫాయిడ్, మలేరియావంటి జ్వరాలతో పాటు ఇతర రోగాలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారన్నారు. జిల్లా ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే సరైన వసతులు లేక రోజుల తరబడి వేచి చూసిన వారికి వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వైద్యం కుదరట్లేదని ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం నిలువు దోపిడీకి పాల్పడుతుందని ఆయన విమర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై స్పందించి జిల్లా ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో సతమతమవుతున్న సామాన్య ప్రజలు, సీజనల్ వ్యాధులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది స్పందించి ఆస్పత్రులకు వచ్చే రోగులకు మంచి వైద్యం అందించాలని, అవసరమయిన మందులు అందించాలని ఆయన కోరారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయని రాష్ట్రవ్యాప్తంగా ఈకార్యక్రమాలు జరుగుతాయని, అందులో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున సెమినార్లు , సదస్సులు, ప్రదర్శనలు, జాతాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. డిసెంబర్ 26న రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టుయోధులతో వంద సంవత్సరాల సిపిఐ ఉత్సవాలు ఖమ్మంలో లక్షలాదిమందితో నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన అత్యధిక స్థానాల్లో పోటీచేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్ము భరత్, సిపిఐ కంట్రోల్ కమీషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, టి.నర్సింహ్మా, యేసయ్య, ఈర్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

## గడపగడపకూ సిపిఐ వందేండ్ల చరిత్ర

- సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ శతాబ్ది వేడుకల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని దానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణంలోని పార్టీ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో జిల్లా సమితి సబ్యులు ఇట్టి వెంకటరావు అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ సిపిఐ వందేండ్ల చరిత్రను, నిర్వహించిన ఉద్యమాలను పట్టణం, గ్రామం తేడాలేకుండా వాడ వాడలా, గడపగడపకు తీసుకెళ్ళాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కా ర్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నాయకులు నిమ్మల రాం బాబు, వీసంశెట్టి పద్మజ, మన్నెం వెంకన్న, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీనివాసరావు, జర్పుల మోహన్, బదావత్ శ్రీనివాస్, నిట్టా అమృతరావు, వజ్జా వాసు, ఇరుకులపాటి సుధాకర్, జక్కుల రమేష్, జక్కుల లింగేశ్వర్, జక్కుల సురేష్, లింగంపల్లి నాగేశ్వరరావు, బానోత్ రంజిత్, సాయిలి శ్రీను, మాలోత్ హరి, వగ్గెల పద్మ, ఎండూరి ప్రభావతి, బత్తుల గోపాలక్రిష్ణ, బానోత్ రవి, మేకా రాంబాబు, గుర్రం నాగయ్య, కంటె వీరేష్, తాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**చంద్రుగొండ :** ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. మండల పరిధిలోని సీతాగూడెం గ్రామంలో జరిగిన మండల సమితి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సిపిఐ శతాబ్ది వేడుకల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గార్లపాటి రామనాథం, జడ శ్రీను, మండల కార్యదర్శి బొర్రా కేశవరావు, నాయకులు గంగుల లక్ష్మి నారాయణ, కురసం రాములు, సొసైటీ డైరెక్టర్ కనకం ఆంజనేయులు, కేసరి రాఘవులు, బొర్రా నారాయణ, బీరకాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** నాగిరెడ్డిపల్లి వాగు నుండి గురువారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక నింపుకొని పెద్దపొర్ల గ్రామానికి తరలిస్తున్న పెద్దపొర్ల గ్రామానికి చెందిన కొత్తగుడిసే అరుణ్ కుమార్‌ను ఆ ట్రాక్టర్‌ను నాగిరెడ్డిపల్లి శివారులో ఉట్కూర్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ వద్ద ఇసుక తరలించుటకు ఎలాంటి అనుమతులు లేనందున, ఆ ట్రాక్టర్‌ను ఉట్కూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఉట్కూర్ మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్కూర్ ఎస్సై తెలిపారు.

## బాల్య వివాహాలు లేని గ్రామాలుగా మార్చాలి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట/మక్తల్:** నారాయణపేట జిల్లాలోని గ్రామాలను బాల్య వివాహ రహితంగా మార్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, అన్ని శాఖలతో కన్వర్జెన్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెవెన్యూ పంచాయతీ రాజ్ పోలీసు శాఖ తో పాటు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసిడిఎస్, ఐసిపిఎస్, డిహెచ్ఈడబ్ల్యూ, చైల్డ్ హెల్ప్ లైన్ విభాగాల ఉద్యోగులు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా నివారించాలని కలెక్టర్ ఆదేశించారు. గతేడాది జిల్లాలోని మద్దూరు, దామరగిద్ద , ధన్వాడ, మరికల్, ఉట్కూర్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లో నమోదైన బాల్య వివాహాల కేసుల వివరాలను ఆయా మండలాల అంగన్‌వాడీ సూపర్ వైజర్లను అడిగి, ప్రస్తుతం ఆయా కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఒకరిద్దరు సూపర్ వైజర్లు తమ పరిధిలో నమోదైన కేసుల వివరాలను పూర్తిగా చెప్పక పోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కాగా అంతకు ముందు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి కమిటీలు తమ తమ పరిధిలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఈ నెల 28 నుండి 30 వరకు అన్ని గ్రామాలలో గ్రామ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల వారీగా గత 2023 నుంచి 2025 వరకు నమోదైన బాల్య వివాహాల కేసుల వివరాలు, వాటి పురోగతిని క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, ఆర్డీ రామచంద్రనాయక్, డిసిపివో కరిష్మా, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీలు, అంగన్ వాడీ సూపర్ వైజర్లు, ఐసిపిఎస్, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**క్యాన్సర్ వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకోవాలి**

క్యాన్సర్ వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కోస్గి పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రారంభించారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది మన ఆరోగ్యాన్ని కాపాడుకునే ముందస్తు జాగ్రత్త అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఇండో అమెరికాన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇస్ట్యూట్ డాక్టర్లు, సిబ్బంది, డాక్టర్ మల్లికార్జున్, డా.జయ చంద్రమోహన్ డిఎచ్ఓ, డా.అనుదీప్, తాహసిల్దార్ బక్క శ్రీనివాసులు, శ్రీధర్, ఆయా సబ్‌సెంటర్‌లు, వైద్యులు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

**కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలి**



సిసిఐ కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌పై గ్రామస్థాయి నుండి మండల స్థాయి అధికారులు జిల్లా రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సిసిఐ (కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు, పత్తి సేకరణ తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుండి ఆమె రెవెన్యూ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌తో పత్తి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ఆ యాప్ గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే బాధ్యత మండల స్థాయి అధికారులదే అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా జిల్లాలో మొత్తం 7 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పత్తి కొనుగోలుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీను, సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్, ప్రణీత్, జిల్లా మార్కెటింగ్ అధికారిని బాలామణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, మార్కెట్ కార్యదర్శి భారతి పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా ... నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని తూముకుంట వాగు నుండి అర్ధరాత్రి వేళ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాణి తెలిపారు. వివరాల ప్రకారం, తూముకుంట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గ్రామస్థులు 100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు వాగు వద్దకు చేరుకుని, వీపగనండ్ల, నాగర్ల బండ తండా గ్రామాలకు చెందిన నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. తరువాత వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. పట్టుబడిన ట్రాక్టర్లను కోర్టుకు అప్పగించే ప్రక్రియ కోనసాగుతుందని ఎస్సై కె.రాణి తెలిపారు. ఇసుకపై అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

## పెద్ద చెరువులో చేప పిల్లల విడుదల



**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ధన్వాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో రెండు లక్షల 18 వేల చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. చిట్టెం మాధవరెడ్డి నారాయణపేట ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు, సదాశివరెడ్డి నారాయణపేట మార్కెట్ కమిటీ అధ్యక్షులు, ఆళ్లగడ్డ కాంత్ కుమార్ జిల్లా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు , బ్రహ్మానందం ధన్వాడ మండల ప్రత్యే అధికారి చేతుల మీదుగా చేప పిల్లలను చెరువులో వదలడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ సింధుజ తాసిల్దార్ ధన్వాడ, వెంటకటేశ్వర్ రెడ్డి, ఎంపిడివో ధన్వాడ జట్రం లక్ష్మయ్య గౌడ్, నారాయణపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్, వర్ధన్ ఫీల్డ్ ఆఫీసర్, అనిల్ కుమార్ ఫీల్డ్ ఆఫీసర్, గుండ్ల కుంట నర్సింహులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస రావు సెక్రటరీ ధన్వాడ, సంద లక్ష్మయ్య, సంద బాల్ రాజు, గువ్వలపల్లి వెంకట రాములు, టప్ప భాస్కర్, నీరటి అశోక్ కుమార్, నీరటి బాబా, తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ యాప్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కృష్ణ:** పత్తి కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన పత్తిని తీసుకుని వచ్చి సరైన మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ సూచించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయితీలలో పత్తి రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పత్తిని ఎండబెట్టి తేమ 8 నుండి 12 శాతం మధ్యలో ఉన్న పత్తిని తీసుకుని వెళ్లాలన్నారు. అలాగే ఏఈఓ లాగిన్‌లో రైతు మొబైల్ నెంబరు ఒక డైరెక్టుగా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని, రైతులకు అమ్మకాలు సులభతరం అయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు. సదస్సులో వరి కొనుగోలు గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, అన్ని పంచాయితీల ఏఈఓలు, పంచాయితీ సెక్రెటరీలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రానికి చెందిన సింగంరాజు వెంకటయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని స్థానిక టిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ మట్టవెంకటయ్య గౌడ్, కానుగుల జోగయ్య, ఇతరనాయకులు పరామర్శించి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయాపార్టీల నాయకులు తిరుపతిరెడ్డి, రేవెల్లి దర్గయ్య, మారేపల్లి శ్రీను, కిష్టాలు, రేవెల్లి రాజు, సురేష్, దాసరి మహేష్, అంజి,శివ, భరత్, సమీర్, శేఖర్, వెల్దండ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**తిమ్మినోనిపల్లిలో :**

మండలపరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో పోడేండ్ల అనూష అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ యువ నాయకులు గండికోటరాజు రూ.2వేలు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు నుంచి రూ.3వేలు, రాచూర్ మాజీ ఎంపిటిసి గుత్తి వెంకటయ్య రూ.2వేల చొప్పున మృతురాలి కుటుంబానికి అందజేశారు.

## బోధన నాణ్యత పెంపొందించాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి ఎర్ర అంజయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల అకాడమిక్ రికార్డులు, హాజరు రిజిస్టర్లు పరిశీలించి, ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై, హాజరు ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపక సిబ్బందితో సమావేశమై, ఇంటర్మీడియట్ డైరెక్టర్ ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్, హెచ్ఆర్ఎంఎస్, అమ్మ ఆదర్శ పాఠశాల నిధులను సమర్థవంతంగా వినియోగించి కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రతి నెల జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశంలో కళాశాల పనితీరు, పురోగతిపై సమీక్ష జరుగుతుందని వివరించారు. విద్యార్థుల హాజరు ఆధారంగా ఫలితాలు మెరుగుపడతాయని, బోధన నాణ్యత పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ శివగౌడ్ అధ్యక్షత వహించగా, ఎజిఎంసి ఇన్‌చార్జ్ లక్ష్మీ నారాయణ, విద్యార్థి సలహాదారిణి కల్పనా, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## భగీరథుడి పట్టుదల అందరిలో ఉండాలి

### పెద్దమందడిలో భగీరథుడి విగ్రహం ఆవిష్కరించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** పట్టుదలతో భగీరథుడే ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉండాలని నేను ఎల్లవేళలా భగీరథ మహర్షినే ఆదర్శంగా తీసుకుంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుబడి ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ రిజర్వేషన్ తెలంగాణలో అమలు పరిచి దేశానికే రోల్ మోడల్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం సగరులకు అవకాశం ఉన్నచోట గుర్తింపుని ఇస్తామన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో 20 లక్షల రూపాయలతో సగరుల సామూహిక భవనాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సగర సంగం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణపనులు త్వరితగతిన పూర్తి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇందిరమ్మ ఇండ్లనిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఓ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని ముచ్చర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లనిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన వేగవంతంగా పూర్తిచేయాలని, ఇండ్లనిర్మాణం ప్రారంభించి త్వరితగతిన పనులు ప్రారంభించాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎల్3 లబ్ధిదారుల సేకరించిన వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిఓ లక్ష్మణ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి బాలస్వామి, ఇందిరమ్మకమిటి సభ్యులు పాల్గొన్నారు.

## మంజూరైన ఇండ్లు వెంటనే ప్రారంభించండి



కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని చందాపూర్, చిట్యాల గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి ప్రతాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. గ్రౌండింగ్ ప్రారంభించిన ఇళ్లు బెస్‌మెట్ లెవల్‌కు చేరితే మొదటి విడద చెల్లింపులు జరుగుతుందని అన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్దిదారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్దిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తిగా చేయాలని ఆదేశించారు. అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్ లేకుండా లబ్దిదారులకు నగదు పడే విధంగా చూసుకోవాలని, పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్దిదారులకు ఇసుకకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

**గణితంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి**

చందాపూర్ గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల గణితం మార్కుల నివేదికతో పాటు ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ గురించి ఆరా తీశారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, గృహ నిర్మాణ శాఖ డిఈఓ విఠోబా, తహశీల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీఓ, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## కుట్రలు మానుకోవాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** బిసిల రిజర్వేషన్ అడ్డుకుంటున్నటువంటి కొంతమంది నాయకుల కుట్రలు మానుకోవాలని,గవర్నర్ బిసి బిల్లును ఆమోదించండి లేకుంటే గవర్నర్ పదవికి రాజీనామాచేయాలని తెలంగాణయూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సొంటం శశికుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి రాష్ట్రంలో జరుగుతున్న రిజర్వేషన్ల కుట్రలపై చర్చించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో జరుగుతున్న బిసిసంఘాల ఉద్యమాలపై నివేదికను తీసుకొని ఈ అంశాన్ని త్వరితగతిన బిసిబిల్లును ఆమోదం తెలపాలని డిమాండ్‌చేశారు. ఉపముఖ్యమంత్రిని కలిసినవారిలో శేఖర్‌గౌడ్, మల్లేష్, వివేక్‌చారి పాల్గొన్నారు.

## బీమాతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

### లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్



**ప్రజాపక్షం/వనపర్తి :** ప్రజలు ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన చేసుకోవటం వల్ల తమ కుటుంబానికి ఆర్థిక భరోసాను ఇచ్చినవారు అవుతారని లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ సూచించారు. జన సురక్ష 2025 కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుండి అక్టోబర్ 31 వరకు లీడ్ బ్యాంకు కార్యాలయం బ్యాంకు బ్రాంచీల యొక్క సహకారముతో జిల్లాలో జన సురక్ష శిబిరాలు నిర్వహించారు. శుక్రవారం లీడ్ బ్యాంక్ కార్యాలయం, వనపర్తి జిల్లా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రేవల్లి శాఖ ఆధ్వర్యంలో ఉదయం రేవల్లి మండలంలోని గౌరిదేవి పల్లిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ 18 ఏండ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరూ కేవలము 456/(పిఎంజెజెబివై 436/,పిఎంఎస్‌బివై 20/)లతో ఈ రెండు భీమా సౌకర్యాలను పొంది మీ యొక్క కుటుంబానికి ఆర్థిక భద్రతను, ఆర్థిక భరోసా కల్పించిన వారమి అవుతాము. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ మీ యొక్క కెవైసిని బ్యాంకు వారికి సమర్పించి మీ ఖాతాలను పునరుద్దరించుకోవాలని మనవి చేశారు. యూనియన్ బ్యాంకు రేవల్లి శాఖ బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ కేంద్రము అందించే ఈ భీమా పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. అలానే ఈ మధ్య కాలములో జరుగుతున్న సైబర్ నేరాల మీద అవగాహన తెచ్చుకోవాలని, ఎవరైనా ఈ సైబర్ నేరాల బారిన పడిన బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి కంప్లెంట్ చేసినచో మీ ఖాతాను సైబర్ నేరగాళ్ల నుంచి కాపాడడం జరుగుతుందని అని అన్నారు. జన సురక్ష కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్, సిబ్బంది, యూనియన్ బ్యాంకు రేవల్లి బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, బిజినెస్ కరస్పాండెంట్లు, సిఎఫ్ఎల్, ఎఫ్ఎల్‌సి కౌన్సిలర్లు, ఎపిఎం బ్యాంకు లింకేజీ, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** వనపర్తి మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఆయనకు మత్స్యకారులు ఘనంగా స్వాగతం పలికారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు.

## పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

### కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు పై వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, ఐకె.పి.ఏ.పి.ఎం. లు, సి.సి. లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల మానిటరింగ్ అధికారులు , కార్యదర్శులు, పాయింట్ ఇంచార్జిలు వ్యవసాయ శాఖ ఏ.డి.లు, ఏ.ఈ.ఓ.లు, ఏ.ఓ.లు, రైస్ మిల్లర్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న దృష్ట్యా కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లు కొనుగోలు ప్రక్రియలో చేపట్టవలసిన జాగ్రత్తలు సూచనలు ఆయా శాఖల అధికారులు తెలిసిన విధంగా తప్పనిసరి పాటించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నీడ కల్పించేలా టెంట్, తాగునీరు, కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జిల్లాకు 45 ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్‌లు వారం రోజుల్లో రానున్నాయని తెలిపారు. రైతులు అరబోసి తాలు, లేకుండా నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యం తీసుకువచ్చేలా నాణ్యతా ప్రమాణాల గురించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు, నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యంను మాత్రమే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా రైతులకు నాణ్యత ప్రమాణాలు తేమ శాతం ఉన్న ధాన్యం కు సీనియారిటీ ప్రకారం టోకెన్‌లు జారీ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుకు కొనుగోలు పత్రం జారీ చేయాలని, కొనుగోలు పత్రం తీసుకున్న రైతులు ఎట్టి పరిస్థితుల్లో మిల్లర్ వద్దకు వెళ్లవద్దని తెలిపారు. కొనుగోలు పత్రంలో సూచించిన విధంగా మాత్రమే ధాన్యం ఆలస్యం చేయకుండా మిల్లర్‌లు దిగుమతి చేసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు సీజన్ పూర్తి అయ్యే వరకు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వివిధ శాఖల సిబ్బంది, సమన్వయంతో కొనుగోలు ఎటువంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులపై రైతులకు వ్యవసాయ అధికారులు తెలియజేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వెంటనే ఓ.పి.ఎం.ఎస్.లో రైతు వివరాలు అప్‌లోడ్ చేయలని అన్నారు. హార్వెస్టర్ యజమానులతో సమావేశం జరిపి వారికి ఆర్‌పిఎం 18 నుండి 19 వరకు ఉండేలా, ఇతర సూచనలు తెలుపాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు పాల్పడిన, నిర్లక్ష్యం వహించిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, జిల్లా సహకార అధికారి శంకరాచారి, పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, సహకార అడిట్ అధికారి టైటస్ పాల్ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## రక్తదానం ప్రాణదానంతో సమానం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన రక్తదానం చేసి మాట్లాడారు. శిభిరంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధపడుతున్న పిల్లల కోసం రక్తాన్ని సికిల్ సెల్ సొసైటి స్వచ్ఛంద సంస్థకు అందజేయనున్నట్లు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్‌పి తోపాటు ఏఆర్ అదనపు ఎస్‌పి జనార్థన్ రెడ్డి, ఏఆర్ డిఎస్‌పి నరసింహ చారి, ఆర్ఎస్ఐలు కె అశోక్, రాజశేఖర్, స్పెషల్ పార్టీ సిబ్బంది రక్తదానం చేశారు. సూర్యాపేట పట్టణ ఆటో డ్రైవర్ యూనియన్ డ్రైవర్లు స్వచ్ఛందంగా శిభిరంలో పాల్గొని రక్తదాన యూనిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఉన్నారు.



## దళారుల చేతిలో మోసపోవద్దు

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/వలిగొండ : తడిసిన పత్తిని కూడా మద్దతు ధరతోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వలిగొండ మండలంలోని నాగారం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వెంకటేశ్వర శ్రీ సాయి జిన్నింగ్ మిల్లు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల ఈ ఏడాది పత్తి పంట దిగుబడి బాగా తగ్గిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సీసీఐ వారు 8,110 మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నెలరోజుల ముందుగానే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ప్రత్యేక యాప్ ను కూడా రూపొందించింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో దశరథ సంబంధిత అధికారులు తదితరలు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరం




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి మంచిస్థాయిలో ఉండాలని ఏఆర్ డిఎస్‌పి నరసింహ చారి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా జిల్లా ఎస్‌పి నరసింహ ఆదేశాలతో శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి డిఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో గంజాయి పెద్ద సమస్యగా మారిందని విద్యార్థులు, యువత అవగాహన చేసుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులకు పోలీసు విధులు, విధానాలు, ఆయుధ ప్రదర్శన చేసి సమాజంలో శాంతి భద్రత రక్షణలో వాటి వినియోగం గురించి వివరించారు. కేసుల ధర్యాప్తులో క్లూసీ టీమ్, ఫింగర్ ప్రింట్స్ విభాగం, డాగ్ స్క్వాడ్ విధులు, బాంబ్ స్క్వాడ్ విధులను తెలిపారు. మహిళల రక్షణలో షీ టీమ్స్ చేస్తున్న సేవలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుందరంగా సదరం కేంద్రం




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఆధునీకరించిన వికలాంగుల ధ్రువపత్రాల జారీ కేంద్రాన్ని (సదరం) సుందరంగా తీర్చిదిద్దడం పట్ల జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని వికలాంగుల దృవపత్రం జారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాగా15 లక్షల రూపాయల వ్యయంతో ఇది వరకు ఉన్న వికలాంగుల ధ్రువపత్రం జారీ కేంద్రాన్ని ఆధునికరించడం జరిగింది.వాల్ పెయింటింగ్స్, డాక్టర్లు, రోగులు విడివిడిగా వేచి ఉండేందుకు విభాగాలు, టాయిలెట్లు, కుర్చీలు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆధునీకరించిన సదరం శిబిరంలో పనులు చివరి దశకు చేరుకోగా,పనులన్నీ పరిశీలించిన తర్వాత జిల్లా కలెక్టర్ వికలాంగుల ధ్రువపత్రాల జారీ కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ అరుణకుమారి, డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ నగేష్, ఆర్ఎంఓ డాక్టర్ మహేష్ కుమార్, డాక్టర్లు రత్న, స్వప్న, రజని, వినయ్ తదితరులు ఉన్నారు.

## రైతు ప్రయోజనాలకు పెద్దపీట



ప్రజాపక్షం/హాలియా: రైతులకు గిట్టుబాటు ధర కల్పించి దానితోపాటు బోనస్ కూడా అందిస్తూ రైతు ప్రయోజనాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మారేపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మంచి ధర కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఈ కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి రైతులు గిట్టుబాటు ధర పొందడంతో పాటు అదనంగా సన్నధాన్యానికి అందిస్తున్న బోనస్ కూడా పొంది ఆర్థికంగా లబ్ధి పొందాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్ రెడ్డి, కుందూరు రాజేందర్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, మాలె సత్యనారాయణ రెడ్డి, భానుచందర్ రెడ్డి పాల్గొన్నారు.

## 31 వరకు ఆసరా పింఛన్లు పంపిణీ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఇందుమూలముగా వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు (అనగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళ పింఛన్లు) పొందు పింఛనుదార్లకు ఈనెల 24 నుండి 31వరకు బట్వాడా చేయబడునని డిఆర్‌డిఓ యర్రబెల్లి.శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛనుదారులు సంబంధిత పోస్టల్ ఆఫీస్‌కు నేరుగా వెళ్లి పింఛన్లు పొందలన్నారు.పింఛనుదారులు ప్రభుత్వము వారు ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు సాఫ్ట్ వేర్ ద్వారా పింఛను మొత్తం పొందవలెను. పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించ వలసిన అవసరము లేదన్నారు. పింఛను మొత్తము సొమ్ము రూ.16తో సహా అడిగి తీసుకోవాలని తెలియజేశారు.

## మెగా జాబ్ మేళాను రెండో రోజూ కొనసాగిస్తాం

### విశేష సంఖ్యలో నమోదు కావడంతో పొడిగించాం
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఈనెల 25న హుజూర్‌నగర్‌లో నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చిన నేపధ్యంలో రెండో రోజు కొనసాగించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం సాయంత్రానికి జాబ్ మేళాలో పాల్గొనేందుకు నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య 36వేలకు చేరిందని, ఆ సంఖ్య జాబ్‌మేళా సమయానికి 40వేలకు పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. శనివారం హుజూర్‌నగర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్న నేపధ్యంలో శుక్రవారం సాయంత్రం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాలో పాల్గొనే నిరుద్యోగుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో ఏర్పడనున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని రెండో రోజు కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు. నమోదు చేసుకున్న అభ్యర్థులందరికి అవకాశం ఇవ్వాలన్న కోనంలోనే రెండో రోజుకు పొడగించిన నేపధ్యంలో అభ్యర్థులు కొంత మేర సహనం పాటించి తాపీగా ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద నిరుద్యోగ యువతీ, యువకులకు ఉన్న విశ్వసనీయతకు మెగా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు నమోదైన అభ్యర్థుల సంఖ్య అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రూప్ 1, 2 ఉద్యోగ నియామకాల ప్రక్రియతో కలుపుకుని రెండేళ్ళ వ్యవధిలో 70వేల ఉద్యోగాలను భర్తీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం తాము ఇప్పుడు నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా ఇంతటి స్పందన లభించిందన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలన్న సంకల్పం మేరకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో జాతీయ, అంతర్జాతీయ, స్థానిక పరిశ్రమలన్నింటిని కలుపుకొని మొత్తం 275 పరిశ్రమలు పాల్గొనేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. భాషా పరిజ్ఞానంతో పట్టణ ప్రాంత యువతీ యువకులకు ఉపాధి సునాయాసంగా లభిస్తుందని, వెనుకబడి ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ధృడ సంకల్పంతో ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. అటువంటి మెగా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు పాల్గొనడం శుభపరిణామంగా అభివర్ణించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి నరసింహ, జిల్లా అధికారులతో పాటు, డిఇఇటి, సింగరేణి కాలరీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొంటుంది

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ప్రజాపక్షం/మోటకొండూరు : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు అధైర్యపడవద్దని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకొంటుందని అన్నారు. అనంతరం చాడలో కొత్తోజూ వనజ రవి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం యాట పొట్టేలు, పట్టు బట్టలు అందజేశారు. నూతన గృహ ప్రవేశం చేసినందుకు వారికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం బాల రాజు, తహసీల్దార్ నాగదివ్య, ఎంపిడిఓ ఇందిర, ఎపిఎం ఆనంద్, ఆలేరు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్ పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానీ ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతులు ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వ అందిస్తున్న మద్దతు ధరను పొందాలని కోరారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. రైతులు కేంద్రానికి ధాన్యాన్ని ఆరబెట్టి తేవాలని అన్నారు. మార్కెట్ నిర్వాహకులు రైతులకు నీడ మంచి నీరు అందేలా చూడాలని సూచించారు. అనంతరం మండలంలోని మురిపిరాల, రేగులకుంట, సర్వేపల్లి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ రాములు నాయక్, డిఆర్‌డిఏ డీపీఎం బాలరాజు, పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## తేమ 8 నుండి 12 శాతం లోపు ఉండాలి

### పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/మునుగోడు: కాటన్ కార్పొరేషన్ సంస్థ ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు పండించిన పత్తిని అమ్ముకోవడానికి కొత్త యాప్‌ని సృష్టించిందని సిసిఐ ద్వారా పత్తిని అమ్ముకునే రైతులు తప్పనిసరిగా యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె మునుగోడు మండల కేంద్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సలాసర్ బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సంవత్సరం అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని పత్తి రైతులు రెండు మూడు రోజులు ఆగి పత్తిని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తేమ 8 నుండి 12 శాతం లోపు ఉండేవిధంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. మునుగోడు పత్తి కొనుగోలు కేంద్రం అతి ముఖ్యమైందని,ఎల్ 1 సెంటర్ గా ఉన్న ఈ కేంద్రంలో గతంలో రైతులు ఇతర జిల్లాల నుండి పత్తిని తీసుకు వచ్చే వారని, అప్పుడు జిల్లా రైతులు పత్తిని అమ్మడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మునుగోడు కేంద్రంలో 19000 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్నందున చుట్టుపక్కల రైతులకు పత్తి అమ్మకంలో ఎలాంటి ఇబ్బందిలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ,కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి బాలాజీ నింజె, చండూరుఆర్‌డిఓ శ్రీదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపి కృష్ణ ,మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కచలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## అకాల వర్షాలతో రైతన్న కంట కన్నీరు

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా వరి, జొన్న, పత్తి పంటలు పూర్తి స్థాయిలో నీట మునిగి కోత కోసే దశలో చేతికి రాకుండా పోయిందని రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తీర కోత కోసే దశలో చేతికి రాకుండా పోవడంతో రైతన్న తీవ్ర ఆందోళనలో ఎటుపాలుపోలేని దశలో ఉన్నాడు. ఒక వైపు అకాల వర్షాలు, ఒక వైపు నకిలి విత్తనాల వలన రైతులు వేసిన పంట చేతికి వస్తుందో లేదో అని ఎదురు చూసే సమయానికి ఏదో రకంగా రైతన్నకు నష్టం వాటిల్లుతూనే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వద్దకు అధికారులను పంపించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన నష్టపరిహారాన్ని అందించాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు.

## పదిలో అత్యధిక మార్కులు సాధిస్తే సైకిల్ బహుమతిగా ఇస్తా

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/వలిగొండ : విద్యార్థులు పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కష్టపడి చదివి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శుక్రవారం వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్‌లో ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారని రోజు వస్తున్నారా లేదా ప్రిన్సిపాల్‌ని అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం 10 వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎంత వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అందరూ కూడా ఇప్పటినుండే వార్షిక పరీక్షల కోసం ప్రిపేర్ కావాలని సూచించారు. రోజు స్కూల్‌కి రావాలి ఎట్టి పరిస్థితుల్లో కూడా సెలవులు పెట్టకూడదు అన్నారు. 10వ తరగతి అత్యధిక మార్కులు సాధిస్తే మీకు బాసర ట్రిపుల్ ఐటి లాంటి పెద్ద ఇనిస్టిట్యూట్‌లో సీటు వస్తుందని, దానితో మీ భవిష్యత్ బాగుంటుందని జీవితంలోలో స్థిర పడవచ్చన్నారు. గత విద్యా సంవత్సరంలాగే ఈ విద్యా సంవత్సరంలో కూడా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సైకిల్ బహుమతిగా ఇస్తూ మీ తల్లిదండ్రులకు సన్మానం చేయడం జరుగుతుందని, అలాగే జిల్లాకు కూడా మంచి పేరు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నవంబర్19న గిరిజన బంజారాల రిజర్వేషన్-50 సంవత్సరాల స్వర్ణోత్సవం

### పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మాజీ ఎంపి రవీంద్ర నాయక్




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఢిల్లీలో నవంబర్ 19న జరిగే గిరిజన బంజారాల రిజర్వేషన్50 సంవత్సరాల స్వర్ణోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ అన్నారు.శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో స్వర్ణోత్సవ పోస్టర్ ను వారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్ గారు మాట్లాడుతూ ఢిల్లీలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే ఈ స్వర్ణోత్సవ కార్యక్రమంలో గిరిజనులంతా పాల్గొనాలని పేర్కొన్నారు.గిరిజనుల అభివృద్ధికి మొదటి నుంచి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీనేనని తెలిపారు.మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ గిరిజన బంజారాల రిజర్వేషన్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవం సందర్భంగా స్వర్గీయ ఇందిరా గాంధీకి పుష్ప మాల్యార్పణ, సోనియాగాంధీకి పాలాభిషేకం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రధాని ఇందిరా గాంధీ హయంలో డీఎన్టీలో గిరిజన తెగలను ఎస్టిలో చేర్పించడం జరిగిందని పేర్కొన్నారు. గిరిజనులంతా స్వర్ణోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బధ్యానాయక్, పలువురు గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

## పంటకు పరిహారమేది.... పట్టించుకునే దిక్కేది!

### అకాల వర్షాలతో నష్టపోతున్న వరి రైతులు...
### పరిహారం చెల్లింపులో పట్టించుకునేది ఎవరు?
### గత రెండేళ్లుగా అకాల వర్షాలతో నష్టపోతున్న రైతులు

ప్రజాపక్షం/హాలియా: ఆరుగాలను శ్రమించి ఎన్నో వ్యయ ప్రాయసల కోర్చి పండించిన పంటలు... తీరా చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపానికి గురై తీవ్రంగా దెబ్బతింటున్నాయి... కారణమేదైనా గత రెండేళ్లుగా వరి పంట సాగు చేస్తున్న రైతులు అకాల వర్షాల దాటికి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతిలో వచ్చిన మార్పుల వలన కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందక రైతులు అప్పుల పాలవుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఒక నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ఖరీఫ్‌లో సాగుచేసిన సన్న రకం ధాన్యం, బిపిటి వరి చేతికి వచ్చి కోతకు సిద్ధమైంది. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాలకు ఈదురు గాలులకు పంట నేలమట్టమై తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ సమయంలో పంటకోసినా తీసుకునే దిక్కు లేక గిట్టుబాటు ధర రాదనే భయంతో బిక్కుబిక్కుమంటున్నాడు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగుచేసిన సన్న రకాలు దాదాపు 40శాతం పైగానే కోతకు వచ్చాయి. అయితే సన్నాలకు బోనస్ వస్తుందనే ఆశతో రైతులు పెద్ద మొత్తంలో వీటిని సాగు చేశారు. ప్రస్తుతం పంట కోసే స్థితిలో రైతులు లేకపోవడం కోసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమశాతం రావడం అసాధ్యమనే భయం రైతుల్లో నెలకొంది. ఈ క్రమంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లినా తమకు వచ్చే ప్రయోజన కంటే నష్టమే ఎక్కువ అని రైతులు వాపోతున్నారు. అందువలన అధికారులు ప్రస్తుతం పంట చేతికి వచ్చి నేలకొరిగి పూర్తిగా దెబ్బతిన వాటినే క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు తగిన నష్టపరిహారం అందేలా తక్షణం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

### ఎస్‌పి శరత్ చంద్ర పవార్




ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లాలో రౌడీ షిటర్స్ ఎవరైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. జిల్లా పరిధిలో వివిధ కేసులలో ఉన్న దాదాపు 40 మంది ముఖ్యమైన రౌడీ షిటర్లకు పిలిపించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా, ఇతర నేరాలకు పాల్పడకుండా ఉండాలని శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో జిల్లా ఎస్పీ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలు పోలీసుల నిఘాలో ఉన్నాయని,చట్ట వ్యతిరేక కార్యలాపాలు ఆర్థిక,భూసెటిల్మెంట్లు లాంటివి చేస్తూ సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, బెదిరింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, టు టౌన్ సిఐ రాఘవ రావు,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,ఆర్ఐ హరి బాబు,టుటౌన్ ఎస్.ఐ సైదు లు, రూరల్ ఎస్ఐ సైదా బాబు తదితరున్నారు.

**రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగలను స్మరిస్తూ జిల్లా వ్యాప్తంగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్త దాన కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసులతో పాటు యువకులు ఎక్కువ అధిక సంఖ్యలో పాల్గొని దాదాపు 150 యూనిట్లు రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చే యబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ ఎస్‌పి రమేష్,ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాస్ టు టౌన్ సిఐ రాఘవరావు, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్.ఐలు సంతోష్,శ్రీను,హరిబాబు, ఆర్.యస్. ఐలు కళ్యాణ్,రాజీవ్, సాయిరాం, సంతోష్, అశోక్, శ్రావణి సిబ్బంది యువత పాల్గొన్నారు.




## అత్యంత చేరువలో... (మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించుకోవడానికి పెద్దగా తేడాలు ఇప్పుడు లేవని ఒక అధికారి తెలిపారు. ఒప్పందానికి సంబంధించి చర్చలు పురోగతిలో ఉన్నాయని, కొత్త అంశాలేవి ఆటంకాలుగా లేవని చెప్పారు. చాలా అంశాలు కొలిక్కి వచ్చాయన్నారు. అమెరికా, భారత్ మధ్య మొదటి దశ ఒప్పందం దిశగా ఇప్పటి వరకు భారత్,అమెరికాల మధ్య ఐదు సార్లు చర్చలు పూర్తయ్యాయి. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు పురోగతిలో ఉన్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ గురువారం వెల్లడించారు. ఇరు పక్షాలు న్యాయమైన, సమానమైన ఒప్పందానికి త్వరలోనే పూర్తి అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## తమిళనాడులో ఎస్ఐఆర్

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేసిన సత్యనారాయణన్, ఓటర్ల జాబితాను నిర్వహించడంలో క్రమబద్ధమైన వైఫల్యాలు ఉన్నట్లు ఆరోపించారు. నిజమైన ఓటర్లను పెద్దఎత్తున తొలగించడం వల్ల తాను 2021 ఎన్నికల్లో 137ఓట్ల తేడాతో ఓడిపోయానని ఆయన పేర్కొన్నారు. 100 బూత్‌లలో ఇంటింటికి జరిపిన తనిఖీలో నకిలీ ఎంట్రీలు, ప్రవాస ఓటర్లను చేర్చడం, మరణించిన ఓటర్లు ఉన్నట్లు బయటపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ నివేదికలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించినప్పటికీ, ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. బిఎల్‌ఒలు వాస్తవ క్షేత్ర సందర్శనలు లేకుండానే నివేదికలను తయారు చేశారని, ధృవీకరణ ప్రక్రియను దెబ్బతీశారని కూడా ఆయన ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నిష్క్రియాత్మకత 1950 ప్రజాప్రాతినిధ్య చట్టం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కును ఉల్లంఘించిందని పిటిషనర్ వాదించారు. తప్పుడు చేరికలు, తొలగింపులను సరిచేయడానికి ఇసిఐని పూర్తిగా పునఃధృవీకరణ నిర్వహించాలని ఆయన కోర్టును కోరారు. నిర్లక్ష్యం ఎన్నికల సమగ్రత, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. అయితే, అధికార డిఎంకె నాయకులు రాష్ట్ర ఓటర్ల జాబితాల సవరణను తీవ్రంగా వ్యతిరేకించారు. 'తమిళనాడు బిహార్ కాదు. ఇక్కడి ప్రజలకు అవగాహన ఉంది. ఇక్కడ పాలన మరెక్కడా లాగా లేదు; ఇక్కడ మనకు దళపతి నాయకత్వం ఉంది, అలాంటి ఉపాయాలు తమిళనాడులో లేదా మా నాయకుడి వద్ద పనిచేయవు' అని డిఎంకె మంత్రి దురై మురుగన్ గతంలో ఎస్ఐఆర్ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డిఎంకెకు చెందిన కనిమొళి ఎస్ఐఆర్‌ను 'షా ఇంటెన్సివ్ రివిజన్'గా అభివర్ణించారు, బిజెపి తమిళనాడు రాజకీయ గుర్తింపును దెబ్బతీసిందని, 'అన్నాయిజం' నుండి 'అమిత్‌షాయిజం'కి మార్చిందని ఆరోపించారు.




























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com